మే, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 4 పేజీలు: 64 వెల: రూ. 20/-

## అంతర్జాతీయంగా అదే స్ఫూర్తి... దీప్తి 'మేడే'



# గ్రీష్మ తాపంలో పూల వసంతం



(ఊటీ సమ్మర్ ఫెస్టివల్‌లోని ఓ పూల రథం)

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 4

మే, 2010



ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఎన్. విజయ కుమార్**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ పి. రఘునాథరెడ్డి**

**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా,
హైదరాబాద్

ప్రచురణ

**ఎ.ఎం.ఆర్. అపార్డ్**



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : Phanikumar@ap.gov.in


# విషయ సూచిక


సంపాదకీయం ..... 2

ప్రకృతి వైపరీత్యాలు ప్రజా విలయాలు కారాదు ..... 3

పరిపాలనలో నూతన ఒరవడుల ద్వారా అభివృద్ధి సాధిస్తున్న గూగుల్ ఉత్తమ గ్రామాలు ..... 7

కేరళలోని ఆదర్శ గ్రామపంచాయితీల సందర్శన ..... 10

బడుగు జీవుల్లో వెలుగు నింపుతున్న ఉపాధి హామీ పథకం ..... 12

ప్రబంధ రచనకు ఆద్యుడు ఎఱ్ఱాప్రెగడ ..... 14

పంచాయతీల ప్రోత్సాహంతో ముమ్ముందుకు ..... 19

మన మండలం - మన మండల పరిషత్తు ..... 21

వార్తల్లో 'అపార్డ్' ..... 25

వివాహాల నమోదుతో అనేక ప్రయోజనాలు ..... 27

స్థానిక స్వపరిపాలనకు శిక్షణతో నడుం బిగిస్తున్న సింహపురి ..... 30

వేసవి కాలపు టెన్నిస్ సంరంభం ..... 32

అంతర్జాతీయంగా అదే స్ఫూర్తి... దీప్తి మేడే ..... 36

ఆంధ్ర కళాప్రాభమ్మొలికించి తీయగా పాడిన కోయిలమ్మ ..... 40

పంచాయతీల సాధికారతతోనే అభివృద్ధి సాధన (ప్రధాని మన్మోహన్) ..... 42

వైద్యరంగంలో ధృవతార (డా॥ యల్లాప్రగడ సుబ్బారావు) ..... 44

శ్రమైవ జయతే (వెంటాడే వాక్యం) ..... 45

పిచ్చుక గుంట్లు ..... 46

ప్రజా సంక్షేమానికి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు ..... 48

"గ్రామీణ నిరుద్యోగ యువతకు ఆసరా ఇజిఎంఎం" ..... 49

గిడ్డంగి వారి పల్లె ఆదర్శ మహిళా గ్రామ పంచాయతీ ..... 50

అటవీ హక్కుల పునరుద్ధరణకు తోడ్పడే విప్లవాత్మక చట్టం ఇది ..... 51

ప్రణాళికా వికేంద్రీకరణ - కొన్ని సమస్యలు ..... 54

పెయిన్ ఫ్లూ (కథ) ..... 57

నాటేది ఒక్క మొక్క (కథ) ..... 61

మే, 2010

# సంపాదకీయం..

## కార్మిక సంక్షేమమే పరమావధి

ఈనెల ఒకటవ తేదీన అంతర్జాతీయ కార్మిక దినంగా జరుపుకుంటున్నాం. మేడే పేరిట జరిగే కార్యక్రమాలు, ప్రదర్శనలు, ర్యాలీలు, సమావేశాలు, ఉత్సవాలు... అన్నింటా ఒకే స్ఫూర్తి కన్పిస్తుంటుంది. కార్యక్రమం ఏదయినా దాని ఉద్దేశ్యం మాత్రం కార్మిక సంక్షేమమే. కార్మిక సమస్యల పరిష్కారమే.

ప్రపంచీకరణ ప్రభావం బాగా పెరిగిపోయిన వర్తమానంలో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న మాట నిజం. చిన్న పరిశ్రమల కార్మికులు, చేనేత కార్మికులు, బాల కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, ఇట్లా అనేకులు ప్రపంచీకరణ దుష్ప్రభావాల బారిన పడి నలిగిపోతున్నారు.

మన రాష్ట్రంలో చేనేత కార్మికులు గణనీయంగా ఉన్నారు. వీరి సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అనేక చర్యలు తీసుకుంది. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఈ ఏడాది మార్చి 31 వరకు ఉన్న వివిధ రకాల బకాయిలను ప్రభుత్వం రద్దుచేసింది. ఆర్టిజాన్ క్రెడిట్ కార్డుల పథకం, ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన, రాజీవ్ యువశక్తి, చేనేత కారుల గ్రూపుల పథకాల కింద మంజూరైన వివిధ రుణాలు ఈ నిర్ణయంతో రద్దయ్యాయి.

ప్రాథమిక చేనేత సహకార సంఘాలు జిల్లా సహకార సంఘాలకు బకాయిపడ్డ రుణాలు, పిఎంఆర్‌వై, రాజీవ్ యువశక్తి, ఆర్టిజాన్ క్రెడిట్ కార్డులు వంటి పథకాల కింద వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల మాఫీకి ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ రోశయ్య అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే ఒక మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో అందుకు 312 కోట్ల రూపాయలు కేటాయించిన సంగతి తెలిసిందే.

ఈ కమిటీ చేసిన 32 సిఫార్సుల్లో 30 సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించి, ఇప్పటివరకు 22 సిఫార్సులు అమలు చేసింది. మరో ఐదు సిఫార్సులు అమలు చేయడానికి పరిశీలనలో ఉన్నాయి. కొత్తగా రూపొందించిన సమగ్ర చేనేత అభివృద్ధి పథకం కింద ఒక్కొక్క చేనేత క్లస్టర్‌ను 60 లక్షల రూపాయల వ్యయంతో 37 క్లస్టర్లను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. రాష్ట్రంలోని చేనేత గ్రూపులకు 8.81 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. చేనేత సహకార సంఘాలు కొనుగోలు చేసిన నూలు, రంగులు, రసాయనాలపై 10 శాతం సబ్సిడీని కూడా రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది.

అంతేకాక, పావలా వడ్డీని వినియోగించుకోవటానికి ప్రస్తుతం ఉన్న అర్హతను ప్రభుత్వం 15000 రూపాయలనుంచి లక్షరూపాయలకు పెంచింది. ఇతర రంగాలలో ఉన్న చేనేత కార్మికులను సహకార రంగ పరిధిలోకి తీసుకుని వచ్చి ఉపాధిని కల్పించడానికి నూతనంగా 99 చేనేత సహకార సంఘాలను రిజిస్టర్ చేసింది. మరో రెండు సంఘాలను పునరుద్ధరించింది. మర మగ్గాలకు విద్యుత్ ఛార్జీలపై 50 శాతం రాయితీని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రస్తుతం ఉన్న 30 వేల పించన్లకు అదనంగా మరో 50 వేల వృద్ధాప్య పించన్లను కూడా ప్రభుత్వం చేనేత కార్మికులకు కల్పించింది.

చెప్పుకుంటూపోతే, కార్మికుల సంక్షేమార్థం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఎన్నో ఉన్నాయి. ఈ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం కూడా కార్మిక సంక్షేమానికి మరిన్ని బాటలు పరుస్తుందని ఆశిద్దాం.



# ప్రకృతి వైపరీత్యాలు ప్రజా విలయాలు కారాదు





**- బాన్ కి మూన్**
*(ఐక్యరాజ్యసమితి, ప్రధాన కార్యదర్శి)*

**చిలీ, హైతీలను కుదిపివేసిన పెను భూకంపాల నుంచి పాఠాలు నేర్చుకోవటాన్ని ఏ దేశం నిర్లక్ష్యం చేయజాలదు. ఆ విపత్తులు జరగకుండా మనం ఎట్లానూ నిరోధించలేం. అయితే విపత్తులు, పెను ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే ముప్పలను విధ్వంసాన్ని తగ్గించేందుకు మనం సరైన చర్యలను, ముందుగానే చేపట్టగలిగితే, కనీసం వీటి ప్రభావాన్ని తగ్గించవచ్చు.**



## విపత్తులు విరుచుకునిపడే వరకు వేచి వుండవద్దు

ఇటీవల నేను చిలీలో భూకంపం వచ్చిన ప్రాంతాన్ని సందర్శించాను. చిలీ దేశపు నాయకులు గతం నుంచి పాఠాలు నేర్చుకుని, ముందు ముందు రాబోయే విపత్తుల గురించిన హెచ్చరికలను పట్టించుకుని, తదనుగుణంగా చర్యలు తీసుకోవటం వల్ల ఎన్ని లెక్కలేనన్ని ప్రాణాలు కాపాడగలిగారో అక్కడ చూశాను.





భూకంపాల ప్రమాదాన్ని ఎదుర్కొనగలిగేలా భవనాల నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకునేలా కఠినతరమైన నిబంధనలను అమలు చేయటం వల్ల ప్రాణ నష్టం ఎక్కువ కాకుండా చిలీ నాయకులు చేయగలిగారు. ముందుగానే సంబంధిత వ్యక్తులకు శిక్షణ, తగిన పరికరాలు అందించటం వల్ల భూకంపం వచ్చిన క్షణాల్లోనే బాధితులకు సిబ్బంది, సహాయం అందుబాటులోకి వచ్చాయి. వర్తమాన సమస్యలతో పాటు, భవిష్యత్తు సవాళ్లను, ఉపద్రవాలను ఎదుర్కొనే బాధ్యత ప్రభుత్వానికి ఉందనే స్ఫూర్తిని వారు ప్రదర్శించటంతో ఎక్కువ మంది ప్రజలు మరణించకుండా ఆపగలిగారు.

చిలీలో వచ్చిన భూకంపం చిన్నదేమీ కాదు. రిచర్‌స్కేలుపై 8.8 పాయింట్లుగా నమోదైంది. భూకంపాలను నమోదు చేయటం ప్రారంభించాక ఇది ఐదవ అతిపెద్ద భూకంపమని తేలింది. ఇంత భారీస్థాయి భూకంపం వాటిల్లినప్పటికీ, చిలీలో సంభవించిన మరణాలు వందల్లోనే ఉండటం గమనార్హం.

ఇందుకు విరుద్ధంగా, హైతీలో ఇంతకంటే తక్కువ తీవ్రత కలిగిన భూకంపం వచ్చినప్పటికీ, అనేక వేలమంది అక్కడ మరణించారు. హైతీలో అసలు భూకంపాలకు సన్నద్ధతే లేదు. భవన నిర్మాణంలో పాటించవలసిన నిబంధనలంటూ ఏమీ లేవు.



ఈ రెండు దేశాల అనుభవాలనుంచి సర్వదేశాలూ పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. భూకంపాలు కానీ, వరదలు కాని, తుపాన్లు కాని, వడగాల్పులు కానీ ఏ విపత్తులయినా సరే - ఏ దేశమూ వాటికి అతీతం కాదు.



నానాటికీ మొత్తం ఐదు ఉపఖండాలను అతి తీవ్రాతి తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాలు దెబ్బతీస్తున్నాయి. ఉష్ణోగ్రత, వాతావరణాల్లో వస్తున్న మార్పులే ఇందుకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రపంచంలోని అతి పేదల్లో ఎక్కువమంది అటు వరదల జోన్‌లో కానీ, లేకపోతే భూకంపాల జోన్‌లో కానీ, లేదంటే రెండింటి ముప్పు ఉన్న జోన్లలోని అతి ప్రమాదకరమైన, అత్యధిక జనసాంద్రత కలిగిన నగరాల్లో నివశిస్తున్నారు.

విపత్తులకు ముందుగానే సిద్ధంగా ఉండటమనే విధానాలు, సంస్కృతి అన్ని దేశాలకు వ్యాపించవలసి ఉంది. ఈ విషయంలో కొన్ని దేశాలు ముందంజ వేసినందుకు నాకు ఎంతగానో ఆనందంగా ఉంది.

2005 సంవత్సరంలో 168 దేశాలు హ్యోగో కార్యాచరణ ఫ్రేమ్‌వర్క్‌ను ఆమోదించాయి. ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రపంచాన్ని కాపాడి, సురక్షితం చేయడానికి సంబంధించిన నిబంధనలు, అంశాలు ఇందులో ఉన్నాయి.





పరిస్థితులను అంచనా వేసి, ప్రణాళిక, శిక్షణ, ప్రజలకు అవగాహనా కల్పన తదితర ప్రక్రియాల ద్వారా విపత్తుల ప్రభావాన్ని తగ్గించటానికి హ్యోగో ఫ్రేమ్‌వర్క్ ప్రపంచ దేశాలకు ఒక కార్యాచరణ ప్రణాళికను ఇచ్చింది. ఉదాహరణకు పాఠశాలలు, హాస్పిటళ్లు, ఇతర ముఖ్యమైన ప్రజా మౌలిక సదుపాయాలు వంటివి భద్రతా ప్రమాణాలు పాటించేలా చేయటం ఇందులో ముఖ్యమైనది.

హ్యోగో ఫ్రేమ్‌వర్క్ ప్రాతిపదికగా, విపత్తుల ప్రభావాన్ని తగ్గించే చర్యలను ఐక్యరాజ్యసమితి ప్రాధాన్యతాంశాంగా గుర్తించింది. హ్యోగో కార్యాచరణ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి ఒక ప్రత్యేక ప్రతినిధిని నేను నియమించాను. బహ్రెయిన్‌లో విపత్తు ప్రభావం తగ్గింపుపై మొదటి ప్రపంచ అంచనా నివేదికను గత ఏడాది నేను సిద్ధం చేసి, వెల్లడించాను.

## సాధించిన పురోగతి

ఈ విషయంలో కొంత పురోగతి జరిగింది. 1970లో సంభవించిన భోలా తుపాన్‌లో బంగ్లాదేశ్ 5 లక్షల మంది ప్రజలను పోగొట్టుకుంది. తరువాత ఎత్తయిన కాంక్రీటు ప్లాట్‌ఫారాలపై 2,500 తుపాను శిబిరాలను నిర్మించి, బాధితుల తరలింపులో నైపుణ్యం పెంపొందించడానికి 32,000 మంది పైగా వాలంటీర్లకు శిక్షణ ఇచ్చింది. 2007లో సముద్రం భయంకరంగా ఉప్పొంగి, సిదర్ తుపానుగా విరుచుకుపడినప్పుడు బంగ్లాదేశ్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 4000కు మించలేదు. సరిగ్గా ఇదే తీవ్రత కలిగిన నర్గీస్ తుపాన్ మైయన్మార్‌లో 2008 మే నెలలో విరుచుకుపడి 1,40,000 మందిని బలి తీసుకుంది. తుపానును ఎదుర్కొవటానికి అవసరమైన సంసిద్ధత మైయన్మార్ వద్ద లేదు.




2008లో క్యూబా నాలుగు భయంకరమైన తుపాన్లను ఎదుర్కొంది. 9 బిలియన్ డాలర్ల మేరకు భారీ ఆస్తి నష్టం వాటిల్లిగా, అతి కొద్దిమంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు.



ప్రకృతి వైపరీత్యాలకు సన్నద్ధంగా ఉంటే, ఎంత మేలు జరుగుతుందో చూపించే ఇట్లాంటి ఎన్నో ఉదంతాలు ఉన్నప్పటికీ, అనేక దేశాలు నేర్చుకున్న గుణపాఠాలను చాలా త్వరగా మర్చిపోతున్నాయి. హ్యోగో ఫ్రేమ్‌వర్క్ ప్రతిపాదించిన ఆచరణాత్మకమైన ప్రతిపాదనలను, చర్యలను తీసుకోవటంలో అనేక దేశాలు విఫలమయ్యాయి. నిరోధక చర్యల విధానాన్ని తాము అవలంబించ లేమని అనేక దేశాలు వాదిస్తుంటాయి.



అయితే, ఏ దేశం కూడా దీన్ని నిర్లక్ష్య భావనతో చూడరాదని నేను భావిస్తాను.

కాని, ఇటువంటి నిరోధక చర్యల వలన సుదీర్ఘకాలంలో ప్రభుత్వాలు చాలా ధనాన్ని ఆదా చేయడానికి వీలవుతోంది.





ఉదాహరణకు 1960-2000 సంవత్సరాల మధ్య వరదల ప్రభావాన్ని తగ్గించడానికి చైనా 3.15 బిలియన్ డాలర్ల మొత్తాన్ని ఖర్చు చేసింది. ఇది పెద్ద మొత్తమే. అయితే, 12 బిలియన్ డాలర్ల మేరకు చైనా వరదల నష్టాన్ని నివారించుకోగలిగింది.

బ్రెజిల్, భారతదేశం, వియత్నాం తదితర దేశాల్లో కూడా ఇదే విధమైన నష్టనివారణ ఉదంతాలు కొన్ని జరిగాయి.

## ప్రతి ఒక్కరికీ పాత్ర

నిరంతరం వచ్చిపడుతుండే బెడదలతో పాటు అకస్మాత్తుగా ఎదురయ్యే ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొవడానికి ప్రజలను ఎక్కడికక్కడ సంసిద్ధం చేయటానికి కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లోని ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

వరదలు, భూకంపాలు తరచూ వచ్చే ప్రాంతాల్లో భవన నిర్మాణాల్లో అనుసరించవలసిన నియమాలను రూపొందించి, వాటిని కఠినంగా అమలుపరిచేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వరదలు తరచూ వచ్చే ప్రాంతాల్లో తాత్కాలిక నివాసాలను అక్కడి నుంచి తరలించటమో, మెరుగుపరచటమో చేయాలి. సముద్రాల సమీపంలోని మడ అడవులను రక్షించటం, పునరుద్ధరించటం చేయాలి. పట్టణాల్లోని పేదలకు తగిన భూమి సదుపాయాన్ని కల్పించటం, మెరుగైన గృహవసతి చూపించటం, హెచ్చరికలకు ఏర్పాటు చేయటం వంటి చర్యలు తీసుకోవాలి.



ఇటువంటి వాటివల్ల వేలాది, లక్షలాది మంది ప్రజల ప్రాణాలు కాపాడటానికి వీలవుతుంది. లేనిపక్షంలో ఈ అమాయకులు ప్రకృతి వైపరీత్యాలకు బలికావలసిందే. దేశాల స్థాయిలో, ప్రాంతాల స్థాయిలో ప్రకృతి వైపరీత్యాలకు సన్నద్ధతను పెంచేందుకు తగిన చర్యలు చేపట్టడానికి ఆయా ప్రభుత్వాలకు సాయపడేందుకు ఐక్యరాజ్యసమితి సిద్ధంగా ఉంది. దాతృత్వ దేశాలు కూడా ఈ దిశలో ముందుకు రావలసిన అవసరం ఉంది. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉండేందుకు, తగిన చర్యలు చేపట్టేందుకు ఇవి నిధులు సమకూర్చవలసిన అవసరం ఉంది.

వైపరీత్యాలకు ముందుగానే సంసిద్ధంగా ఉండటానికి, లేకపోవటానికి మధ్య ఎంత తేడా ఉంటుందో చిలీ, హైతీ దేశాల్లోని భూకంపాలు నిరూపించాయి. ప్రకృతి వైపరీత్యాలు ప్రజల పాలిట విలయాలుగా మారకముందే మనం చురుగ్గా, తెలివిగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని గుర్తించాలి.

*(అనువాదం: టి. సురేష్ కుమార్)*



# పరిపాలనలో నూతన ఒరవడుల ద్వారా అభివృద్ధి సాధిస్తున్న గూగుల్ ఉత్తమ గ్రామాలు

గ్రామీణ ప్రజలు జీవన ప్రమాణాలలో మార్పును తీసుకొని రావటానికి గ్రామపంచాయతీలు చేస్తున్న ప్రయత్నాలకు ప్రోత్సాహకంగా గ్రామ పంచాయతీ పురస్కార్‌ను గూగుల్. ఓఆర్‌జి ప్రవేశపెట్టింది. ఇంటర్నెట్‌తో పరిచయం ఉన్న వారెవరికైనా ఇట్టే గుర్తుకువచ్చే పేరు గూగుల్. ఇంటర్నెట్‌లో మనకు కావలసిన సమాచారాన్ని శ్రమ లేకుండా క్షణాల మీద వెతికిపెట్టే సెర్చి ఇంజన్లలో గూగుల్‌కు మరొకటి సాటి లేదంటే ఆతిశయోక్తి కాదు. ఇంటర్‌నెట్ సమాచార రంగంలోని దిగ్గజమైన గూగుల్‌కి, గ్రామీణాభివృద్ధికి సంబంధం ఏమిటి? గ్రామపంచాయతీలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాల్సిన అవసరం గూగుల్‌కి ఏమున్నది? అన్న ప్రశ్నలకు సమాధానంగా గూగుల్ ప్రోగ్రామ్ మేనేజర్ సాలిమా శామ్‌జి ఇలా అంటారు. ''క్షేత్ర స్థాయిలో గ్రామపంచాయతీలు చేసే విశేషమయిన కృషివల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నప్పటికీ, పంచాయతీలు చేసే కృషికి సరియైన ప్రచారం లేకపోవటం వల్ల గుర్తింపు రావటంలేదు''. లాభాపేక్షకు తోడు పారిశ్రామిక రంగానికి ఉన్న సామాజిక బాధ్యతలను నిర్వర్తించటంలో భాగంగా గూగుల్‌కు వచ్చే లాభాలలో ఒక్క శాతాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజాసంక్షేమం కోసం ఖర్చుచేయాలనే సంకల్పంతో గూగుల్ ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసిందనీ, ఈ నిధినుండి కొంతమొత్తాన్ని క్షేత్రస్థాయిలో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మంచినీటి సరఫరా, గ్రామీణ అవస్థాపనా సౌకర్యాలు, గ్రామీణ విద్యుదీకరణ, వనరుల సమీకరణ లాంటి 6 రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న ఉత్తమ పంచాయతీలకు ప్రోత్సాహక బహుమతులు అందచేయటం ద్వారా వాటిని వెలుగులోకి తీసుకొని వచ్చి మరిన్ని గ్రామపంచాయతీలకు స్ఫూర్తిని కలిగించటానికి చేసే తొలి ప్రయత్నమే ఈ గూగుల్ గ్రామ పురస్కారాలను అందచేసే కార్యక్రమమంటారు శ్రీ సాలిమా శామ్‌జీ.

గూగుల్ ప్రారంభించిన తెలియపర్చు-సశక్తీకరించు (ఇన్‌ఫార్మ్- ఎంపవర్) యత్నంలో భాగంగా భారతదేశంలో తొలిసారిగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలోని 49 జిల్లాలలోని 27,492 గ్రామపంచాయతీల నుండి ఒక్కో రాష్ట్రంనుండి 5 ఉత్తమ గ్రామపంచాయతీలను గుర్తించే ప్రక్రియను 2008 డిసెంబరు-2009 జనవరి మధ్యలో ప్రారంభించిన గూగుల్ ఇటీవల ఉత్తమ గ్రామపంచాయతీల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసింది. ఎంపిక చేయటానికి తీసుకొన్న పరామితులలో (1) గ్రామ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ప్రజా భాగస్వామ్యం, ముఖ్యంగా ఎస్.సి, ఎస్.టి, బి.సి., మహిళలు వంటి అణగారిన వర్గాలకు చెందిన ప్రజల భాగస్వామ్యం ఏ మేరకు ఉన్నది (2) గ్రామసభల నిర్వహణ తీరు, తీర్మానాల అమలు (3) రికార్డుల నిర్వహణ (4) పంచాయతీ ద్వారా అమలు చేయబడే కార్యక్రమాలకు విడుదలైన నిధుల వినియోగం, పనులలో నాణ్యతా సంబంధ విషయాలపై ప్రజలకు సమాచారం అందుబాటు (5) ప్రజాసేవల కల్పనలో ఇతర పథకాలను/కార్యక్రమాలను వినియోగించుకోవటం వంటివి ముఖ్యమైనవి. వివిధ పంచాయతీలనుండి గూగుల్‌కు అందిన దరఖాస్తులను పైన పేర్కొన్న ప్రమాణాల ప్రకారం పరిశీలించిన అనంతరం మనరాష్ట్రం నుండి గంగదేవిపల్లి (వరంగల్ జిల్లా), కొండాపూర్ (వరంగల్ జిల్లా), పాండురంగాపురం (కర్నూలు జిల్లా), జేగురుపాడు (తూర్పుగోదావరి జిల్లా), మేడేపల్లి (ఖమ్మం జిల్లా) గ్రామపంచాయతీలను గూగుల్ ఉత్తమ గ్రామపంచాయతీ పురస్కారాలకు ఎంపికచేయటం జరిగింది. ఈ పురస్కారం క్రింద ప్రతీ





SthanikaPalanaTel_May_2010_Colour.pmd 17 4/29/2010, 5:49 PM

గ్రామపంచాయతీకి రూ 5.00 లక్షలు ప్రోత్సాహక బహుమతులకు గూగుల్ ఇప్పటికే చెక్కుల రూపంలో ఇప్పటికే గ్రామపంచాయతీలకు అందచేసింది కూడా.

అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ ప్రజలకు మౌలిక సేవలదించటంలో ఈ ఐదు గ్రామపంచాయతీలు తమదైన శైలిలో విశేషమయిన సేవలు చేస్తున్నాయి. ఈ పంచాయతీల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

## పాండురంగాపురం

కర్నూలు జిల్లా నంద్యాల మండలం నంద్యాలకు 7 కి.మీ దూరంలో ఉన్న పాండురంగాపురం గ్రామపంచాయతీ గ్రామ ప్రజల సమిష్టికృషికి మారుపేరుగా రాయలసీమ ప్రాంతంలో ఆదర్శ గ్రామంగా మన్ననలు అందుకుంటోంది. 1957 ప్రాంతంలో గుంటూరు జిల్లానుండి వలస వచ్చిన 15 కుటుంబాలతో అప్పటి చాపిరేవుల గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పడిన ఈ గ్రామం దినదిన ప్రవర్థమానమవుతూ గ్రామ అభివృద్దిలో ప్రజాభాగస్వామ్యం ద్వారా అభివృద్ధి ఫలాలను గ్రామ ప్రజలందరకూ ఏవిధంగా అందచేయవచ్చునే అన్న అంశంలో పలు గ్రామాలకు మార్గదర్శిగా నిలిచింది. గ్రామ నిర్మాణ సమయంలో శ్రీయుతులు యరబోలు సుబ్బారెడ్డి, వంగా సూర్యనారాయణరెడ్డి, కొండా బసివిరెడ్డి వంటి అప్పటి గ్రామపెద్దల ముందుచూపుతో కుందూ నది వరద ప్రభావానికి ఏమాత్రం లోనుకాని ఎత్తైన ప్రాంతాన్ని ఆవాస ప్రాంతంగా ఎంపికచేసుకొని, గ్రామ నిర్మితిని ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించుకొన్నారు. గ్రామంలో ఎటుచూసినా 36 అడుగుల వెడల్పైన అంతర్గత రహదారులు, విద్య, ఆరోగ్యం, వినోదం, సామాజిక వికాసంకోసం మొదలైన అన్ని సామాజిక వసతులకు ప్రత్యేకించి కేటాయించిన స్థలాలతో అలరారుతున్న గ్రామం ఈ పాండురంగాపురం. గ్రామానికి పాండురంగాపురం పేరును లాటరీపద్ధతిలో నిర్ణయించిన



నాటినుండి అవలంబించిన ప్రజాస్వామ్య విధానాలు నేటి వరకూ గ్రామంలో పాటించటం వల్ల అభివృద్ధి సాధనలో ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా వివిధ కమిటీల ఏర్పాటు ద్వారా అభివృద్ధిలో ప్రజలను పూర్తిస్థాయిలో భాగస్వామ్యులను చేయటంలో ఈ గ్రామపంచాయతీ ప్రత్యేకంగా నిలచింది.

1957 నుండి చాపిరేవుల గ్రామపంచాయతీకి మజారా గ్రామంగానే ఉన్న పాండురంగాపురం గ్రామం 1997 లో ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడింది. గ్రామ పంచాయతీ ఏర్పడిన నాటి నుండి గ్రామ పంచాయతీ ప్రతినిధులను (2001,2006) ఏకగ్రీవంగానే ఎన్నుకొంటున్నారు. మొదటి సర్పంచ్ పదవి విడత మహిళకు రిజర్వు, కాగా, ప్రస్తుతం యరబోలు ఉమామహేశ్వరరెడ్డి సర్పంచ్‌గా ఉన్నారు. గ్రామం ఏర్పడిన నాటినుండి గ్రామపంచాయతీ విధుల నిర్వహణలో సహకరించటానికి గాను వివిధ రంగాలకు కమిటీలను ఏర్పరచి ఈ కమిటీల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తోంది. ప్రస్తుతం గ్రామంలో గ్రంధాలయ కమిటీ, గ్రామ నిర్మాణ కమిటీ, విద్యాకమిటీ, ఆరోగ్యకమిటీ, శిశుసంరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణ కమిటీ, రహదారుల నిర్వహణ, ఆలయ నిర్వహణ కమిటీ, పశు సంరక్షణ కమిటీ, రైతు సంక్షేమ కమిటీ, కేబుల్ టి.వి. కమిటీ, కొలగారం కమిటీ, కావలి కమిటీ, త్రాగునీటి కమిటీ, మహిళా చైతన్య కమిటీలు పనిచేస్తున్నాయి. గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరగాలన్నా గ్రామ సభలో చర్చించాల్సిందే. ఈ కమిటీల పనితీరుని, ఆదాయ వ్యయ వివరాలను కూడా గ్రామ సభ సమీక్షిస్తుంది.

గ్రామపంచాయతీలో ఏర్పడిన అన్ని కమిటీలలో ఆలయనిర్వహణ కమిటీది కీలక స్థానం. ప్రజాభాగస్వామ్యాన్ని కోరే కీలక ప్రతిపాదనలు అన్నీ గ్రామసభకంటే ముందుగా ఈ కమిటీలో చర్చించి తదుపరి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. ప్రజలందరిలో గల భక్తిభావం, పాండురంగని చుట్టూ పరిభ్రమిస్తూ గ్రామానికి చేస్తున్న సేవ అ పాండురంగడికి చేస్తున్నట్లుగా గ్రామస్థులంతా భావిస్తుండటం ఈ గ్రామం ప్రత్యేకత.

గ్రామానికి కేబుల్ టి.వి ప్రసారాలకోసం ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటుచేసుకొని రూ లక్షరూపాయల ప్రజావిరాళంతో డిష్ ఆంటెన్నా రిసీవర్ కొనుగోలు చేసి దీని ద్వారా గ్రామస్థులకు సంవత్సరానికి రూ 250/ -లకే వినోదాన్ని అందింస్తోంది పాండురంగాపురం గ్రామపంచాయతీ. గ్రామంలో ఏర్పాటు చేసుకొన్న గ్రంధాలయంలో దిన, వార, మాస పత్రికలు, ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ వంటి ఉద్యోగ సమాచార పత్రికలు, నవలలు, పురాణ అధ్యాత్మిక గ్రంధాలను పఠనాసక్తి గల వారి కోసం అందుబాటులో ఉంచి, ప్రజలలో విజ్ఞానం పెంపొందించటం కోసం పంచాయతీ కృషి చేస్తోంది.






SthanikaPalanaTel_May_2010_Colour.pmd 18 4/29/2010, 5:49 PM

తొలిరోజులలో గ్రామస్థులంతా త్రాగునీటి అవసరాల కోసం భూగర్భజలాల మీదే ఆధార పడినప్పటికీ, భూగర్భజలాలలో ఫ్లోరైడ్ పరిమాణం పరిమితులకు మించి ఉండటంతో ప్రజలు అనారోగ్యం పాలవటం గమనించిన గ్రామపెద్దలు కుందూనది నీటిని పాండురంగాపురం గ్రామానికి పైపులైన్ల ద్వారా పొందటానికి ప్రభుత్వ సహకారంతో రక్షితమంచినీటి పథకాన్ని నిర్మించుకోవటానికి నడుం బిగించారు. కుందూనదినుండి వచ్చేనీటిని గ్రామంలో నిల్వ చేసుకోవటానికి మంచినీటి చెరువునిర్మాణ అవసరాన్ని గుర్తించిన ప్రజలు సమిష్టిగా చర్చించుకొన్న మీదట గ్రామంలో 12 మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎ.8.38 సెంట్ల భూమిని మంచినీటి చెరువుకోసం ఉచితంగా పంచాయతీకి అందచేసారు.

గ్రామంలో జరుగుతున్న అభ్యుదయ ప్రగతిని గమనించిన రాలిస్ఇండియా లిమిటెడ్ వారు చెరువు నిర్మాణానికి రూ 80000/లు విరాళం అందచేయగా, గ్రామస్థులు కూడా శ్రమదానం చేసి చెరువునిర్మాణాన్ని చేపట్టారు. రక్షిత నీటి పథక నిర్వహణకు త్రాగునీటి కమిటీని ఏర్పర్చుకొని నిర్ణీత రుసుం చెల్లించిన పిదప (రూ 2500/ - నుండి రూ1500/ వేరు) - ఇంటింటికీ కుళాయి కనెక్షను ఏర్పాటుచేసారు. త్రాగునీటిని పొందుతున్న ప్రతి గృహానికీ రూ. 50/-లు వినియోగ రుసుమును నిర్ణయించుకొని రక్షిత మంచినీటి పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించుకుంటున్నారు.

మంచినీటి సరఫరా సమయంలో విద్యుత్ అంతరాయాలను అధిగమించటానికి సైతం గ్రామస్థులు పంచాయతీకి విరాళాలందచేసి, జనరేటరు సౌకర్యాన్ని ఏర్పాటుచేసుకొన్నారు. రక్షితమంచినీటి పథకం ద్వారా ప్రజలు మంచినీటిని పొందుతున్నప్పటికీ, కుందూనది నీరు పాండురంగాపురం గ్రామానికి చేరే మధ్యలో నంద్యాల పట్టణం మీదుగాను, పంటాకాల్వల ద్వారా ప్రవహించటం వల్ల సాధారణ ఇసుక ఫిల్టర్లు, బ్లీచింగుపౌడరు ట్రీట్‌మెంట్ల ద్వారా కూడా శుభ్రపర్చలేనంతగా మాలిన్యాలు, నీటిలో పేరుకొని పోవటం మరొక సమస్యగా పరిణమించింది. ఈ సమస్యను కూడా అధిగమించటానికి ప్రజలు మళ్ళీ సమాలోచనలు జరిపిన మీదట రివర్సు ఆస్మోసిస్ నీటిశుద్ధి ప్లాంటును గ్రామంలో నిర్మించుకోవాలని సంకల్పించుకొని, గ్రామస్థులంతా విరాళాలు సేకరించి ప్రధాన గ్రామంలో ఒక రివర్సు ఆస్మోసిస్ ప్లాంటు, బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎస్.సి. కాలనీలో ఒక రివర్సు ఆస్మోసిస్ ప్లాంటు నిర్మించుకొన్నారు. నేడు గ్రామంలో ప్రతీఒక్కరు స్వచ్ఛమైన మంచినీటిని పొందుతూ నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల నుండి పూర్తిగా రక్షణ పొందారు.

పారిశుధ్యరంగంలో కూడా గ్రామంలో సంపూర్ణ పారిశధ్య ప్రచార కార్యక్రమం అర్హులైన కుటుంబాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు చేయించుకొని, కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవటంతో పాటు, గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చి, గ్రామాన్ని నిర్మల గ్రామ పురస్కారం పొందే స్థాయికి తీసుకొని వెళ్ళటంలో గ్రామస్థులు చేసిన కృషికి 2007 లో కేంద్రప్రభుత్వ నిర్మల గ్రామ పురస్కారం ఈ గ్రామపంచాయతీ చేజిక్కించుకొంది. ప్రజలందరికీ సురక్షిత త్రాగునీరు అందచేయటానికి, సంపూర్ణ పారిశుధ్య సాధనకు ఈ గ్రామపంచాయతీ చేసిన విశేషమయిన కృషికి గూగుల్ ఉత్తమ గ్రామపంచాయతీ పురస్కారం ఈ గ్రామ పంచాయతీ దక్కించుకుంది.

పూర్తి పారదర్శకతతో, ప్రజలకు జవాబుదారీతనంతో ప్రజలకు సేవలందించటానికి గ్రామపంచాయతీ, వివిధ కమిటీలు అందచేస్తున్న సేవలు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు బాటలు వేశాయి. నేడు గ్రామంలో సంపూర్ణ అక్షరాస్యత, ప్రజలందరికీ శుద్ధిచేయబడిన సురక్షిత త్రాగునీరు, సంపూర్ణ పారిశుధ్య సాధన, కచ్చా డ్రైన్లయినప్పటికీ గ్రామంలో నీరు నిల్వ లేకుండా చక్కటి మురుగునీటి పారుదల పద్ధతులు, పశువులకొరకు ప్రత్యేకమయిన త్రాగునీటి చెరువు, బడి ఈడు కల విద్యార్థులు నూరు శాతం పాఠశాలలో విద్యనభ్యసించటం, గ్రంథాలయం, మహిళలందరూ స్వయంసహాయక సంఘాలలో చేరి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చుకోవటం, రైతులందరూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించటం, కొత్త వంగడాలను వినియోగించటం ద్వారా అధిక దిగుబడులను సాధించటం వంటి ఎన్నో విశేషాలకు నెలవు ఈ పాండురంగాపురం గ్రామపంచాయతీ. మరిన్ని వివరాలకు గాను www. Pandurangapuram.org ని సందర్శించండి.




- ***డా.వి. శివశంకర ప్రసాద్,***
జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డు



SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 11 4/29/2010, 3:02 PM

**సర్పంచులకు ఉత్తమ పంచాయితీల సందర్శన కార్యక్రమం 'అపార్డు' పెద్దఎత్తున చేపట్టింది. ఈ సందర్భంగా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం పరిధిలోని 5 జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి నుంచి ప్రతి జిల్లాకు 33 మంది సర్పంచులు చొప్పున ఒక బృందంగా ఏర్పడి డిసెంబరు 2009, జనవరి 2010 నెలలో కేరళ రాష్ట్రంలోని త్రిసూరు జిల్లాలోని ఉత్తమ పంచాయతీలను సందర్శించారు. సదరు సందర్శన కార్యక్రమాలకు ఆయా జిల్లాల జిల్లా పరిషత్ చైర్ పర్సన్లు, జిల్లా ముఖ్య కార్య నిర్వహణాధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు, విస్తరణ శిక్షణాకేంద్రం ప్రిన్సిపాల్‌లు ఆధ్వర్యం వహించారు.**

కేరళ రాష్ట్రంలోని త్రిసూరు జిల్లాలోని కేరళ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ (KILA), సామర్లకోట విస్తరణ శిక్షణాకేంద్రం ఫ్యాకల్టీల సమన్వయంతో కేరళ రాష్ట్రంలోని వివిధ ఉత్తమ గ్రామపంచాయతీలను వీరు సందర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా సర్పంచ్‌లు తేది. 5-12-09 నుండి 10-12-09 వరకు అడాట్ మరియు తైకాయిడ్ ఆదర్శ గ్రామపంచాయతీలను, విజయనగరం జిల్లా సర్పంచ్‌లు తేది.18-12-09 నుండి 24-12-09 వరకు టెక్కంకుర, పున్నాయరకులం ఆదర్శ గ్రామపంచాయతీలను, తూర్పుగోదావరి జిల్లా కేరళ రాష్ట్రంలో 1223 ప్రభుత్వాలే. రాష్ట్రం ఒక ప్రభుత్వంగా పాలన కొనసాగుతుంది.

కేరళ రాష్ట్ర సందర్శనలో సర్పంచులు ఈ అంశాలను పరిశీలించారు.

1. గ్రామపంచాయతీ పరిపాలనా విధానంవిశాఖపట్టణం జిల్లా సర్పంచులు 2. పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు 3. త్రాగునీటి నిర్వహణ 4. ఆరోగ్య కార్యక్రమాలు 5. అక్షరాస్యత 6. ప్రణాళిక రచన, ప్రజల భాగస్వామ్యం 7. వివిధ సంక్షేమ పథకాలైన కుటుంబ శ్రీ, అంగన్‌వాడీ, గృహనిర్మాణం, పెన్షన్ల పంపిణీ మొదలైన కార్యక్రమాల అమలు తీరును అధ్యయనం చేయడం జరిగింది.

సర్పంచ్‌లు ముఖ్యంగా గమనించిన అంశాలు ఏమంటే 73వ రాజ్యాంగ సవరణ ద్వారా కేరళ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకు నాలుగు ముఖ్య అంశాలు బదలాయించింది. నాలుగు విభాగాలుగా వాటిని పేర్కొనవచ్చు.

1. Functions (విధులు) 2. Functionaries (ఉద్యోగులు) 3. Funds (నిధులు) 4. Freedom (పూర్తి స్వేచ్ఛ)

పై 4 అంశాలను పూర్తి స్థాయిలో బదలాయించి స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి కేరళ ప్రభుత్వం బాటలు వేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా 4వ అంశమైన స్వేచ్ఛను అన్ని పంచాయతీలకు కేరళ

# కేరళలోని ఆదర్శ గ్రామపంచాయతీల సందర్శన

సర్పంచ్‌లు తేది. 20-01-2010 నుండి 25-01-2010 వరకు వడకంచేరి, పూక్కోడ్ ఆదర్శ గ్రామపంచాయతీలను, శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌లు తేది. 24-01-2010 నుండి 30-01-2010 వరకు ముల్లన్ కున్నత్తుకావో, తైకాయిడ్ ఆదర్శ గ్రామ పంచాయతీలను, విశాఖపట్టణం జిల్లా సర్పంచులు తేది. 26-01-2010 నుండి 01-02-2010 వరకు అవనూరు, కడవురం ఆదర్శ గ్రామపంచాయతీలను సందర్శించి అక్కడి పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేశారు.



73వ రాజ్యాంగ సవరణ ద్వారా కేరళ ప్రభుత్వం గ్రామపంచాయతీలకు 29 అంశాలను 1997 సంవత్సరం నుండి పూర్తి స్థాయిలో బదలీ చేసింది. కేరళలో అధికార వికేంద్రీకరణ పూర్తిస్థాయిలో అమలు జరుగుతోంది. కేరళ రాష్ట్రం మొత్తం జనాభా 3.23 కోట్లు. కేరళ రాష్ట్రంలోని మొత్తం 999 గ్రామపంచాయతీలు, 152 బ్లాక్ పంచాయతీలు,14 జిల్లా పంచాయతీలు, 53 మున్సిపాలిటీలు, 5 కార్పోరేషన్‌లు కలిపి 1223 ప్రభుత్వాలుగా పరిపాలన సాగిస్తున్నాయి. ఇవి ప్రభుత్వం ఇచ్చింది. ఈ విధమైన స్వేచ్ఛ ద్వారా అన్ని పంచాయతీలు తమ నిధులు, విధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికల ద్వారా నిర్వహించుచున్నాయి. ఇంకో ముఖ్య విషయం కేరళ రాష్ట్రంలో సర్పంచ్ అంటే చీఫ్ ఎగ్జిక్యూటివ్. అతనే/ఆమే అన్నిటికీ పెద్ద. సర్పంచ్ ఎన్నిక పరోక్ష పద్ధతిలో జరుగుతుంది. వార్డు మెంబర్లచే ఎన్నికోబడతారు. గ్రామపంచాయతీలో జనాభా ప్రాతిపదికన 10 నుండి 23 మంది వార్డు సభ్యులు ఉంటారు. గ్రామపంచాయతీ జనాభా 5000 నుండి 55,000 వరకు ఉంటుంది. అభివృద్ధి జనాభా ప్రాతిపదికన గ్రామపంచాయతీలను స్పెషల్ గ్రేడ్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3గా విభజించారు. సర్పంచ్ గౌరవవేతనం రూ. 4,500/-లు వార్డు మెంబరు గౌరవవేతనం రూ. 1500/-లు. గ్రామపంచాయతీలో సుమారు 15 మంది రెగ్యులర్ స్టాఫ్, వివిధ శాఖలకు సంబంధించిన 200 మంది ట్రాన్స్‌ఫర్ ఉద్యోగులు పనిచేస్తారు. గ్రామపంచాయతీలో లోకల్‌బాడీ ఆడిటింగ్, పెర్‌ఫార్మెన్స్ ఆడిటింగ్‌లు జరుగుతాయి. గ్రామపంచాయతీ పరిపాలనలో భాగంగా



SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 4/29/2010, 3:02 PM

నిధులు, విధుల నిర్వహణ పరిశీలించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు ఇవ్వడం జరుగుతుంది. ప్రతి పంచాయతీకి సంవత్సరానికి ఒక కోటి నుండి 5 కోట్లు వరకు వివిధ వనరుల ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఈ ఆదాయం 1. సొంత వనరుల నుండి 2. ప్లాన్ ఫండ్ 3. గ్రాంట్స్-1. మెయింటెనెన్స్ గ్రాంట్స్ 2. జనరల్ పర్పస్ గ్రాంట్స్ 4. స్టేట్ స్పాన్సర్డ్ స్కీమ్స్ 5. సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ 6. బెనిఫీషియరీ ఫండ్స్

ఈ నిధులను 20% మించకుండా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులకు (రోడ్లు, భవనాలు మొదలగునవి) 40%కు తక్కువ కాకుండా ప్రొడక్టివ్ సెక్టారు పనులకు (అగ్రికల్చర్, ఇరిగేషన్, ఇండస్ట్రీస్ మొదలగునవి), 40% నిధులను సర్వీస్ సెక్టార్ పనులకు (ఆరోగ్యం, విద్య హౌసింగ్, త్రాగునీరు, శానిటేషన్ మొదలగునవి) ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయడం జరుగుతుంది. గ్రామపంచాయతీలో వివిధ అభివృద్ధి పథకాలు సంక్షేమ కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పర్యవేక్షించడానికి మూడు స్థాయి సంఘాలు ఉన్నాయి. 1. ఆర్థిక కమిటీ 2. అభివృద్ధి కమిటీ 3. సంక్షేమ కమిటీ

ఆర్థిక కమిటీకి ఉపసర్పంచ్ అధ్యక్షునిగా వ్యవహరిస్తారు. మిగిలిన కమిటీలకు వార్డు మెంబర్లు నుండి ఒకరిని అధ్యక్షునిగా ఎన్నుకొంటారు. కమిటీలకు కన్వీనర్‌గా సంబంధిత అధికారులు ఉంటారు. సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్వహించే గ్రామసభ 3 నెలలకు ఒకసారి చొప్పున, సంవత్సరానికి 4 గ్రామసభలు నిర్వహించడం కేరళ రాష్ట్రంలో ఒక ప్రత్యేకత. కేరళ రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయం. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉంది. ప్రతి ఇల్లు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటుంది. బహిరంగ మల, మూత్ర విసర్జనపై స్వచ్ఛందంగా నిషేధం విధించుకొన్నారు. ముఖ్యంగా ప్రతి ఇంటిలోని మురుగునీరు, ఇంటి వెనుక ఉన్న మొక్కలు, చెట్లకు సరఫరా అయ్యే విధంగా ఏర్పాటు చేసుకొన్నారు. ఆ విధంగా చేయటం వలన ప్రతి ఇల్లు కూడా పారిశుధ్య నిర్వహణలో పాలు పంచుకొంటున్నది. త్రాగునీటి పథకాల నిర్వహణ పంచాయతీ స్థాయిలో సక్రమంగా అమలు జరుగుతోంది. ఇ.ఎమ్.ఎస్. (ఇ. ఎమ్. ఎస్ నంబూద్రిపాద్) హౌసింగ్ పథకం క్రింద షెడ్యూల్డ్ లబ్ధిదారులకు రూ. 1,25,000/-లు, షెడ్యూల్డ్ కులాల లబ్ధిదారులకు రూ.1,00,000/-, ఇతరులకు రూ.75,000/- లు మంజూరు చేస్తారు. ఇంటిని నిర్మించేటప్పుడు పొగ లేని పొయ్యి విధిగా నిర్మించుకోవాలి. ఈ ప్రాతిపదికన 95 శాతం ఇళ్ళ నిర్మాణం పూర్తి చేయడమైనది. మిగిలిన 5 శాతం అనగా సుమారు 4 లక్షలు 3 సంవత్సరాలలో పూర్తి చేయటానికి చర్యలు తీసుకొంటుంది.

మన రాష్ట్రంలాగే కేరళ రాష్ట్రంలో కూడా వివిధ పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. వృద్ధాప్యం, వితంతువు, వికలాంగుల పెన్షన్లతో పాటు, 18-35 సంవత్సరాల మధ్య గల నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి క్రింద రూ. 200/-లు అవివాహిత పెన్షన్ల క్రింద వివాహం కాని 50 సంవత్సరాలు దాటిన మహిళలకు రూ. 200/- లు చొప్పున, వ్యవసాయ కూలీలకు నెలకు రూ.250/- లు చొప్పున పెన్షన్లు ఇవ్వడం జరుగుతుంది.




మహిళా చైతన్యం కొరకు కేరళ రాష్ట్రంలో ప్రత్యేకంగా కుటుంబశ్రీ అమలు జరుగుతోంది. ఈ పథకం ఆంధ్రప్రదేశ్‌లోని ఇందిరాక్రాంతి పథంలా విజయవంతంగా అమలుజరుగుతోంది. ఈ పథకం మూడు అంచెలలో అమలు జరుగుతోంది. మొదటి స్థాయి కుటుంబస్థాయిలో 10 నుండి 15 మంది మహిళలతో నైబర్‌హుడ్ గ్రూపుగా ఏర్పాటు జరుగుతుంది. నైబర్‌హుడ్ గ్రూప్‌లో ప్రెసిడెంట్, సెక్రటరీ, ముగ్గురు వాలంటీర్లు ఉంటారు. కుటుంబ ఆర్థిక వ్యవహారాలు, ఆరోగ్య వ్యవహారాలు మరియు కుటుంబ కనీస అవసరాలను ముగ్గురు వాలంటీర్లలో ప్రతిదానికి ఒకరు చొప్పున పర్యవేక్షణ చేస్తూ, కుటుంబ పురోభివృద్ధికి తోడ్పతున్నారు. రెండవ స్థాయి అయిన వార్డు స్థాయిలో 7గురు మెంబర్లతో ఏరియా డెవలప్‌మెంట్ సొసైటీగా ఏర్పాటు చేసుకుంటుంది. మూడవ స్థాయి అయిన పంచాయతీ స్థాయిలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఏర్పాటు చేసుకొని మహిళా ప్రగతికి పాటుపడుతున్నారు.

గ్రామపంచాయతీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అభివృద్ధికి సిబ్బందిని కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ప్రతి గ్రామపంచాయతీ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీలకు 5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తుంది. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీలు తమకు కేటాయించిన 5 లక్షల నుండి ప్రతి నైబర్‌హుడ్ గ్రూప్‌కు రూ, 5,000/-లు మ్యాచింగ్ గ్రాంటు, రూ. 5.000/-లు రివాల్వింగ్ ఫండ్ గ్రాంటుగా అందజేయడం జరుగుతుంది.

పథకాల అమలులో కేరళ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా ఉంది. ఏ పథకం అమలు చేయాలన్నా వార్డు, గ్రామ సభల ద్వారా సర్వే నిర్వహించి కమిటీల ఆమోదం తెలిపిన తరువాత గ్రామపంచాయతీచే అమలు పరచడం జరుగుతుంది. వార్డు, గ్రామసభలలో ప్రజలందరు పాల్గొని గ్రామ సమస్యలను చర్చించి ఉమ్మడిగా పరిష్కార మార్గాలను కనుక్కొంటారు. ఇక్కడ ప్రజలలో అక్ష్యరాస్యత శాతం అధికంగా ఉండటం, శాస్త్రీయ ధృక్పథం కలిగి ఉండటం వంటి అంశాల మూలంగా ప్రజలంతా గ్రామాల పురోభివృద్ధి తద్వారా కేరళ రాష్ట్ర సౌభాగ్యానికి దోహదపడుతున్నారు.

– కె. గౌరీ శంకరరావు, ఫ్యాకల్టీ మెంబర్
– ఎస్. మధుసూధన్, ఫ్యాకల్టీ మెంబర్
– సి.హెచ్. సీత, ఫ్యాకల్టీ మెంబర్
– డి. గోవిందరావు, ఫ్యాకల్టీ మెంబర్


SthanikaPalanaTel_May_2010_Black&White.prn 4/29/2010, 3:02 PM




# బడుగు జీవుల్లో వెలుగు నింపుతున్న ఉపాధి హామీ పథకం

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామాలలో నివసిస్తున్న పేద ప్రజలకు ఒక వరం లాంటిది. వలసల నివారణ, జీవనోపాధి, పెంపుదల వల్ల గ్రామాలలో ఆర్థిక అసమానతలు తొలగి జీవన ప్రమాణాన్ని మెరుగు పరుస్తున్నాయి.**

కూలీల వేతనాలు సకాలంలో చెల్లింపు, విధి విధానాల అమలు ప్రక్రియ గూర్చి సామాజిక తనిఖీ ప్రవేశపెట్టిన ఘనత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానిదే. ఈ విధానంలో మిగతా రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శనీయం. నిరంతరం పర్యవేక్షణ, పేద ప్రజలకు వేతనాలు సకాలంలో చెల్లించాలనే సదుద్దేశం, అవినీతి రహిత పథకంగా వుండాలనే దృఢ నిశ్చయం, రాష్ట్ర అధికారుల కృషి వల్ల ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి హామీ పథకం విజయవంతమయ్యింది.

రాష్ట్రంలోని 23 జిల్లాల్లో హైదరాబాద్ జిల్లా మినహా మిగతా 22 జిల్లాలలో 1099 మండలాలలో 21,857 గ్రామ పంచాయితీలలో ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం జాబ్ కార్డులు జారీ చేసిన సంఖ్య 1,18,87,598 వుండగా, అందులో ఉపాధి పొందిన కూలీల్లో అత్యధికంగా స్త్రీలు ఉండటం విశేషం.

**"కూడబెట్టిన ప్రతి పైస కుటుంబానికి ఉపయోగించాలనే సదుద్దేశ్యం"** కలిగిన మహిళలు ఉపాధి పనులలో కూడా ఎక్కువ సంఖ్యలో హాజరయి పనులు చేయటం హర్షనీయం. ఉపాధి పొందిన మహిళా కూలీల సంఖ్య 80,54,607 కాగా, పురుష కూలీల సంఖ్య 69,50,752. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఖర్చు చేసిన రూ॥లు లక్షలలో 74,90,88.13. సగటున రాష్ట్రంలో పని దినాలు కల్పించినవి 45.55% ఉండగా, 100 రోజుల పని దినాలు చేసిన వారి సంఖ్య 15,35,703 గా నమోదు అయినవి.

జిల్లాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కలెక్టర్ల పర్యవేక్షణ, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆధ్వర్యంలో పటిష్టంగా గ్రామ సభల ద్వారా, ప్రణాళికలు తయారు చేసి అమలు పరుస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి దిశగా, వలసల నివారణకు నడుం బిగించి ఉన్న గ్రామాలలోనే పనులు కల్పిస్తున్నారు. తద్వారా కుటుంబ సభ్యులంతా ఒకే చోట, ఒకే గృహంలో ఉండి పనులు చేస్తూ వసుదైక కుటుంబంలా ఉంటున్నారు.

## నిరంతర మార్పు

గ్రామాలలో పనిచేసే వారికి గతంలో పనులు లేక, అనేకచోట్ల వలస బాట పట్టిన శ్రామికులు కోకొల్లలు. వలస బాట పట్టకుండా ఉండటానికై భారత ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ అనంతపురం జిల్లా బండ్లగూడెం గ్రామంలో 2006 ఫిబ్రవరి 02 న ప్రారంభించి కూలీలకు వరప్రసాదంగా ఉండే పథకాన్ని అందించారు.

## లక్ష్యం

జాతీయ గ్రామీణ హామీ పథకాన్ని కూలీల వలస నివారణ, గ్రామాలలో పనులు కల్పించి నిరంతర అభివృద్ధి చేసేందుకు వీలుగా భూమి అభివృద్ధి పనులు కల్పించి, జీవనోపాధికి ఉపయోగపడాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టారు.

గ్రామాలలో ఈ క్రింది చూపబడిన 66 రకాల పనులను 8 విభాగాల్లో చేయవచ్చును.

ఉదా: మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పునఃరుద్దరణ. సన్న, చిన్నకారు రైతులకు పండ్ల తోటల పెంపకం, వ్యవసాయ భూముల అభివృద్ధి పథకం - మొదలగునవి.

గతంలో కాంట్రాక్టరు దగ్గర కూలీలు పనులు చేస్తే దయా దాక్షిణ్యాలపై వేతనాలు చెల్లించేవారు. ఉపాధి హామీ పథకంలో



SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 4 4/29/2010, 3:02 PM

పనిచేసిన ఉపాధి కూలీలకు 3 రోజులలో వేతనాలు చెల్లించాలని, గరిష్టంగా 15 రోజులకు మించకుండా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అంతే కాకుండా వేతనాల చెల్లింపులలో అవకతవకలు పాల్పడకుండా బయోమెట్రిక్ విధానాన్ని, స్మార్ట్ కార్డు చెల్లింపుల ద్వారా జరగడంవల్ల అవినీతి రహిత పథకంగా ఉంది. కూలీ చేసిన పనికి వేతనాన్ని నూటికి నూరుశాతం కూలీకి అందేటట్లుగా ఈ పథకాన్ని రూపొందించారు రాష్ట్ర అధికారులు.

గతంలో పనులు చేస్తున్నప్పుడు కూలీలకు పని ప్రదేశంలో సదుపాయాలు కల్పించడంలో విఫలమైనారు. ఉపాధి హామీ పథకంలో పని ప్రదేశంలో ప్రాథమిక చికిత్స, నీడ, త్రాగునీరు మొదలగు సదుపాయాలు కల్పించి దురదృష్టవశాత్తు పనిచేసే ప్రదేశంలో ప్రమాదం వాటిల్లినట్లైతే (మరణం) రూ॥50,000/- ఎక్స్‌గ్రేషియా, పూర్తి స్థాయిలో అంగవైకల్యం చెందినట్లైయితే రూ॥ 25,000/- చిన్న చిన్న గాయాలకు రూ॥ 5,000/- వరకు చెల్లింపు విధానం ఈ పథకంలో వున్నది.

వరంగల్ జిల్లాలో రఘునాథపల్లి మండలం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. పథకం పట్ల కూలీలకు సరియైన అవగాహన కల్పించి, చైతన్యపరిచి నిరంతరం గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు. అందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసి, లబ్ది పొందిన కూలీల మాటల్లోనే చూద్దాం.

## శ్రమైక జీవనంలో ఆదర్శ కూలీలు పేదల బ్రతుకుల్లో మార్పు

### వలస బాట వదిలాం



గతంలో బతుకుదెరువు లేక కుటుంబమంతా హైదరాబాద్‌లో భవన నిర్మాణం పనులకు వెళ్ళే వాళ్లం. ఇప్పుడు గ్రామంలోనే ఉపాధి పనుల్లో పాల్గొంటున్నాం. మూడు నెలల్లోనే నా భార్య, కోడలు, నేను కలిసి 156 రోజుల పని దినాలు చేసి రూ॥ 12,380/- సంపాదించి అధికారుల వద్ద గుర్తింపు పొందాం. వచ్చిన డబ్బులతో వ్యవసాయం చేసుకుంటున్నాం.

**– భూక్య లుంబ, కుసుంబాయితండ**

### కుటుంబాన్ని సాకుతున్నా



నా భర్త అనారోగ్యంతో ఎనిమిదేళ్ల క్రితం చనిపోయాడు. ఆ సమయంలో ఇక మేము ఎలా బతకాలని దిగులు చెందేవాళ్లం.

ఈ సమయంలో మా గ్రామంలో నడుస్తున్న ఉపాధి హామీ పనులకు ఇంటర్ వరకు చదివిన నా కొడుకు, నేను వెళుతూ మూడు నెలల్లో 101 పని దినాలు చేసి రూ॥ 13,600/- సంపాదించాం. వచ్చిన డబ్బుతో ఇళ్ళు నిర్మించుకుంటున్నాం.

**– బత్తిని పుష్పమ్మ, కన్నాయిపల్లి**

### కూలీ పనులు ఆదుకుంటున్నాయి



మాకున్న 5 ఎకరాల భూమి దేవాదుల ప్రాజెక్టు కింద కోల్పోయాం. ఎలా బతకాలని దిగులు పడుతుండగా ఉపాధి పనులు ఆదుకుంటున్నాయి. నేను, నా భార్య, ఇద్దరు కొడుకులు ఈ మూడు నెలల్లోనే 129 పనిదినాలు చేసి రూ॥ 12,940 సంపాదించాము. ఈ డబ్బుతో పాడి గేదెల్ని కొనుగోలు చేసి జీవనాన్ని మెరుగు పరుచుకుంటున్నాము.

**– ముప్పడి వెంకటయ్య, అశ్వారావుపల్లి**

### కొడుకుల మీద ఆధారపడక



గతంలో మా కుటుంబమంతా హైదరాబాద్ ఇళ్ల పనులు చేసే వాళ్లం. నేను ముసలి వాడినైనా కొడుకుల మీద ఆధారపడకుండా బతకాలని సొంత ఊరికి వచ్చి కూలీ పనులు చేస్తున్నాను. నేను, నా భార్య, చిన్న కొడుకు కలిసి ఈ మూడు నెలల్లోనే 168 పని దినాలు చేసి రూ॥ 11,700/సంపాదించి, నూటికి నూరుశాతం పనులు చేసి అధికారుల వద్ద గుర్తింపు పొందాను.

**– భూక్య దూమ, జాఫర్‌గూడెం**

ఉపాధి కల్పనలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ కూలీలకు ఒక వర ప్రసాదంగా ఉంది.

ఏ మంచి పథకం ప్రవేశ పెట్టిన అమలు పరిచే స్థాయిలో అధికారులకు, సిబ్బందికి మంచి అవగాహన కల్గి ఉండాలి. స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం, జిల్లా స్థాయి అధికారుల ప్రోత్సాహం ఉన్నట్లయితే గ్రామీణ ప్రాంతాలు ఉపాధి కల్పనకు పట్టణాల కంటే తీసిపోవు. గ్రామాలలో యువతకు ఉపాధి కల్పించినట్లయితే చిన్న చిన్న పల్లెలు సైతం పట్టణీకరణ చెందుతూ బడుగు జీవుల ప్రమాణం మెరుగుపడేట్లు చూడవచ్చు.

అదే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, తద్వారా కూలీల జీవితాలలో వెలుగు దివ్వెలు, కాంతిరేఖలు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రసరింప చేస్తుందనడంలో సందేహం లేదు.

**– మిట్టకోల చంద్రమౌళి, ఎం.పి.డి.ఓ.**
*రఘునాథపల్లి, వరంగల్ జిల్లా*



SthanikaPalanaTel_May_2010_Black&White.prd 5 4/29/2010, 3:02 PM

# ప్రబంధ రచనకు ఆద్యుడు ఎఱ్ఱాప్రెగడ

## తెలుగు సాహిత్య చరిత్ర

**ఎఱ్ఱాప్రెగడ ఇంటి పేరు చెదలవాడ. ఈతని తండ్రి సూరన్న. తల్లి పోతమ్మ. వీరి నివాసం నెల్లూరు మండలంలోనున్న కందుకూరు తాలూకాలోని గుడ్లూరు గ్రామం. ఈ కుటుంబం వారు శివభక్తులు. ఎఱ్ఱాప్రెగడకు శివభక్తి అధికం. అందుకే ఈయనకు శంభుదాసుడు అనే బిరుదు సార్థకమైంది. తిక్కనసోమయాజికి, ఎఱ్ఱాప్రెగడ ఏబది సంవత్సరాల తరువాత వాడు.**

ఆ కాలంలో తెనుగు కవిత్వం మీద కవులు, రాజులు ఎంతో ఆదరం చూపించారు. సంస్కృతాంధ్ర భాషలలో పండితుడైన ఎఱ్ఱన కూడా తెనుగు కవిత్వ రచన మీద మొగ్గు చూపించాడు. తనదైన శైలిలో కవిత్వ రచన ప్రారంభించాడు.

ఎఱ్ఱాప్రెగడ, లక్ష్మీనృసింహ పురాణం, హరివంశం, మహాభారతంలోని అరణ్య పర్వశేషాలను రచించాడు. ఈ మహాకవి, రామాయణాన్ని కూడా రచించాడని చెబుతారు. కానీ, ఆ గ్రంథం ఇంతవరకు లభించలేదు. ఎఱ్ఱన రామ లక్ష్మణ గ్రంథాలలో కొన్ని పద్యాలను ఉదహరించారు. ఆ కారణంగా ఎఱ్ఱన రామాయణాన్ని కూడా రచించినట్లుగా తెలుస్తోంది.

నన్నయ విడిచిన అరణ్య పర్వశేషాన్ని తిక్కన కవి అనువదించలేదు. ఆయన విరాట పర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలను అనువదించాడు. అరణ్యపర్వ శేషం కూడా పూర్తయితే, ఆంధ్ర మహాభారతం సంపూర్ణత్వాన్ని పొందుతుంది. ఆ, ఆలోచనతోనే ఎఱ్ఱాప్రెగడ, నన్నయ విడిచిన 'శారద రాత్రులు' అనే పద్యం ఆధారంగా శరత్కాల వర్ణన చేస్తూ....

*స్ఫుర దరుణాంశురాగరుచిఁబొంపిరిపోయి నిరస్తనీరదా*
*వరణములై దళత్కమల వైభవ జృంభణ ముల్లసిల్లను*
*ద్భురతర హంససారసమధువ్రత నిస్వనముల్ సెలంగగా,*
*గరము వెలింగె వాసర ముణంబులు శారద వేళఁజూడగన్*

*(అరణ్య -418-143)*

అంటూ నన్నయగారి కవితాశైలిని అనుకరించాడు ఎఱ్ఱన. మరో విశేషం ఏమిటంటే. అరణ్యపర్వ శేషాన్ని తాను పూరించినట్లు ఎఱ్ఱన ఎక్కడా ప్రస్తావించ లేదు. నన్నయగారి రచనగానే కొనసాగించాడు.

నన్నయ కవిత్వంతో మూడు వంతులు సంస్కృత పదాలు, ఒకవంతు తెనుగు పదాలు ఉంటాయి. ఎఱ్ఱన కూడా అదే పద్ధతిలో రచన సాగించి కృతకృత్యుడయ్యాడు. ఆ విధంగా రచన సాగిస్తూ తిక్కన గారి శైలితో అరణ్య పర్వశేషాన్ని పూర్తి చేశాడు. దీనివల్ల ఆంధ్రమహాభారత రచన అంతా ఒకే కవి చేతి మీదుగా సాగినట్లు అనిపిస్తుంది. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన తెనుగు కవిత్వానికి త్రిమూర్తులు. వీరి ముగ్గురిని కలిపి కవిత్రయంగా చెబుతారు. ముగ్గురి మధ్య మరి కొందరు సుప్రసిద్ధులైన కవులున్నారు. అయినా వారు భారతారణ్య పర్వశేషం వైపు కన్నెత్తి చూడలేదు.

తిక్కన సోమయాజి, తనకు తన తండ్రి కలలో సాక్షాత్కరించి మహాభారత రచనకు ప్రోత్సహించినట్లుగా చెప్పుకొన్నాడు. అదే విధంగా ఎఱ్ఱాప్రెగడ కూడా తన భావనా వీధిలో తన తాతగారు కనబడినట్లు, లక్ష్మీ నృసింహ పురాణాన్ని రచించమని ఆదేశించినట్లుగా ప్రకటించాడు.



అనుకరణ, అనుసరణ అనేవి కవులకు సర్వసాధారణమైన విషయాలు. ఒక కవి చేసిన కవితా చమత్కృతికి ఆనందించిన మరొక కవి ఆ బాటలో తానూ కవిత్వం చెప్పాలని ఉవ్విళ్ళూరుతాడు. అటువంటిదే ఎఱ్ఱాప్రెగడ యొక్క రసహృదయం కూడా. ఎఱ్ఱన ప్రబంధ రచనకు ఆద్యుడయ్యాడు. ప్రబంధం అంటే వివిధ రకాలైన వర్ణనలుండాలి. దానికి ఎఱ్ఱనయే 'నాంది' పలికాడు. ఆ కారణంగా ప్రబంధ పరమేశ్వరుడయ్యాడు. సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయ చంద్రాస్తమయాలు, పురవర్ణన, ప్రకృతి వర్ణన, నాయికా నాయకుల వర్ణన, జలక్రీడలు, పుష్పాపరిచయం, శృంగారం, ఋతువర్ణనాలు, యుద్ధవర్ణన మొదలైన వర్ణనాలను, కథాంశానికి అనుగుణంగా కావించాడు ఎఱ్ఱన.

పాండవులు అరణ్యవాసం చేస్తున్నారు. అప్పుడు, శ్రీకృష్ణుడు, సత్యభామతో కలిపి పాండవులను చూడడానికి వచ్చాడు. సత్యభామ, ద్రౌపదీపాండవుల అన్యోన్యాన్ని, అనురాగాన్ని చూసింది. ఒక్క స్త్రీ అయిదుగురు భర్తలతో ఏ విధంగా కలిసి మెలిసి ఏ పొరపొచ్చాలు లేకుండగా, జీవించగలుగుతోందా! అనే అనుమానం వచ్చింది. వెంటనే సత్యభామ ద్రౌపదితో, "నీవు, భర్తలతో కలిసి ఎంతో అన్యోన్యంగా ఉన్నావు ఇదేలా సాధ్యం? వీరిని వశపరచుకోడానికి మాయలు చేశావా? మందులు, మాకులుగాని పెట్టావా? ఒక వేళ అటువంటివేమైనా చేస్తే మగనికి రోగాలు వస్తాయంటారు. ఇంతకీ విషయం ఏమిటి?" అని అడిగింది దానికి ద్రౌపది,

*"ఇట్టి వర్తనముల నెపుడు బాండవులకు,*
*దగిలి ప్రియము సేయదగితిఁ, గాని*
*మగువ! నీవు చెప్పు మందులు, మాకులు*
*ఇంద్రజాలములను నే నేఱుంగ"*

అని సమాధానం చెప్పింది. అంతఃపురం విడిచి ద్రౌపది, అడవికి రాగానే సత్యభామ దృష్టిలో చులకనైపోయింది. కాని, సత్యభామ అంతరంగం తెలిసిన ద్రౌపది దీనికి తగినట్లుగా సమాధానం చెప్పింది. ఈ విషయాన్ని వ్యాసభగవానుడు. సంస్కృతంలో ఇంకా పెంచే వ్రాశాడు, కాని, ఎఱ్ఱన తగు మాత్రంగా అనువదించి, పఠితలకు ఆహ్లాదాన్ని, స్త్రీల మనస్తత్వాన్ని సున్నితంగా తెలియజేశాడు.

ఎఱ్ఱాప్రెగడకు నన్నయ తిక్కనల మీద అపారమైన గౌరవముంది. ఆ కారణంగా తాను రచించిన లక్ష్మీ నృసింహ పురాణంలో-

*'భాసుర భారతార్థముల భంగుల నిక్క మెఱుంగ నేరమిన్*
*గా నడిబీనటే చదివి గాథల త్రవ్వ తేనుంగువారికిన్*
*వ్యాసముని ప్రణీత పరమార్థము తెల్లముజేసినట్టి అ*
*బ్జాసనకల్పులన్ దాలతు నాద్యుల నన్నయ తిక్కనార్యులన్'*

అని ప్రశంసించాడు.

లక్ష్మీ నృసింహపురాణం, ప్రహ్లాదుని చరిత్ర రాక్షస చక్రవర్తయిన హిరణ్యకశిపుడు కుమారుడని కూడా తలంచకుండా ప్రహ్లాదు ఘోరంగా హింసించిన కథాంశమిది. చివరకు, నృసింహస్వామి చేతిలో హిరణ్యకశిపుడు మరణిస్తాడు. ఈ కథ జరిగిన ప్రదేశం అహోబిలం ఈ కథనే తరువాతి కాలంలో పోతన మహాకవి తన భాగవత గ్రంథంలో రసరమ్యంగా వర్ణించాడు. భక్తిరసాన్ని ప్రవహింపజేశాడు.

అయితే నరసింహస్వాములు అయిదు చోట్ల మనకు కనబడుతున్నారు.

**1. సింహాచలంలో అప్పల లక్ష్మీనరసింహస్వామి 2. కోరుకొండలో 3. యాదగిరిగుట్టలో 4. అహోబిలంలో 5. అంతర్వేదిలో.**

ఈ విధంగా ఈ అయిదుగురు, పంచ నరసింహులుగా ప్రసిద్ధిచెందారు.

మహాభారతం తరువాత, హరివంశం చెప్పకపోతే, శ్రీ కృష్ణుని యొక్క పవిత్ర చరిత్ర పూర్తికాదు. ఆ స్వామి వృత్తాంతం పరిపూర్ణంగా చెప్పినట్లు కూడా కాదు. అందుకే ఎఱ్ఱన మహాకవి హరివంశ కావ్యాన్ని రచించాడు.

మహాభారతాన్ని పంచమ వేదం అన్నారు. నాలుగు వేదాల తరువాత చెప్పకోదగినది, చదువదగినది. వేదం శాసిస్తుంది. మహాభారతంలో, వేదంతో వివరింపబడిన విషయాలన్నీ ఉన్నాయి. అవి ధర్మానికి చెందినవి. సత్యం వద. ధర్మం చర - అని వేదం శాసిస్తుంది. ఎందుకు సత్యవ్రతాన్ని ఆచరించాలి? ఎందుకు ధర్మాన్ని ఆచరించాల? - అని వేదాన్ని ప్రశ్నించకూడదు. మరి, ప్రశ్నించకపోతే సమాధానం ఎలా వస్తుంది? ఎవరు చెబుతారు?

- అంటే పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు చెబుతాయి. ఎంతో చక్కగా వివరిస్తాయి. అందుకే భారతాన్ని చదవాలి. ఎవరైనా పురాణం చెబుతూ ఉంటే వినాలి. తద్వారా మనకు కలిగిన సందేహాలన్నీ దూదిపింజల్లాగా ఎగిరిపోతాయి. ఎఱ్ఱన రచించిన అరణ్య పర్యశేషంలోనూ ఎన్నో ధర్మవిషయాలున్నాయి. ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వీటిల్లో ఒకదానిని తెలుసుకుందాం. అది ధార్మవ్యాధోపాఖ్యానం. సాధారణంగా, స్త్రీలు పతిభక్తి కలిగి ఉండాలని, పురుషులు తల్లిదండ్రుల యందు భక్తి శ్రద్ధలు కలిగి ఉండాలని మన పెద్దలు చెబుతూ ఉంటారు. పతిభక్తిని గూర్చి చేప్పేటప్పుడు సుమతి సూర్యోదయ్యాన్ని ఆపేసిందని, అనసూయ, త్రిమూర్తులను పసి పాపలుగా జేసి ఊయలలో వేసి ఊపిందని ఇలా ఎన్నో కథలు మనకు తెలుసు.

అయితే ధర్మవ్యాధోపాఖ్యానంతో, ఒక పతివ్రత కథ, తల్లిదండ్రులను సేవించిన ధర్మవ్యాధుని కథ ఈ రెండూ మనం తెలుసుకోవచ్చు.

పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో వారిదగ్గరకు మార్కండేయ మహర్షి వచ్చాడు. ఆయనకు అర్ఘ్యపాద్యాది సత్కారాలు ఆచరించారు పాండునందనులు. పెద్దలెదురైనప్పుడు కలిగిన సందేహాలు తీర్చుకోవడం చదువుకొన్నవారు చేసే పని. దీనిని దృష్టిలో పెట్టుకొని ధర్మరాజు, "మహాత్మా! తల్లిదండ్రులు ఇద్దరిలోను కుమారుని మీద ఎవరి కెటువంటి ప్రేమ, ఆశ ఉంటాయి, ఒకవేళ విద్యావంతుడు కానివాడు, సంస్కారవంతమైన వంశమునందు జన్మించని వాడు అయిన పురుషుడు పరమ ధార్మికుడు కావాలంటే.. ఆతని చరిత్ర ఎలా ఉండాలి? ఈ విషయాలను వివరించ వలసింది" అని కోరాడు.

ధర్మరాజు ప్రశ్న మార్కండేయ మహర్షికి ఆనందం కలిగించింది. అపుడాయన, 'నాయనా! తల్లి నవమాసాలు తన గర్భవాసంలో

మోసి బిడ్డను కంటుంది. ప్రసవం అనేది స్త్రీకి పునర్జన్మ. బిడ్డను జన్మనిచ్చేటప్పుడు, తాను జీవిస్తుందో లేక మరణిస్తుందో తెలియని జీవన్మరణ సమస్య. సుఖప్రసవం అయ్యాక, ఆ తల్లి పొందే ఆనందానికి అవధులుండవు. బిడ్డ, పెరిగి పెద్దవాడు కావాలని, విద్యావంతుడు, వినయశీలి, వంశోద్ధారకుడు, వంశాచార ధర్మాలను పాటించేవాడు, యజ్ఞయాగాదులు, వ్రతాలు చేసేవాడు. అతిథులను ఆదరించేవాడు, తమ పేరు నిలబెట్టేవాడు కావాలని తండ్రి ఆశిస్తాడు. తల్లిదండ్రుల కోరికలు నెరవేర్చేవాడు, ఆశలు తీర్చేవాడు, వార్ధక్యంతో వీరికి సేవలు చేసేవాడే పుత్రుడు. దీనికి భిన్నంగా ప్రవర్తించే వాడిని పుత్రుడు అని అనలేము. అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్తయందు స్త్రీ అనురాగవతియై యుండాలి. ఆయనకు తగిన ఉపచారాలు చేస్తూ సమాజంతో ఒక గౌరవాన్ని, కీర్తిని స్త్రీ పొందాలి. భర్తచేసే సత్కార్యాచరణలలో ఆమె తన వంతు కృషి చేయాలి - నీవడిగిన రెండు ప్రశ్నలకు సంబంధించిన ఒక కథ చెబుతాను. విను.

కౌశికుడు అనునాతడొక బ్రాహ్మణుడు. ఆపశ్శక్తి సంపన్నుడు. ఎల్లప్పుడూ వేదాలు వల్లెవేస్తూ ఉంటాడు. ఒకనాడొక చెట్టు మొదట్లో కూర్చుని కౌశికుడు వేదాలు పఠిస్తున్నాడు. ఆ సమయంలో చెట్టు మధ్యనున్న కొంగ ఆయన మీద రెట్టవేసింది. దానికా మహర్షికి కోపం వచ్చింది. గ్రుడ్లెర్రజేసి కొంగను చూశాడు. ఆ చూపులలో నుండి నిప్పులు రాలాయి. ఆయన కోపాగ్నికి కొంగ భస్మమై పోయింది. కోపం ఎంతటిపనైనా చేస్తుందనడానికిదొక నిదర్శనం.

అంతలో మధ్యాహ్నమైంది. కౌశికునకు భిక్షా సమయమైంది. జోలె ధరించి భిక్షాటనకు బయలుదేరాడు. ఒక బ్రాహ్మణుల యింటి ముందు నిలిచాడు. "భవతి భిక్షాందేహి" అన్నాడు. ఆ యింటి యిల్లాలు కౌశికుని పిలుపు విన్నది. భిక్షాద్రవ్యాలను సిద్ధపరుస్తోంది. ఆ సమయంలో ఆమె భర్త ఆకలికి తాళలేక తూలి పోతూ ఇంటికి వచ్చాడు. గృహిణి తన భర్తను చూసింది. భిక్షా ద్రవ్యాలను ఒక చోట పెట్టింది. భర్తకు కావలసిన తాత్కాలిక ఉపచారాలను చేసింది. చక్కగా స్నానం చేయించింది. పీట వేసి భోజనం పెట్టింది. విసన కర్రతో విసురుతూ ఉల్లాసంగా కబుర్లు చెబుతూ, విస్తరిలో వంటకాలు వడ్డిస్తూ భోజనం పెట్టింది. యజమాని సుష్టుగా భోజనం చేశాడు.

అనంతరం ఆమె, భర్తకు తాంబూలం ఇచ్చింది. ప్రక్క వేసింది. ఆయన మంచం మీద పండుకొన్నాడు. ఆమె భర్తకు పాదాలొత్తుతూ ఉపచారాలు చేసింది. అంతలో అంతకు ముందు, భిక్షకు వచ్చిన కౌశికుడు జ్ఞాపకం వచ్చాడు. వెంటనే భిక్షా ద్రవ్యాలు తీసుకుని వాకిట్లోకి వచ్చింది. కౌశికుడింకా అక్కడే ఉన్నాడు. అసలే కోపిష్ఠి. అంతకు ముందే ఆయన కోపాగ్నికొక కొంగ మరణించింది. భిక్షకోసం గుమ్మంముందు నిలబడితే, ఆ గృహిణి భిక్ష తొందరగా వెయ్యక అవమానించింది. దానితో ఆయనలోని కోపం మరింత హెచ్చింది. ఆమె కేసి చూస్తూ "భిక్ష వెయ్యడానికి ఇంత ఆలస్యమా? నన్ను చూసినప్పుడే పొమ్మంటే మరో యింటికి పోనా? ఎందుకు నన్ను నీ గుమ్మం ముందు నిలబెట్టుకొని అవమానించావ్?" అని తీవ్రస్వరంతో అడిగాడు.

అప్పుడా పతివ్రత, "అయ్యా! మీకు భిక్ష తెద్దామనుకొనే సమయంలో నా భర్తవచ్చారు. ఆయనకు సేవలుచేస్తూ మీ సంగతి మరచిపోయాను. దీనిని తప్పుగా భావించక నన్ను మన్నించండి" అని ఎంతో వినయంగా చెప్పింది.

ఆ మాటలకు మండిపడుతూ, కౌశికుడు, "ఏమమ్మా! మా కన్నా నీ మగడే అంత ఎక్కువా? తపోధనులము, బ్రాహ్మణులము అయిన మేమంత చులకన అయిపోయామా? నీ కంటికి మేము అసలు కనబడడం లేదా? మమ్మల్ని చూచి దేవతలు కూడా భయపడతారు. వీరు కూడా నీ కంటికి ఆనడం లేదా?. మహర్షులకు కోపం వచ్చిందంటే, ఆ కోపాగ్నిలో సృష్టి సమస్తము దహించుకుపోతుంది. ఆ సంగతి తెలుసుకో!" అన్నాడు.

అపుడా పతివ్రత, "నాకు తపస్సంపన్నులైన మీ వంటివారి మహిమ బాగా తెలుసు. ఒక మహర్షి (అగస్త్యుడు) కోపించి, సముద్రజలాలు త్రాగడానికి వీలుకాకుండా చేశాడు. ఒక మహర్షి దండకారణ్యాన్ని తగులబెట్టాడు. ఆగస్త్య మహర్షి వాతాపి అనే రాక్షసుని జీర్ణించుకొన్నాడు. నాకింకా చాలామంది బ్రాహ్మణుల యొక్క, మహర్షుల యొక్క కథలెన్నో తెలుసు. తెలిసి తెలిసి కొరివితో తలగోక్కొంటానా? నాకు తెలిసిన ధర్మం ఒక్కటే. అది పతిసేవ. నాకు నా భర్తకాక నీవెలా గొప్పవాడవౌతావు? నీవు మహా కోపిష్ఠివన్న సంగతి నాకు తెలుసు. నీ కోపాగ్నికి ఇంతకు ముందే ఒక కొంగ ఆహుతై పోయిందన్న సంగతి కూడా తెలుసు. ఆ విషయం నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా? ఈ సంగతి నా పాతివ్రత్యప్రభావం వల్ల తెలుసుకున్నాను.

మహాత్మా! కోపం మంచిది కాదు. కోపం, మోహం ఈ రెండూ మనపాలిటి శత్రువులు. ఈ రెండింటిని విడిచిపెట్టని వానికి సమాజంలో గౌరవం ఉండదు.

ధర్మాలు చెబుతాను విను. సత్యం పలకాలి. హింస చెయ్యకూడదు. గురువులను పూజించాలి. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. అందరిను తనవలనే చూసుకోవాలి. ధర్మంనందు ఆసక్తి కలిగి ఉండాలి. కోరికలను విడిచిపెట్టాలి. మంచి నడవడిక, ఇంద్రియ నిగ్రహంబు, వేదాధ్యయనం, శిష్యులకు ధర్మాలు బోధించడం మొదలైనవి వేదాలలో చెప్పే ధర్మాలు.

'ధర్మం' అనేది చాలా సూక్ష్మంగా ఉంటుంది. అంతేకాదు. ధర్మం అనేక మార్గాలుగా ఉంటుంది. ఏ రకంగానైనా ధర్మం ఆచరించవచ్చు. నీవు వేదాలు కంఠస్థం చేశావే కాని. ధర్మసూక్ష్మాలను గ్రహించలేదు. నీకు నేనొక సలహా ఇస్తున్నాను. ఇక్కడి నుండి మిథిలానగరానికి వెళ్ళు. అక్కడ, తల్లిదండ్రుల సేవలో తరిస్తున్నవాడు, నిత్యసత్యవ్రతుడు అయిన ధర్మవ్యాధుడు అనే కిరాతుడున్నాడు. అతడు కిరాతుడే అయినా నీకు సమస్త ధర్మాలు ఉపదేశిస్తాడు. నీ మనస్సులో ఉన్న సందేహాలన్నింటిని పోగొడతాడు. నేనేదో నీకు అపచారం చేశానని భావించకు. నన్ను మన్నించు. ఆడువారు మీయంత తెలివైన వారు కారుకదా! కనుక మా అపరాధాన్ని మన్నించు" అంది.

పతివ్రత మాటలకు కౌశికుడు "అమ్మా! తొందర పడ్డాను. నీ మాటలు విన్నాక నా మనస్సుకి ఊరట కలిగింది. నీవు చెప్పిన ధర్మవ్యాధుని దగ్గరకు పోతున్నాను. నీకు సమస్తశుభములు కలుగుగాక!" అని ఆశీర్వదించి

మిథిలా నగరానికి బయలుదేరాడు.

కొంతకాలం కాలినడకన ప్రయాణం సాగించి ధర్మవ్యాధుడు మిథిలానగరం చేరుకున్నాడు. పరిసరాలతో సంచరిస్తున్న జనాలనడిగి ధర్మవ్యాధుడుండే ప్రదేశానికి చేరుకొన్నాడు. ధర్మవ్యాధుడొక మాంసపు దుకాణాన్ని నడుపుతున్నాడు. ఆ ప్రదేశమంతా దుర్గంధభరితంగా ఉంది. అక్కడకు వెళ్ళడం ఇష్టంలేక కౌశికుడా దుకాణానికి దూరంగా నిల్చున్నాడు.




ధర్మవ్యాధుడు, కౌశికుడు రావడాన్ని గమనించాడు. ఆయన దగ్గరకు వచ్చాడు. నమస్కరించాడు. ‘‘మహాత్మా! మిమ్మల్ని ఆ పతివ్రతామతల్లి ఇక్కడకు పంపింది. మీరెందుకు వచ్చారో నాకు అర్థమైంది. రండి! మా యింటికి వెడదాం!’’ అని కౌశికుని తన యింటికి తీసుకుపోయాడు. తానేమి మాట్లాడకుండానే, అన్ని విషయాలు చెప్పిన ధర్మవ్యాధుడి శక్తికి కౌశికుడు ఆశ్చర్యపోయాడు.

ధర్మవ్యాధుడు, కౌశికుని తగినట్లుగా గౌరవించాడు. తరవాత ధర్మవ్యాధునితో, ‘‘నీవు చాలా తెలివైనవాడివి. బుద్ధిమంతుడివి. జ్ఞానివి. అటువంటి నువ్వు జీవహింస చేసి, మాంసం విక్రయిస్తూ జీవిస్తున్నావు. ఇది ధర్మమా?’’ అని ప్రశ్నించాడు.

ఆ మాటలకు సన్నగా నవ్వి ధర్మవ్యాధుడు, ‘‘అయ్యా! తపస్సు, వేదాధ్యయనం, బ్రహ్మచర్యం అనేవి బ్రాహ్మణులకు ధర్మాలు. అదేవిధంగా రాజులకు దండనీతి, వైశ్యులకు వ్యవసాయం, పశుపాలన, వాణిజ్యము, శూద్రులకు సేవ అనేవి ధర్మాలు. అలాగే మాకు వేట పరమధర్మం. పైగా ఇది మాకు వంశాచారం. పైగా ఈ దేశాన్ని పాలించే జనకుడు అనే మహారాజు వర్ణాశ్రమధర్మాల మీద ఎంతో నమ్మకం ఉన్నవాడు. వర్ణధర్మాలను విడిచిపెడితే, తన కొడుకునైనా సరే విడిచిపెట్టడు. దండిస్తారు. ఆకారణంగా నా కుల ధర్మాన్ని నేను విడిచిపెట్టలేదు. అయినప్పటికీ, నేను మాంసాన్ని అమ్ముతానే తప్ప, జీవహింస చెయ్యను. మాంసం కొని తెస్తాను. తక్కువలాభానికి, సంసారం పోషించుకొనేందుకు సరిపడిన లాభానికే మాంసం విక్రయిస్తాను. నాకు ధనసంపాదన మీద కోరికలేదు. ఆశకూడా లేదు. ఉపవాసాలుంటాను. వ్రతాలు చేస్తాను. ఏకపత్నీ వ్రతుణ్ని. ఋతుస్నాత అయిననాడు మాత్రమే నా భార్యతో కలిసి ఉంటాను. ఒకరు పొగిడారని పొంగిపోను. తెగనాడారని బాధపడను. ఈ కారణాలవల్ల కిరాతుడుగా జన్మించినప్పటికీ నిర్మలంగా జీవిస్తున్నాను. ధర్మవిషయాలు తెలుసుకోవడం కోసం పతివ్రత నిన్ను నా దగ్గరకు పంపింది. కనుక కొన్ని ధర్మాలు చెబుతాను.

కులధర్మాన్ని విడిచిపెట్టకుండగా జీవించడం పరమ ధర్మం. అందరి యందు దయ గలిగి ఉండాలి. ఓర్పు ఉండాలి. స్త్రీ వ్యామోహం పనికిరాదు. ఎల్లప్పుడు సత్యమే మాట్లాడాలి. సత్పురుషులను సేవించాలి. కోపం మంచిదికాదు. అపకారికి కూడా ఉపకారం చెయ్యాలి. ఇతరుల మీద దోషాలను ఆరోపించేవాడు తన పాపాలకు తానే భస్మమై పోతాడు. ధర్మాత్ములను నిందించడం, నాస్తికుడై దేవుడులేడని వాదించడం, దుర్మార్గులతో కలిసి తిరగడం, ధర్మానికి వ్యతిరేకంగా నడుచుకోవడం మంచి పద్ధతికాదు.

క్రోధం, వ్యామోహం - ఈ రెండు మహాపాతకాలు, ఈ రెండింటిని జయించిన వాడే ధర్మాత్ముడు. పెద్దలు చెప్పని ధర్మాలు, గడ్డి కప్పిన నూతుల్లాంటివి. తప్పుదారిలో నడిచే మానవుడు ఆ నూతిలో పడిపోతాడు. కనుక అటువంటి వాటికి దూరంగా ఉండాలి’’ అన్నాడు.

అప్పుడు కౌశికుడు, ‘‘శిష్టాచారాలు ఎలా ఉంటాయో చెప్పు’’ అని అడిగాడు. దానికి సమాధానంగా, ‘‘శిష్యులు అంటే సత్పురుషులు, మంచివారు. దానం, సత్యం, తపస్సు, యజ్ఞం, సత్ప్రవర్తన, కోరికలను వ్యామోహాలను విడిచిపెట్టడం, పెద్దలకు సేవ చెయ్యడం, బాహ్యేంద్రియాలను, మనస్సును స్వాధీనంలో ఉంచుకోవడం, ఎప్పుడూ సంతోషంగా ఉండడం, విద్యమీద ఆసక్తి, డాంభికత్వం లేకపోవడం, అసూయ లేకుండా ఉండడం, అహంకారం విడిచిపెట్టడం, నాస్తికుల గోష్ఠిలోకి వెళ్ళకుండడం, శీలసంరక్షణ, తీర్థయాత్రలు చెయ్యడం, శుచిగా ఉండడం, మితంగాను, హితంగాను మాట్లాడడం, స్నేహితుల రహస్యాలను కాపాడడం -ఈ మొదలైన వాటిని శిష్టాచారాలు అంటారు. కనుక, నేను చెప్పినా ఈ ధర్మాలను అవలంబిస్తూ సుఖజీవనం సాగించు. మరో విషయం. ధర్మం మూడు రకాలుగా ఉంటుంది. వేదధర్మం. శాస్త్రధర్మం. పెద్దలు చెప్పి ఆచరించిన ధర్మం - ఈ మూడు ధర్మాలు కూడా సద్గతిని పొందడానికి సాధనాలు.

‘‘అయ్యా! ముందుగా నన్ను చూసి, ‘నీవుచేస్తున్న పని, హింసతో కూడినది కదా! ‘‘ అని ప్రశ్నించావు. దానికితగిన సమాధానం చెప్పాను. ఇది హింస అని, ఇది అహింసయని మనం నిర్ధారణ చెయ్యలేము. పండ్లు, లతలు, కొన్ని రకాల కాండాలు, వ్రేళ్ళు, గడ్డి తృణధాన్యాలు ఇలా కొన్నింటిని ప్రాణులకు ఆహారంగా బ్రహ్మదేవుడు సృష్టించాడు. ఈ విషయాన్ని వేదాలు కూడా చెబుతున్నాయి. వేద వచనాన్ని మనం కాదనలేము కదా!

శిబి చక్రవర్తి తన శరీరాన్ని కోసి ఇంద్రుడికి అగ్నికి ఇచ్చాడు. శరీరహింస చేసికొన్న శిబికి ఉత్తమ గతులు కలుగలేదా? రంతిదేవ మహారాజు వేయి సంవత్సరాల పాటు, ప్రతిరోజు రెండు వేల గోవుల ను వధించ లేదా? ఆయనకు పాపమేమయినా అంటుకొన్నదా? వేదం చదువుకొన్న పండితులు యజ్ఞాలు చేయ్యలేదా? యజ్ఞాలలో జంతుహింస చెయ్యలేదా? వారికి పాపాలు అంటుకొన్నాయా? పుణ్యగతులు కలుగలేదా? పితృకార్యాల్లో మాంసం పెట్టే అలవాట్లు కలవారున్నారు కదా!

వ్యవసాయదారుడు భూమి దున్నేటప్పుడు నాగటిక్రిందపడి సూక్ష్మజీవులు చనిపోవడం లేదా? మామిడి కాయ కోసినప్పుడు, దానిలోని పురుగు ప్రమాదవశాత్తు నరకివేయబడడం లేదా? అది తెలిసి చేసిన హత్య అంటామా? ఆకాశంలోను, నీటిలోను కూడా ఎన్నో జీవులు ఉన్నాయి. అవి కంటికి కనబడవు. అవి మనచేత చావడం లేదా? అహింసా వ్రతం చేబట్టి అడవులలో తపస్సు చేసుకొంటున్న మహర్షులు కూడా, ఫలపుష్పాలు కోయడం ద్వారా హింస చేస్తూనే ఉన్నారు. కనుక, లోకంలో హింస చెయ్యని వాడెవ్వడు లేడు.

ఇతరుల ప్రాణాలను కాపాడవలసి వచ్చినప్పుడు చెప్పే అసత్యం కూడా దోషంకాదు. జీవుడు పూర్వజన్మకర్మ ఫలాన్ని అనుభవించే తీరాలి. తనకు కష్టాలు వచ్చినప్పుడు, భగవంతుణ్ని నిందిస్తాడు. ఇదేమి న్యాయం. మనం చేసికొన్న కర్మలవల్లనే ఈ శరీరం లభించింది. ఇక్కడ మంచిపనులు చేస్తే, మరో జన్మలో, మంచిజన్మ వస్తుంది'' అని వివరించి, ఇంద్రియాలు, కర్మేంద్రియాలను గురించి తెలియజేశాడు. చివరగా బ్రహ్మ విద్యను గురించి చెప్పాడు.

తనకంతటి శక్తి లభించడానికి గలకారణం విశదంగా చెబుతానని ధర్మవ్యాధుడు, ఆయనను లోపలిగదిలోకి తీసుకొనివెళ్ళాడు. ఆ గది ఎంతో మనోహరంగా ఉంది. అందులో చక్కని వస్త్రాలు ధరించిన వృద్ధ దంపతులున్నారు. 'వారిని చూపిస్తూ, వీరు మా తల్లిదండ్రులు' అని వారికి పాదాభివందనం చేశాడు. ఎలా ఉన్నారు అని తల్లిదండ్రుల నడిగారు. అప్పుడు, ''నాయనా! ధర్మవ్యాధా! నీ వంటి కుమారుడుండగా మా కేమిలోటు? నీవు చేస్తున్న ధర్మమే నిన్ను కాపాడుతుంది. సంపూర్ణాయుర్దాయము, సంపదలను పొందు. నీవల్ల మన వంశం పవిత్రమైంది. నాయినా! నువ్వు మానవ దేహంలో ఉన్న మాధవుడివి. తల్లి దండ్రులను సేవించిన వారిలో ముందు నిన్ను చెప్పి, తరువాత పరశురాముణ్ని గురించి చెప్పాలి'' అంటూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ధర్మ వ్యాధుడు, తల్లిదండ్రులకు కౌశికుని పరిచయం చేశాడు. తల్లిదండ్రులకు సేవ చేసిన కారణంగా తనకటువంటి విజ్ఞానం కలిగిందన్నాడు. తల్లిదండ్రులను, గురువులను సేవించిన వారికి ఉత్తమ జ్ఞానము, సద్గతులు కలుగుతాయన్నాడు. వృద్ధులైన తల్లిదండ్రులను సేవించక, వారినెక్కడో, ఎవరి పంచనో పడవేసిన వాడు క్రూరకర్ముడని, వానికి ఉత్తమగతులుండవని చెప్పాడు.

చివరగా, ఒక్క విషయం చెబుతాను. నీకెన్ని విషయాలు చెప్పినా, నాకు తృప్తికలుగ లేదు. నీవు చేసిన దోషం ఒకటుంది. కౌశికా! నీ తల్లి దండ్రులకి నీ వొక్కడివే కుమారుడివి. ముసలివారైన తల్లిదండ్రులను వారి కర్మకు విడిచిపెట్టేశావు. వారి అనుమతి, ఆశీస్సులు లేకుండానే వేదాధ్యయనానికి సిద్ధపడ్డావు. నీకోసం ఏడ్చి ఏడ్చిన కన్నవారు కళ్ళు పోగొట్టుకొన్నారు. గ్రుడ్డి వాళ్ళయ్యారు. ఇప్పటికైనా ఇంటికి వెళ్ళు. ముదుసలులైన తల్లిదండ్రులను ఆదరించు. వారికి సేవలు చెయ్యి. కొడుకువనిపించుకో. లేకపోతే నీ తపస్సు, నీ వేదవిద్య నీకు సత్ఫలితాల ను ఇవ్వవు. తల్లిదండ్రుల ఆశీస్సులు లేని కొడుకు అభివృద్ధి చెందడు'' అన్నాడు.

అప్పుడు కౌశికుడు, నా అదృష్టం వలన నిన్ను కలుసుకొన్నాను. మంచి విషయాలు విన్నాను. నీవునా పాలిటి దైవానివి. నిన్ను శూద్రుడుగా భావించకూడదు. నీవు బ్రాహ్మణుని కన్నా చాలా గొప్పవాడివి. సర్వ విషయాలు తెలిసిన నీవు, కిరాతుడుగా జన్మించడానికి ఏదో బలమైన కారణం ఉండే ఉంటుంది. నీకు భూతభవిష్యద్వర్తమానాలు కళ్ళకు కట్టినట్లు కనబడుతూనే ఉంటాయి. నీ గత జన్మ వృత్తాంతం తెలియ జెయ్యి'' అని కోరాడు

అపుడు ధర్మవ్యాధుడు తన పూర్వజన్మ వృత్తాంతం చెప్పడం మొదలుపెట్టాడు

## ధర్మవ్యాధుని పూర్వజన్మ వృత్తాంతం

గత జన్మలో నేనొక బ్రాహ్మణుణ్ని, వేదవేదాంగాలు చదివాను, నా స్నేహితుడైన ఒక రాజు కుమారుడితో కలిసి విలువిద్య కూడా అభ్యసించాను. ఒకనాడు నేను నా స్నేహితునితో కలిసి వేటకు వెళ్ళాను. నేను ప్రయోగించిన బాణం ఒక మహర్షికి తగిలింది. అతని దగ్గరకు వెళ్ళి ఉపచారాలు చేశాను. ఆ ముని కోపంతో ''నీవు బ్రాహ్మణుడవై యుండి వేటాడావు. కనుక నీవు కిరాతుడవై జన్మించు'' అని శపించాడు.

నేనాయనను ప్రాధేయపడుతూ,''అయ్యా! మన్నించండి, ప్రమాదవశాన తప్పు జరిగిపోయింది శాపాన్ని ఉపసంహరించండి'' అని కోరాను.

అపుడా మహర్షి, ''నా శాపం తిరుగులేనిది. నువ్వు కిరాతకుడిగా జన్మించినా, గతజన్మపు ఎరుక గలవాడవైయుంటావు. తల్లిదండ్రుల యందు భక్తి కలవాడవైయుంటావు'' అన్నాడు.

ఆ కారణంగా నాకీ జన్మ సంప్రాప్తమైంది'' అనగానే కౌశికుడు,''ఇది చాలా వింతగా ఉంది. కిరాతుడవైయుండి. బ్రాహ్మణ ధర్మాలాచరించావు నేను బ్రాహ్మణుడనైయుండి, కిరాతుడుగా ప్రవర్తించాను. నీవు జన్మతహ శూద్రుడవైనా కర్మవలన బ్రాహ్మణుడవు.''

నాకనుజ్ఞ ఇస్తే నా తల్లిదండ్రుల దగ్గరకు వెడతానన్నాడు. ధర్మ వ్యాధుడు చిరునవ్వుతో అంగీకరించాడు. కౌశికుడు, ధర్మవ్యాధుడికి నమస్కారపూర్వకంగా ప్రదక్షిణం చేసి ఇంటికి వెళ్ళాడు, ముదుసలి వారైన తల్లి దండ్రులకు ఉపచారాలు చేసి జన్మసార్థకం చేసుకున్నాడు.

ధర్మరాజా! నీ వడిగిన దానికి సమాధానంగా పతివ్రతా మహాత్మ్యాన్ని, తల్లిదండ్రులకు సేవలుచేసినందు వల్ల ధర్మవ్యాధుడు పొందిన ప్రయోజనాలను వివరించాను. సంతోషమే కదా'' అన్నాడు మార్కండేయ మహర్షి.

*– అవధాన రత్నాకర, కవితిలక పండిత*
***వారణాసి వెంకటేశ్వర శాస్త్రి,*** ఎం.ఎ., బి.ఇడి.

గ్రామీణ కుటుంబాల్లో పేదరికం అరికట్టటానికి, మహిళల్లో సామాజిక చైతన్యం మరియు ఆర్థిక సాధికారత పెంపొందించే దిశగా మన రాష్ట్రం గత రెండు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్నది. ఇంచుమించు కోటి మంది గ్రామీణ పేద మహిళల్ని స్వయం సహాయక బృందాలలో సభ్యులుగా చేర్పించి, వారికి పొదుపు అలవాటు నేర్పించి, ఆ పొదుపు ద్వారా తక్కువ వడ్డీలకు బ్యాంకు రుణాలు కల్పించడం, తద్వారా ఆదాయ వనరులను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించి దేశంలోనే మన రాష్ట్రం అగ్రగామిగా నిలచింది. ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలచింది. ఈ విజయాలు నేడు దేశవిదేశాల నుంచి చాలామంది అధికారులను, మేధావులను, సామాజిక విశ్లేషకులను ఆకర్షిస్తున్నాయి. అయితే ఏమాటకామాటే చెప్పుకోవాలి. మన పొరుగు రాష్ట్రాలతో పోల్చి చూస్తే, ఈ స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి మన రాష్ట్రంలో జరిగిన కృషిలో స్థానిక సంస్థలు, ముఖ్యంగా పంచాయితీల పాత్ర కొంత తక్కువనే చెప్పాలి. ఈ సందర్భంగా కేరళ, తమిళనాడు, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలలో పంచాయతీల ప్రోత్సాహంతో స్వయం సహాయక బృందాలు సాధించిన ప్రగతిని ఒకసారి తెలుసుకుందాం.



ముందుగా ఒక్కమాట. ఈ విశేష ప్రగతి అంతా అక్కడి ప్రభుత్వాల చొరవతో, స్థానిక సంస్థల ప్రోత్సాహంతో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు, మహిళా స్వయం సహాయక సంఘాలు కలసి సాధించినదే. ఈ ఫలితాల వెనక ఎంతో కృషి ఉంది. ఎన్నెన్నో ప్రయోగాలు, ఎన్నెన్నో ఆటుపోట్ల తర్వాత సాధించిన విజయాలని చెప్పాలి.

అలాగే అళపుళ అనే జిల్లాలోని కొన్ని గ్రామ పంచాయతీలు పారిశుద్య వ్యవహారాల నిర్వహణ, బాధ్యతలు స్వయం సహాయక బృందాలకు ఇచ్చాయి. దీనితో ఈ గ్రామాలలో పరిశుభ్రత పెరిగి, అంటువ్యాధులు చాలా వరకు తగ్గినవి. అదే రాష్ట్రంలోని పాల్ఘాట్ లాంటి జిల్లాలలో గ్రామపంచాయతి నిధులతో ఇందిరా ఆవాస్ యోజన ఇళ్ళను, మరుగుదొడ్లను నిర్మించే బాధ్యత కాంట్రాక్టు పద్ధతిలో స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాలు అత్యంత నాణ్యతతో నిర్వహించి మహిళా సంఘాలు అందరి మన్ననలను గైకొన్నాయి.

తమిళనాట, కోయంబత్తూరు జిల్లా ఓడుందురై పంచాయతి

# పంచాయతీల ప్రోత్సాహంతో మున్ముందుకు...

మూడేళ్ళకు ముందు కేరళలోని కొన్ని గ్రామాలలో సర్పంచుల మధ్యవర్తిత్వంతో వ్యవసాయం చేయని భూయజమానులను గుర్తించి, వారికి, స్వయం సహాయక సంఘాల మధ్య లీజు ఒప్పందాలు కుదిర్చారు. దీనితో వ్యవసాయ కూలీలకు లాభదాయకమైన పంటలు వేసుకునే అవకాశం లభించింది. ఈ ప్రయోగం మన రాష్ట్ర ప్రభుత్వానికి కూడా స్ఫూర్తినిచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంవత్సరం నుంచి స్వయం సహాయక బృందాలకు వ్యవసాయ భూముల లీజు కల్పించే విధంగా ఒక మహత్తరమైన చట్టం వస్తున్నది.

## స్వయం సహాయక సంఘాలు






SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 4/29/2010, 3:02 PM



ప్రోత్సాహంతో కరెంటు సౌకర్యానికి నోచుకోని ఒక మారుమూల గ్రామంలో గ్రామస్థులకు ఇంటివద్దే త్రాగునీరు లభించే విధంగా స్వయం సహాయక బృందాలు చేసిన కృషి ఎంతో కొనియాద దగినది.

రెండు సంఘాలు ఉమ్మడిగా తీసుకొన్న బ్యాంకు లోనుతో గుజరాత్ నుంచి దిగుమతి చేసుకున్న బయోగ్యాస్ ఫైర్ ఏర్పాటు చేసుకున్నాయి. ఎండుపుల్లలు, వ్యర్థ జీవపదార్థాలతో నడిచే ఈ గ్యాస్‌ఫైర్ ద్వారా భూగర్భ జలాల్ని ఓవర్ హెడ్ టాంకును చేరవేసి, అందుండి ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా చేస్తున్నాయి. ఇందుకు అవసరమైన నిర్వహణ ఖర్చులతో పాటు కొంత కమీషన్‌ను కూడా నెలవారీగా గ్రామ పంచాయతీ చెల్లిస్తున్నది. ఈ పథకం క్రింద నలుగురు మహిళలకు రోజూ పార్ట్‌టైమ్ ఉపాధి లభిస్తున్నది.



పుదుక్కోటై, కోయంబత్తూరు, సేలం జిల్లాలలో సుమారు దశాబ్దకాలంగా గ్రానైట్ క్వారీలలో ఐదు శాతం అందులో రోజువారీ కూలీ చేసుకొనే పేద కుటుంబాల్ని స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేసి, లీజుకిచ్చింది. ఇందుకుగాను, దేశంలో ఎక్కడాలేని విధంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టం జారీ చేసింది (17/341/LC 97/15-2-2000). ఈ సౌలభ్యం పొందిన స్వయం సహాయక బృందాల సభ్యులు రెండు మూడేళ్ళలోనే పేదరికం నుండి బయటపడ్డారు.

సేలం జిల్లాలోని తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న కొన్ని గ్రామాలలో ప్రయోగాత్మకంగా తక్కువ నీటితో, పొదుపుగా, బట్టలు ఉతకడానికి పంచాయతీ ప్రోత్సాహంతో హెవీడ్యూటీ వాషింగ్‌మిషన్‌ను స్వయం సహాయక సంఘాలు ఉమ్మడిగా ఏర్పాటు చేసుకున్నాయి. దీని ద్వారా గ్రామస్తులందరికీ ఈ వసతి లభిస్తున్నది. దీనిని నిర్వహించడంలో మహిళా సభ్యులు చాలా మెళకువలు నేర్చుకుంటున్నారు. కోయంబత్తూరు తదితర జిల్లాలలో పంచాయతీలు ఎంతో చొరవ తీసుకొని, బస్టాండులు, వ్యవసాయ మార్కెట్లు, దేవాలయ ప్రాంగణాల దగ్గర ద్విచక్రవాహనాల పార్కింగ్ నిర్వహణా బాధ్యతలు మహిళా సంఘాలకు ఇచ్చాయి.

మనకు పొరుగున ఉన్న ఛత్తీస్‌గడ్‌లోని బస్తర్ జిల్లాలో కొన్ని పంచాయతీలు 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సంక్రమించిన అధికారాలతో గ్రామాల్లో ఉన్న చేపల పెంపకానికి అనువైన చిన్న చిన్న చెరువులను, కుంటలను స్థానికంగా ఉన్న స్వయం సహాయక బృందాలకి వేలం ద్వారానో లేక ఇతరత్రా బిడ్డింగ్ పద్ధతి ద్వారా లీజుకిస్తున్నవి. గిరిజన ప్రాంతాలలోనైతే కొన్ని పంచాయతీలు స్థానికంగా లభించే ఇప్పపూలు, గింజలు, కుంకుడుకాయలు, తేనె, చింతపండు మున్నగు అటవీ పదార్థాలను సేకరించే సౌలభ్యాన్ని కూడా స్వయం సహాయక సంఘాలకు ఇస్తున్నవి.

ఈవిధంగా కొన్ని పంచాయతీలు స్వయం సహాయక సంఘాలకు పలురంగాలలో ప్రోత్సాహం ఇస్తున్నవి. అయితే ఇది ఒక్కనాటితో సాధించిన విజయం కాదు. పలుమార్లు గ్రామ సభలలో చర్చించి, విభేదించి, తిరిగి మరలా చర్చించిన తర్వాతే సాధించగలిగారు. ఈ మహాప్రస్థానంలో స్వయం సహాయక సంఘాలుకు పంచాయతీలలో, గ్రామసభల నిర్వహణలో చురుగ్గా పాల్గొని ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల పరిరక్షించుకునే నేర్పు, అనుభవం, మెళకువలు గడించే అవకాశాల్ని సంపాదించుకున్నాయి. ఇదంతా గ్రామస్థాయిలో ప్రజాస్వామ్యం బలోపేతం చేసే ప్రక్రియలో ఒక భాగంగా ఆవిర్భవించింది.

**- పి. పురుషోత్తం**
ప్రొఫెసర్, శాఖాధిపతి,
స్వయం ఉపాధి, జీవనోపాధులు,
జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ,
హైదరాబాదు - *500030.*



SthanikaPalanaTel_May_2010_Black&White.pm10 4/29/2010, 3:02 PM

**73వ రాజ్యంగ సవరణ రావడానికి ముందే ఆంధ్రప్రదేశ్‌లో మూడంచెల పంచాయితీరాజ్ వ్యవస్థ ఏర్పాటు చేయబడింది.**

**ఆంధ్రప్రదేశ్ జిల్లాల (ఏర్పాటు) చట్టం 1974లోని 3వ సెక్షనులో రాష్ట్రాన్ని జిల్లాలుగా విభజించటం. కొత్త జిల్లాలను ఏర్పాటు చేయటం మరియు ఉన్న జిల్లా ప్రాంతాన్ని, హద్దులను లేదా పేర్లను మార్చటాన్ని గురించి పేర్కొన్నారు.**

(1) రెవెన్యూ పరిపాలన కొరకు ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా, అట్టి నోటిఫికేషన్‌లో పేర్కొనబడిన తేది నుండి అమలులోనికి వచ్చే విధంగా రాష్ట్రాన్ని జిల్లాలుగా విభజించవచ్చును. ప్రతి జిల్లా రెవెన్యూ విభాగాల ను కలిగి ఉంటుంది. ప్రతి రెవెన్యూ విభాగంలో మండలాలు, ప్రతి మండలంలో గ్రామాలు ఉంటాయని పేర్కొన్నారు.

(2) ప్రాంతాల అభివృద్ధి, మెరుగైన పరిపాలన కొరకు ఎప్పటికప్పుడు నోటిఫికేషన్ ద్వారా అట్టి నోటిఫికేషన్‌లో పేర్కొన్న తేదీ నుండి అమలులోకి వచ్చే విధంగా–



# మన మండలం – మన మండల పరిషత్తు

(ఎ) ఏదేని జిల్లా, రెవెన్యూ విభాగము లేదా మండలాన్ని విడగొట్టడం ద్వారా లేదా రెండు లేదా అంత కంటే ఎక్కువ జిల్లాలను, రెవెన్యూ విభాగాల ను లేదా మండలాలను కలపడం ద్వారా లేదా వాటిల్లోని ఏదేని విభాగాన్ని జిల్లాకు, రెవెన్యూ విభాగానికి లేదా మండలానికి కలపడం ద్వారా క్రొత్త జిల్లా, రెవెన్యూ విభాగం లేదా మండలాన్ని ఏర్పాటు చేయడం.

(బి) జిల్లా, రెవెన్యూ విభాగం లేదా మండలాల ప్రాంతాన్ని విస్తరింప జేయటం.

(సి) జిల్లా, రెవెన్యూ విభాగం లేదా మండలాల ప్రాంతాన్ని తగ్గించటం.

(డి) జిల్లా, రెవెన్యూ విభాగం లేదా మండలాల హద్దులను మార్చటం.

(ఇ) జిల్లా, రెవెన్యూ విభాగం లేదా మండలం పేరును మార్చటం.

ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా, అట్టి నోటిఫికేషన్‌లో పేర్కొనబడిన తేదీ నుండి అమలులోనికి వచ్చే విధంగా చేయవచ్చును అని పేర్కొనబడింది.

## మండల పరిషత్తు ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994లోని 148వ సెక్షనులో మండలాల ఏర్పాటు గురించి చెప్పబడింది. ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ప్రతి మండలానికి ఒక మండల పరిషత్తును ఏర్పాటు చేయాలని ఇందులో పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ జిల్లాల (ఏర్పాటు) చట్టం 1974 ననుసరించి మండలాన్ని పునర్ నిర్మించినా (redilimited) లేదా క్రొత్త మండలాన్ని ఏర్పాటు చేసినా ప్రభుత్వం పునర్ నిర్మించబడిన మండలానికి మండల పరిషత్తును మళ్ళీ ఏర్పాటు చేయవచ్చు లేదా క్రొత్తగా ఏర్పడిన మండలానికి క్రొత్త మండల పరిషత్తును ఏర్పాటు చేయవచ్చును. అట్లు నూతనంగా ఏర్పడిన లేదా పునర్ నిర్మించబడిన మండల పరిషత్తు లేదా మండల పరిషత్తులు ఏర్పడటానికి ముందున్న కార్యవర్గం functining రద్దు అవుతుంది.

అయితే మండల పరిషత్తును పునర్ నిర్మించేటప్పుడు (reconstitition) మండల పునర్ నిర్మాణానికి (redelimitation) ముందు అధ్యక్షుడుగా ఉపాధ్యక్షుడిగా లేదా మండల పరిషత్తుకు ఎన్నికైన సభ్యుడిగా ఉన్న వ్యక్తి ఇతరత్రా అర్హుడైనట్లయితే ఎన్నికైన సభ్యునిగా కొనసాగమని ప్రభుత్వం ఆదేశించవచ్చును.

ఒక మండలానికి మండల పరిషత్తు ఏర్పడిన తర్వాత అట్టి మండలంలోని ఒక భాగం పొరుగున ఉన్న పట్టణంలో గాని నగరంలో గాని కలిసినట్లయితే మరియు

(1) అట్టి మండలలోని మిగిలిన భాగం ప్రత్యేక మండలంగా ఏర్పరచటానికి అనుకూలంగా ఉన్నట్లయితే అట్టి మిగిలిన భాగాన్ని ఆంధ్రప్రదేశ్ జిల్లా (ఏర్పాటు) చట్టం 1974 ప్రకారం ప్రత్యేక మండలంగా పునర్ నిర్మించి, అట్లు క్రొత్తగా ఏర్పడిన మండలానికి మండల పరిషత్తును ఏర్పాటు చేయవచ్చును మండల పునర్నిర్మాణానికి ముందు అట్టి మండలంలో భాగంగా ఉండి, పొరుగున ఉన్న పట్టణం లేదా నగరంలో కలిసిన భాగాన్ని అట్టి పట్టణం లేదా నగరంలోని మండలానికి జతచేయ బడుతుంది లేదా.

(2) అట్లు మిగిలిన మండలం భాగం ప్రత్యేక మండలంగా ఏర్పడటానికి అనుకూలంగా లేనట్లయితే ప్రభుత్వం

(ఎ) అట్టి మండల పరిషత్తును రద్దు చేసి మిగిలిన మండల భాగాన్ని పొరుగున ఉన్న మండలం లేదా మండలాల్లో కలుపుట లేదా

(బి) అట్టి మిగిలిన భాగానికి పొరుగున ఉన్న మండలం లేదా మండలాల్లోని ప్రాంతాలను కలిపి క్రొత్త మండలాన్ని ఏర్పాటు చేయటం మరియు అట్టి క్రొత్త మండలానికి క్రొత్త మండల పరిషత్తును ఏర్పాటు చేయవచ్చును.

అయితే పైన పేర్కొనబడిన క్లాజ్ (I) లేదా క్లాజ్ (II) లోని సబ్ క్లాజ్ (బి) ప్రకారం మండల పరిషత్తును ఏర్పాటు చేసినప్పుడు రద్దయిన మండల పరిషత్ యొక్క అధ్యక్షుడిని, ఉపాధ్యక్షుడిని లేదా రద్దయిన మండల పరిషత్‌కు ఎన్నికైన సభ్యుణ్ని అట్టి పదవిలో ఉండుటకు ఇతరత్రా అర్హతలున్నట్లయితే క్రొత్తగా ఏర్పడిన మండల పరిషత్తుకు అధ్యక్షునిగా ఉపాధ్యక్షునిగా లేదా ఎన్నికైన సభ్యుడిగా వ్యవహరించమని ప్రభుత్వం ఆదేశించ వచ్చును.

ఆ విధంగా క్రొత్తగా ఏర్పడిన మండలానికి అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా లేదా ఎన్నికైన సభ్యుడుగా సబ్ సెక్షను ప్రకారం కొనసాగిన వారు రద్దయిన మండల పరిషత్తు అధ్యక్షునిగా ఉపాధ్యక్షునిగా లేదా ఎన్నికైన సభ్యుడిగా ఉన్న మిగిలిన పదవీ కాలం వరకూ మాత్రమే కొనసాగుతారు.

అయితే పైన పేర్కొనబడిన క్లాజ్ (ఎ) ప్రకారం రద్దయిన మండల పరిషత్తు అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు లేదా ఎన్నికైన సభ్యుడు పైన పేర్కొనబడిన విధంగా కొనసాగింపబడనట్లయితే వాళ్ళు తమ పదవులను కోల్పోతారు.

ప్రతి మండల పరిషత్తు ఏమండలం కొరకు అది ఏర్పరచబడినదో లేదా పునర్నిర్మించబడిందీ అట్టి మండలం పేరుతో వ్యవస్థీకృత సంస్థ సంస్థ (body corporate) గా శాశ్వత వారసత్వం కలిగి, ఆస్థులను పొందటానికి, అన్యాక్రాంతము చేయటానికి, ఒప్పందాలు చేసుకొనటానికి, సంస్థ పేరుతో దావా వేయటానికి, దావాలు ఎదుర్కోటానికి అధికారాలతో ఒక సాధారణ ముద్ర (common seal) కలిగి ఉంటుంది.

## మండల పరిషత్తు - సభ్యులు

మండల పరిషత్తులో ఉండే సభ్యుల గురించి 149వ సెక్షనులో పేర్కొన్నారు.

(1) ప్రతి మండల పరిషత్తులోను సభ్యులు

(ఎ) ఈ చట్టంలోని 151వ సెక్షను ప్రకారం ఎన్నికైన సభ్యులు

(బి) సంబంధిత మండలం మొత్తం గానీ లేదా పాక్షికంగా కానీ ఉన్న నియోజనక వర్గానికి శాసన సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న శాసన సభ్యుడు.

(సి) సంబంధిత మండలం పూర్తిగా గానీ లేదా పాక్షికంగా గానీ ఉన్న నియోజక వర్గానికి లోక్‌సభలో ప్రతినిధ్యం వహిస్తున్న సభ్యుడు.

(డి) సంబంధిత మండలంలో ఓటరుగా నమోదు కాబడి ఉన్న రాజ్యసభ సభ్యుడు.

(ఇ) మండలంలో ఓటరుగా నమోదు కాబడి 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న మైనార్టీలకు చెందిన కాజు (ఎ)లో పేర్కొనబడిన సభ్యులచే ఎన్నిక కాబడిన ఒక సభ్యుడు.

(2) ఏ వ్యక్తీ కూడా సబ్ సెక్షన్ (ఎ)లో పేర్కొనబడిన వాటిలో ఒకటి కంటే ఎక్కువ కేటగిరీలలో సభ్యుడై ఉండరాదు. ఒకటి కంటే ఎక్కువ కేటగిరీలలో మండల పరిషత్ సభ్యుడైన వ్యక్తి 153వ సెక్షన్‌లోని 3వ సబ్ సెక్షను ప్రకారం జరిగే మండల పరిషత్ తొలి సమావేశం జరిగిన నాటి నుండి 15 రోజులలోపు తాను ఏ కేటగిరిలో కొనసాగాలను కుంటున్నాడో తెలియజేస్తూ, మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి లిఖిత పూర్వకంగా సంతకం చేసి ఇవ్వాలి.

తదుపరి ఇతర కేటగరీలలో అతని సభ్యత్వం రద్దవుతుంది. ఆ విధంగా నిర్ధిష్ట కాలపరిమితిలోపు తెలియ పరచక పోయినట్లయితే అట్టి కాల పరిమితి తరువాత మండల పరిషత్‌లో తొలుత ఏ కేటగిరీలో సభ్యుడైనాడో అది రద్దయి, తదుపరి ఏ కేటగిరీలో సభ్యుడైనాడో అది కొనసాగుతుంది. ఈ ఉప సెక్షను ప్రకారం ఇచ్చిన లేఖ (intimation) ను ఉపసంహరించుకోవటానికి వీలు లేదు మరియు అదే ఖరారు.

అయితే ఒకటి కంటే ఎక్కువ నియోజక వర్గాల నుండి ఎన్నికైన వ్యక్తి నిర్దేశించిన పద్దతిలో ఒక స్థానాన్ని ఉంచుకొని మిగతా స్థానం లేదా స్థానాలను ఖాళీ చేయాలి. లేనట్లయితే అతను అన్ని స్థానాలను ఖాళీ చేసినట్లుగా భావించబడుతుంది.

## ప్రాదేశిక నియోజక వర్గాలు

149వ సెక్షను సబ్ సెక్షను (1) క్లాజు (ఎ) ప్రకారం సభ్యులను ఎన్నుకొనటానికి మండలాన్ని ప్రాదేశిక నియోజక వర్గాలుగా కమిషనర్ నిబంధనలకు లోబడి విభజిస్తారని 150వ సెక్షనులో పేర్కొన్నారు. అట్టి విభజన సాధ్యమైనంత వరకూ ప్రతి నియోజక వర్గం 3 వేలు నుండి 4 వేలు జనాభా కలిగి ఉండేట్లుగానూ, మండలంలోని ప్రతి నియోజకవర్గ జనాభా నిష్పత్తి సాధ్యమైనంత వరకు మండలం అంతా ఒకే విధంగా ఉండేలా ఉండాలి.

అయితే మండల పరిషత్తులోని ప్రాదేశిక నియోజక వర్గ జనాభా నిష్పత్తి, అట్టి మండల పరిషత్తులో ఉండే స్థానాల సంఖ్య సాధ్యమైనంత వరకూ రాష్ట్రమంతా ఒకే విధంగా ఉండాలి. ప్రాదేశిక నియోజక వర్గాల నుండి సభ్యుల ఎన్నిక గురించి 151వ సెక్షనులో పేర్కొన్నారు.

(1) 150వ సెక్షను ప్రకారం ఏర్పడిన ప్రతి ప్రాదేశిక నియోజక వర్గం నుండి ఒక సభ్యుడు ఆ ప్రాదేశిక నియోజక వర్గంలో నమోదు కాబడిన ఓటర్లచే రహస్య బ్యాలెట్ పద్దతిలో ఎన్నుకోబడతాడు.

(2) ఈ సెక్షను ప్రకారం సభ్యుల ఎన్నికకు ఓటర్ల జాబితాను రూపొందిచటం, ప్రచురించుటకు ఈ చట్టంలో 11, 12 సెక్షన్లలో పేర్కొన్న అంశాలే ఇందు కొరకు రూపొందించబడిన నిబంధనలకు లోబడి వర్తిస్తాయి.

## రిజర్వేషన్లు

భారత రాజ్యాంగంలోని 243డి అధికరణం పంచాయితీ సంస్థలో రిజర్వేషన్లను గురించి పేర్కొనబడింది. ప్రతి పంచాయితీలోనుషెడ్యూలు కులాలకు, షెడ్యూల తెగలకు రిజర్వేషను కల్పించాలని, ఆ విధంగా రిజర్వు చేయబడిన స్థానల్లో 3వ వంతు స్థానాలను మహిళలకు రిజర్వు చేయాలని ఇట్టి రిజర్వేషన్‌ను రొటేషన్ పద్ధతిలో అమలు జరపాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో గానీ లేదా ఏ ఇతర స్థాయిలో గాని పంచాయితీ ఛైర్ పర్సన్ స్థానాల్లో కూడా షెడ్యూలు కులాలకు, షెడ్యూలు తెగలకు, మహిళలకు రాష్ట్ర శాసన సభ నిర్దేశించిన పద్దతిలో రిజర్వేషన్ కల్పించాలని కూడా ఇందులో పేర్కొన్నారు.

రాష్ట్ర శాసనసభ ఏ స్థాయిలోని పంచాయితీనైనా వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించడానికి ఈ అధికరణ అటంకం కాదని కూడా స్పష్టం చేయబడింది. ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994లోని 152 సెక్షను మండల పరిషత్తు సభ్యుల స్థానాలలో నిర్దిష్టమైన

స్థానాలను షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన వారికి కేటాయిస్తూ కమీషనరు నిబంధనలను అనుసరించి నోటిఫికేషన్ జారీ చేయవచ్చు. అట్టి రిజర్వేషన్‌లను రొటేషన్ పద్దతిలో అమలు చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా రిజర్వు చేయబడిన స్థానాలలో 1/3 వంతు స్థానాలను షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలకు కేటాయించాలి.

షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులకు రిజర్వు చేయబడిన స్థానాలతో సహా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా భర్తీ చేయబడే మండలంలోని మొత్తం స్థానాలలో మూడవ వంతు స్థానాలను మహిళలకు రొటేషన్ పద్దతిలో రిజర్వేషన్ కల్పించాలి.

ప్రతి మండల పరిషత్‌లోను వెనుక బడిన తరగతులకు నిర్దేశించిన పద్దతిలో రిజర్వేషన్ కల్పించాలి. రాష్ట్రంలోని మండల పరిషత్ సభ్యుల మొత్తం స్థానాలలో వెనుకబడిన తరగతులకు రిజర్వు చేయబడిన స్థానాల సంఖ్య 34% తగ్గకుండా ఉండాలి. ప్రతి మండల పరిషత్‌లోను రిజర్వేషన్‌కు కేటాయించబడే స్థానాలను రొటేషన్ పద్దతిలో అమలు జరపాలి.

అయితే షెడ్యూల్ ప్రాంతాలలోని మండల పరిషత్తులలో వెనుకబడిన తరగతులకు రిజర్వు చేయవలసిన పద్ధతి, స్థానాల సంఖ్య విషయంలో ప్రత్యేకమైన నిబంధనలను ప్రభుత్వం రూపొందించవచ్చు.

షెడ్యూల్ కులాలు, తెగలు లేదా వెనుకబడిన తరగతులు, స్త్రీలు రిజర్వ్ చేయబడని జనరల్ స్థానాలతో పోటీ చేయటానికి ఏ విధమైన ఆటంకం ఉండదు.

రాష్ట్రంలోని మొత్తం అధ్యక్షస్థానాలలో షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులకు కొన్ని స్థానాలను రిజర్వ్ చేస్తూ కమీషనర్ నింబంధనలను అనుసరించి నోటిఫికేషన్ జారీ చేయవచ్చును. అట్లు రిజర్వు చేయబడిన స్థానాలలో మూడవ వంతు స్థానాలను మహిళలకు కేటాయించాలి.

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులకు కేటాయించిన స్థానాలలో మహిళలకు కేటాయించాలి. అట్లు కేటాయించిన స్థానాలను రొటేషన్ పద్దతిలో నిర్దేశించిన విధంగా అమలు జరపాలి.

రాష్ట్రంలోని మొత్తం మండల పరిషత్ అధ్యక్షస్థానాలలో 34% తగ్గకుండా వెనుకబడిన తరగతులకు కేటాయించాలి. ప్రతి జిల్లాలోను రిజర్వేషన్‌కు కేటాయించబడిన అధ్యక్ష స్థానాల సంఖ్యను రొటేషన్ పద్ధతిలో అమలుజరపాలి.

## అధ్యక్షులు, ఉపాధ్యక్షుల ఎన్నిక

ప్రతి మండల పరిషత్‌కు ఒక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నికైన సభ్యుల నుండి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ జారీ చేసే విప్‌ను అనుసరించి ఎన్నుకోబడతారు.

పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేసిన సభ్యులు నిర్దేశించిన పద్ధతిలో తన సభ్యత్వాన్ని కోల్పోతారు. ఆ విధంగా ఏర్పడిన ఖాళీని క్యాజువల్ వేకెన్సీగా భర్తీ చేయాలి.

అధ్యక్షుని, ఉపాధ్యక్షుని ఎన్నుకోటానికి తొలి మండల పరిషత్ సమావేశాన్ని సాధారణ ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన తరువాత సాధ్యమైనంత త్వరలో జరపాలి. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుని ఎన్నికకు జరిగే సమావేశం తేది, సమయం గురించిన నోటీసును నిర్దేశించిన పద్ధతిలో ఎన్నికైన సభ్యులకు అందజేయాలి. ఏ కారణం చేతనయినా అధ్యక్షుని , ఉపాధ్యక్షుని ఎన్నిక పైన పేర్కొన్న విధంగా నిర్ణయించిన తేదీ నాడు జరగనట్లయితే, ఆ మరుసటి రోజు మండల పరిషత్‌కు సెలవు దినం అయినా, కాకపోయినా అధ్యక్షుని ఉపాధ్యక్షుని ఎన్నిక జరగాలి.

అధ్యక్షుడు సంస్థల కొరకు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమీషనర్ నిర్దేశించిన తేదీ ప్రకారం జరిగిన సాధారణ ఎన్నికల తర్వాత జరిగిన తొలి మండల పరిషత్ సమావేశం నాటినుండి ఐదు సంవత్సరాల వరకు అధ్యక్షుడు లేదా ఉపాధ్యక్షుడు కొనసాగుతారు.

అధ్యక్షుని లేదా ఉపాధ్యక్షుని స్థానాలకు ఏర్పడిన క్యాజువల్ ఖాళీని, అట్టి ఖాళీ ఏర్పడిన తేదీ నుండి ఆరు మాసాల లోపల పైనా పేర్కొన్న విధంగా ఎన్నికలు జరపడం ద్వారా భర్తీ చెయాలి. అట్లు ఎన్నిక కాబడిన వ్యక్తి ఎవరి ఎవరి స్థానంలో ఎన్నికైనాడో అతని మిగతా కాలపరిమితి వరకు కొనసాగుతారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నిక చేతులెత్తే పద్ధతి జరుగుతుంది. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు నిర్దేశించిన పద్ధతిలో పార్టీ జారీ చేసిన విప్‌ను అనుసరించాల్సి ఉంటుంది.

సమావేశం ప్రారంభమైన సమయంలో అవసరమైన కోరం ఉన్నట్లయితే అట్టి సమావేశం ముగిసే వరకు కోరం ఉన్నట్లుగానే భావించబడుతుంది. అంటే మధ్యలో కొంతమంది సభ్యులు వెళ్ళి పోయినా కోరం కొనసాగుతున్నట్లన్నమాట.

మొదటగా అధ్యక్షుని ఎన్నిక జరిపిన తర్వాత ఉపాధ్యక్షుని ఎన్నిక జరపాలి. అయితే ఎన్నికల అధికారి మొదటగా అధ్యక్షుని ఎన్నిక జరపడానికి బదులు ఉపాధ్యక్షుని ఎన్నిక జరిపిన అభ్యంతరం ఉండదు.

పార్టీ విప్‌ను ధిక్కరించుట వలన మండల పరిషత్ సభ్యత్వాన్ని కోల్పోయిన వ్యక్తి అట్టి చర్యను సవాలు చేస్తూ ఏ జిల్లా కోర్టు పరిధిలో ఆ మండల పరిషత్ కార్యాలయం ఉన్నదో అట్టి జిల్లా కోర్టులో దావా దాఖలు చేసుకొనవచ్చునని ఆంధ్రప్రదేశ్ పంచాయితీ రాజ్ చట్టం 1994లోని 153ఎ సెక్షనులో పేర్కొన్నారు.

ఎన్నికైన మండల పరిషత్ సభ్యుని, కో–ఆప్టెడ్ సభ్యుని పదవీ కాలం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమీషనర్ మండల పరిషత్‌ల తొలి సమావేశానికి నిర్దేశించిన తేదీ నుండి 5 సంవత్సరాల వరకూ ఉంటుందని ఈ చట్టంలోని 154వ సెక్షనులో పేర్కొన్నారు.

మండల పరిషత్ ఓటర్ల జాబితాలో నమోదు కాబడి ఉండి 21 సంవత్సరాల వయస్సు నిండిన వ్యక్తి మాత్రమే మండల పరిషత్ సభ్యునిగా ఎన్నికల్లో పోటీ చేయటానికి అర్హుడని చట్టంలోని 155వ సెక్షనులో పేర్కొన్నారు.

అధ్యక్షుని లేదా ఉపాధ్యక్షుని అధికారాలు, విధులను గూర్చి ఈ చట్టంలోని 165వ సెక్షనులో పేర్కొన్నారు.

## అధ్యక్షుని అధికారాలు - విధులు

మండల పరిషత్ తీర్మానాల అమలుకు సంబధించినంత వరకూ మండల పరిషత్తు అభివృద్ధి అధికారిపై అధ్యక్షునికి పరిపాలనా నియంత్రణ (administrative Control) ఉండాలి.

మండల పరిషత్తుకు చెందిన అన్ని రికార్డులు పూర్తి అందుబాటులో ఉండాలి.

అత్యవసర పరిస్థితుల్లో అధ్యక్షుడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ని సంప్రదించి మండల పరిషత్ ఆమోదంతో అవసరమైన పనిని చేపట్టవల సిందిగా, ప్రజాప్రయోజనాల అవసరాలకు, భద్రతకు తాను అవసరమైన పనిని తక్షణమే చేపట్టవలసిందిగా కోరవచ్చును. కానీ సబ్ సెక్షను ప్రకారం చేపట్టిన చర్యలను, కారణాలను తదుపరి మండల పరిషత్తు సమావేశంలో తెలియపర్చాలి.

అయితే ప్రభుత్వం ఉత్తర్వులకు విరుద్ధంగా, ఏదైనా పనిని చేపట్టమని లేదా పని చేయమని అతను ఆదేశించరాదు.

## ఉపాధ్యక్షుని అధికారాలు-విధులు

అధ్యక్షుడు ఎప్పటికప్పుడు లిఖిత పూర్వకంగా దాఖలు పరచిన అధికారాలను ఉపాధ్యక్షుడు నిర్వహించాలి.

అధ్యక్షుని స్థానం ఖాళీ అయినప్పుడు మండల ఉపాధ్యక్షుడు అధ్యక్షుని అధికారాలను, విధులను నూతన అధ్యక్షుని ఎన్నిక జరిగే వరకూ నిర్వహించాలి.

అధ్యక్షుడు వరుసగా 15 రోజుల కంటే ఎక్కువ కాలం మండల పరిషత్‌కు హాజరు కాకపోయినా లేదా 15 రోజుల కంటే ఎక్కువ కాలం అశక్తుడుగా ఉన్నా అట్టి హాజరు కానీ లేదా అశక్తుడుగా ఉన్న కాలంలో అతని అధికారాలు, విధులు ఉపాధ్యక్షునికి సంక్రమిస్తాయి.

అధ్యక్షుని స్థానం ఖాళీగా ఉన్నప్పుడు లేదా అధ్యక్షుడు వరుసగా 15 రోజుల కంటే ఎక్కువ కాలం మండలంలో లేనప్పుడు లేదా 15 రోజుల కంటే ఎక్కువ కాలం ఆశక్తుడుగా ఉన్నప్పుడు, ఉపాధ్యక్షుని స్థానం ఖాళీగా ఉన్నా లేదా ఉపాధ్యక్షుడు వరుసగా 15 రోజుల కంటే ఎక్కువ కాలం మండలంలో లేకున్నా లేదా 15 రోజుల కంటే ఎక్కువ కాలం ఆశక్తుడుగా ఉన్నా అధ్యక్షుని అధికారాలు, విధులు ఇందుకొరకు ప్రభుత్వం చేత నియమింపబడ్డ మండల పరిషత్ సభ్యునికి సంక్రమిస్తాయి.

ఈ విధంగా నియమితుడైన సభ్యుడు తాత్కాలిక అధ్యక్షునిగా పరిగణంపబడి, నూతన అధ్యక్షుడు లేదా ఉపాధ్యక్షుడు ఎన్నిక కాబడి బాధ్యతలను చేపట్టే వరకూ లేదా అధ్యక్షుడు మండలానికి తిరిగి వచ్చే వరకూ లేదా ఆశక్తత నుండి కోలుకుని తిరిగి వచ్చే వరకూ అధ్యక్షుని అధికారాలను, విధులను నిర్దేశిత పరిమితులకు, షరతులకు లోబడి నిర్వహిస్తాడు.

మండల పరిషత్ సభ్యుడు ఎవరైనా మండల పరిషత్ పనిని నిర్వహించడంలో జరుగుతున్న నిర్లక్ష్యం గురించి మండల పరిషత్ ఆస్తులు వృదా చేయబడుతున్న దానిని గురించి లేదా ఏదేని ప్రాంత అవసరాల గురించి అధ్యక్షుని లేదా మండల పరిషత్ అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకురావచ్చునని, ఏదైనా అభివృద్ధికి వాంఛనీయమైన సూచనలు చేయవచ్చునని ఈ చట్టంలోని 166వ సెక్షనులో పేర్కొన్నారు.

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధికారాలు, విధులు

మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధికారాలు, విధుల (power and functions)ను ఈ చట్టంలోని 167వ సెక్షనులో పేర్కొన్నారు

1) మండల పరిషత్ అభివృద్ధి అధికారే మండల పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి, మండల పరిషత్ తీర్మానాలు అమలు జరపటానికి ప్రభుత్వం అప్పజెప్పిన అధికారాలను అమలు జరపటానికి, విధులను నిర్వహించటానికి అతడే బాధ్యత వహించాలి. మండల పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయితీలపై నిర్దేశించిన విధంగా అజమాయిషీ చేసే అధికారాన్ని కూడా అతడు నిర్వహిస్తాడు.

2) మండల పరిషత్ అధ్యక్షుని ఆమోదంతో లేదా ఆదేశం ప్రకారం మండల పరిషత్ సమావేశాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రతి నెలకి ఒక్కసారి అయినా నిర్వహించాలి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి అట్టి బాధ్యతను నిర్వహించటంలో వైఫల్యం చెందిన కారణంగా క్రిందటి సమావేశం తదుపరి 90 రోజుల వరకూ మండల పరిషత్ సమావేశం జరగనట్లయితే సంబంధిత నింబంధిత నిబంధనలు ప్రకారం అతనిపై క్రమ శిక్షణ చర్య తీసుకోవాల్సి ఉంటుంది.

అయితే మండల పరిషత్ సమావేశం జరుపుటకు అధ్యక్షుడు ఆమోదం ఇవ్వనట్లయితే మండల పరిషత్ అభివృద్ధి అధికారే సమావేశాన్ని నిర్దేశించిన విధంగా జరపాలి.

3) మండల పరిషత్ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాల్గొనాలి. అందులోని చర్చల్లో భాగం పంచుకోవాలి. కానీ తీర్మానం ప్రవేశపెట్టడం కానీ లేదా ఓటు వేయుటం కానీ చేయరాదు.

4) మండల పరిషత్ కార్యాలయంలోని ఉద్యోగులు, మండల పరిషత్తుకు ప్రభుత్వం లేదా ప్రభుత్వ విభాగాల అధిపతిచే బదిలీ చేయబడ్డ సంస్థలు, పథకాలలో పని చేస్తున్న ఉద్యోగులు 168వ సెక్షనులోని అంశాలకు లోబడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాలనా నియంత్రణ (Administrative) లో పర్యవేక్షణలో ఉంటారు.

5) మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఈ చట్టం ప్రకారం అతనికి అప్పజెప్పబడ్డ బాధ్యతలను నిర్వహిస్తున్న దానిని గూర్చి ఆదేశాలు జారీ చేసే అధికారం మండల పరిషత్తుకు ఉన్నది. అయితే అట్టి అధికారం ఈ చట్టంలోని అంశాలు, ఈ చట్టం ప్రకారం రూపొందించబడ్డ నిబంధనలకు లోబడి ఉంటుంది.

6) మండల పరిషత్తుకు ప్రభుత్వంచేత నియమించబడ్డ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేతనాన్ని అలవెన్సులు పెన్షన్, ఏదైనా భవిష్య నిధికి లేదా ప్రావిడెంట్ ఫండ్ కమ్ పెన్షన్‌కు చేయాల్సిన చెల్లింపులు, ప్రభుత్వం రాష్ట్ర సంచిత నిధి నుండి చెల్లించాలి.

7) మండల పరిషత్ అధికారి నియామక వర్గీకరణ, విధానం ఉద్యోగ నిబంధనలు వేతనం అలవెన్సులు, క్రమశిక్షణా నడవడికకు సంబంధించి నిబంధనలు రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉంది.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇతర అధికారులు, మండల పరిషత్ ఉద్యోగులు, మండల పరిషత్ పాఠశాలలు, సంస్థలలోని ఉద్యోగులు మండల పరిషత్‌కు సబార్డినేట్లుగా ఉంటారని ఈ చట్టంలోని 168వ సెక్షనులో పేర్కొన్నారు.

*– వి.రఘు,* న్యాయవాది

## వార్తల్లో 'అపార్డ్'

## "వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి" వార్షిక ప్రణాళికా ప్రాంతీయ సమావేశం

ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల "వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి", వార్షిక ప్రణాళికలను చర్చించడానికి ప్రాంతీయ సమావేశం తేది : 16-04-10న అపార్డులో జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర ప్రభుత్వ పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డా. సుధీర్ కృష్ణ అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పంచాయితీ రాజ్ ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీ యం.వి.పి.సి. శాస్త్రి, పంచాయితీ రాజ్ కమీషనర్, శ్రీ కె. చంద్రమౌళి, పంచాయితీ రాజ్ శాఖ, జిల్లా పరిషత్ ఉన్నత అధికారులు పాల్గొన్నారు. అపార్డు తరపున ప్రొ.సూర్యనారాయణరెడ్డి, అధికార



బృందం పాల్గొన్నారు. కేరళ రాష్ట్రం నుంచి శ్రీ యస్.యం. విజయకుమార్, ప్రిన్సిపల్ సెక్రటరీ, స్థానిక స్వపరిపాలన శాఖ నేతృత్వంలో అధికార బృందం ఈ సమావేశంలో పాల్గొంది.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి క్రింద గత సంవత్సరంలో సాధించిన ప్రగతి, 2010-2011 సంవత్సర వార్షిక ప్రణాళిక చర్చించారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ప్రతినిధులకు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా / గ్రామ స్థాయి అధికారులకు అపార్డు ద్వారా ఇస్తున్న పరిపాలనా నైపుణ్యం పెంచే శిక్షణా కార్యక్రమాలను ప్రశంసించటం జరిగింది. ఈ సందర్భంగా దూరవిద్య (మన టి.వి) ద్వారా "గ్రామ వికాసం 2010-2011" కార్యక్రమాలు తెలిపే పుస్తకం వార్డు మెంబర్ల శిక్షణకై తయారు చేసిన సి.బి.టి., ఐక్యరాజ్య సమితి వారిచే ముద్రించబడి, అపార్డు పునర్ ముద్రించిన స్థానిక పరిపాలన మెరుగు పరిచేందుకు కావలసిన ముఖ్య సామర్థ్యాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ♦

## రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల అధిపతులు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శుల జాతీయ సదస్సు

గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి, పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికయిన ప్రజాప్రతినిధులకు, ఇతర సామాజిక కార్యకర్తలకు సామర్థ్యాల పెంపుదలకు వివిధ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు చేస్తున్న కృషిని సమీక్షించటానికి, శిక్షణారంగంలో ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించటానికి తీసుకొనవలసిన చర్యలగూర్చి చర్చించటం కోసం వివిధ రాష్ట్రాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శులతోను, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల అధిపతులతోను ది. 10-4-2010న జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్.ఐ.ఆర్.డి), హైదరాబాదులో ఒక జాతీయ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో ముఖ్య అతిధిగా పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీ బి.కె. సిన్హా మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రజల అవసరాలను తీర్చటానికి, దారిద్ర్య నిర్మూలన దిశగా సత్వర పురోభివృద్ధి సాధించటానికి గ్రామీణాభివృద్ధిశాఖను సంసిద్ధం చేయటానికి ఒక దార్శనిక ప్రణాళికను (విజన్) రూపొందించటం జరిగిందని తెలియచేసారు. ఈ దార్శనిక ప్రణాళిక ప్రకారం క్షేత్ర స్థాయిలో పంచాయతీరాజ్ సంస్థలు, ఇతర సంస్థల ద్వారా, వివిధ గ్రామీణాభివృద్ధి పథకాల ప్రయోజనాలను పారదర్శకంగా ప్రజలకు అందచేయటానికి అవసరమైన సామర్థ్యాలను ప్రజాప్రతినిధులకు, సంబంధిత సిబ్బందికి అందజేయటానికి రాష్ట్ర గ్రామీణాభి సంస్థలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. శిక్షణావసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవటానికి శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని శ్రీ బి.కె. సిన్హా పిలుపునిచ్చారు. ఎన్.ఐ.ఆర్.డి. డైరెక్టరు జనరల్ శ్రీ మాత్యూ సి. కున్నుమ్‌కల్ మాట్లాడుతూ శిక్షణారంగంలో వివిధ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను గూర్చి పరస్పరం తెలుసుకోవటానికి ఎన్.ఐ.ఆర్.డి. నిర్వహిస్తున్న జాతీయ సదస్సు ఒక చక్కని వేదికగా ఉపయోగపడుతోందని అన్నారు. వివిధ రాష్ట్రాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శులతోను, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల అధిపతులతోను 2008 అక్టోబరులో నిర్వహించిన జాతీయ సదస్సులో అన్ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు తమ రాష్ట్రాలకు సంబంధించిన 5 సంవత్సరాల శిక్షణా ప్రణాళికలను సమర్పించటం జరిగిందనీ, ఐతే ఈ పంచవర్ష ప్రణాళికల నుండి వార్షిక ప్రణాళికలను రూపొందించుకొని సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని శ్రీ మాత్యూ సి. కున్నుమ్‌కల్ సూచించారు. ఈ సదస్సులో పాల్గొన్న పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుధీర్ కృష్ణ మాట్లాడుతూ పంచాయతీరాజ్ సంస్థల ప్రజాప్రతినిధులు, సిబ్బంది శిక్షణావసరాలను తీర్చటానికి బి.ఆర్.జి.ఎఫ్, ఆర్.జి.ఎస్.వై కార్యక్రమాల నిధులను అందచేస్తున్నట్లు తెలియచేసారు. చాలా రాష్ట్రాలు ఈనిధులు వినియోగించటంలో వెనకబడటంపై ఆయన ఆందోళన వ్యక్తపరుస్తూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు సరియైన ప్రణాళికలతో కార్యక్రమాలను రూపొందించుకొని 100 శాతం నిధుల వినియోగించుకోవలసినదిగా సూచించారు. యున్.ఎన్.డి.పి. సహకారంతో సామర్థ్యాల పెంపుదలకు దేశంలో అవలంబిస్తున్న విధానాన్ని ఆయన వివరించారు. సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాల అమలులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి అకాడమీ కనపరుస్తున్న ప్రగతిని, లక్షల సంఖ్యలోని ప్రజాప్రతినిధులకు సామర్థ్యాలపెంపుదలకు అపార్డు అనుసరిస్తున్న శిక్షణా వ్యూహాలను ఆయన ప్రశంసించారు.






SthanikaPalanaTel_May_2010_Colour.pmd 15 4/29/2010, 5:49 PM

ఈ సదస్సులో పాల్గొన్న గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సంయుక్త సెక్రటరీ శ్రీ గంగ్వార్ ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతాలలో పట్టణ సౌకర్యాలను కల్పించటానికి ఉద్దేశించిన పురా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖలో సలహాదారుగా పనిచేస్తున్న శ్రీ ఆదిత్యప్రకాష్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలకు, ఇటిసి లకు అందచేస్తున్న సహాయాన్ని గురించి వివరించారు. అన్ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు తాము సాధించిన శిక్షణా ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఉంచవలసినదిగా ఆదిత్యప్రకాష్ కోరారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సామర్థ్యాల పెంపుదల, శిక్షణా రంగాలలో ఎదురవుతున్న సవాళ్ళపై రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల అధికారులు, వివిధ రాష్ట్రాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు విస్తృతంగా చర్చించి పలు సిఫార్సులు చేసారు. వీటిలో ముఖ్యంగా శిక్షణావసరాలు తీర్చటానికి, శిక్షణను ఒక నిరంతర ప్రక్రియగా మలచటానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖనుండి అమలయ్యే పథకాల నిధుల నుండి కనీసం 1 శాతం నిధులను ఒక నిధిగా ఏర్పాటుచేసి రాష్ట్రాలకు అందచేయాలని సూచించారు. శిక్షణారంగంలో పనిచేస్తున్న వివిధ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలు, ఇతర శిక్షణాసంస్థలు, ప్రైవేటు భాగస్వామ్యులతో ఒక నెట్‌వర్కును ఏర్పాటు చేయాలని సూచించారు. పెద్దసంఖ్యలో ఉన్న ప్రజాప్రతినిధులకు శిక్షణ అందచేయటానికి గాను కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, గుజరాత్, పశ్చిమబెంగాల్ తరహాలో శాటిలైట్ ఆధారిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించటానికి మిగిలిన రాష్ట్రాలు కూడా చొరవ చూపాలని పలువురు సూచించారు.

ఈ సందర్భంగా అపార్డ్ రూపొందించిన పలు పుస్తకాలను, కంప్యూటర్ ఆధారిత ట్యుటోరియల్సును, డాక్యుమెంటరీ ఫిల్ములను విడుదల చేయటం జరిగింది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పాటించవలసిన ప్రామాణిక పద్ధతులపై రూపొందించిన పుస్తకాన్ని, పాండురంగాపురం గ్రామపంచాయతీ పై డాక్యుమెంటరీ ఫిల్మును శ్రీ బి.కె. సిన్హా విడుదల చేసారు. పంచాయతీ సెక్రటరీ శిక్షణకు ఉద్దేశించిన కంప్యూటర్ ఆధారిత ట్యుటోరియల్సును శ్రీ సుధీర్ కృష్ణ విడుదల చేసారు. గ్రామసభపై రూపొందించిన కంప్యూటర్ ఆధారిత ట్యుటోరియల్సును శ్రీ గంగవార్ విడుదల చేసారు. శ్రీ మాథ్యూ సి. కున్నమ్‌కల్, ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్ పుస్తకాన్ని, సమీకృత జిల్లా ప్రణాళికా రూపకల్పన పై రూపొందించిన కంప్యూటర్ ఆధారిత ట్యుటోరియల్స్‌ను విడుదల చేయగా, శ్రీ ఆదిత్య ప్రకాష్ భూసంబంధ చట్టాలపై రూపొందించిన పుస్తకాన్ని విడుదల చేసారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఎన్.ఐ.వఆర్.డి. ఆంగ్లంలో రూపొందించిన తరచుగా అడిగే ప్రశ్నలు (ఎఫ్.ఎ.క్యూ) పుస్తకానికి తెలుగు అనువాద ప్రతిని శ్రీ ఎం.వి.రావు విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శులు, అన్ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల డైరక్టర్లు పాల్గొన్నారు.

కంట్రిబ్యూషన్: **డా॥ వి. శివశంకరప్రసాద్, అపార్డ్**

**బోధన ప్రణాళిక** (Fixed Point Chart)

**గ్రామ వికాసం - దూర విద్యా బోధన** మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్ -3 (06-05-2010 నుండి 27-05-2010)

| తేది/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 06-05-2010 | గ్రామ పంచాయితీ వార్డుమెంబర్లు | 11.00-11.20 | సాక్షర భారత్ |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | గ్రామ పంచాయితీ నిధులు |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 12.20- 12.40 | నిర్మల్ గ్రామ్ పురస్కార్ |
| | | 12.40-01.00 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 1.00-1.20 | గృహ హింస చట్టం |
| | | 1.20-1.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 3.00-4.30 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 13-05-2010 | సూపరింటెండెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్, జిల్లా పరిషత్ మరియు మండల పరిషత్ ప్రిస్టలు | 11.00-12.15 | ఋణాలు & అడ్వాన్సులు |
| | | 12.15-1.20 | సత్వర ఉన్నతి పథకం |
| | | 2.00-4.00 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 20-05-2010 | | 11.00-12.15 | జి.పి.ఎఫ్. రూల్స్ |
| | | 12.15-1.20 | సవరించిన వేతన శ్రేణులు - 2009 |
| | | 2.00-4.00 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 27-05-2010 | | 11.00-12.15 | పెన్షన్ రూల్స్ |
| | | 12.15-1.20 | పెన్షన్ పేపర్లు తయారు చేసే విధానం |
| | | 2.00-4.00 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |



SthanikaPalanaTel_May_2010_Colour.pmd 16 4/29/2010, 5:49 PM

మానవుని జీవితంలో వివాహం ఒక ముఖ్యమైన సంఘటన. ఇటువంటి సంఘటనలను రిజిస్ట్రేషను చేయించుకోవటం తప్పనిసరి. వివాహం చేసుకోబోయే వధూవరులు, వారి తల్లిదండ్రులు వివాహాన్ని రిజిస్ట్రేషను చేయించటంలో బాధ్యత కల్గియున్నారు. 'వివాహాధికారి' వద్ద వివాహాన్ని రిజిస్ట్రరు చేయించుకుంటే ఆ వివాహానికి చట్టబద్ధత ఏర్పడుతుంది. కాబట్టి ఇందుకొరకు ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ వివాహాల నిర్బంధ రిజిస్ట్రేషను చట్టం 2002" ను తీసుకొనివచ్చింది. ఈ చట్టం తేది: 25-10-2002 నుండి అమలులోనికి వచ్చింది.



# వివాహాల నమోదుతో అనేక ప్రయోజనాలు

ఈ చట్టాననుసరించి నిర్బంధ వివాహాల రిజిస్ట్రీకరణ నియమాలు, జి.ఒ.యం.యస్. నెం.35 మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, వికలాంగుల సంక్షేమం (ప్రోగ్రామ్స్) శాఖ తేది, 2-09-2003 ద్వారా అమలులోనికి వచ్చాయి. ఇది ముఖ్యమైన అంశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాబట్టే, తగు నియమాల ద్వారా స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులను, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పోరేషన్‌లలో పనిచేసే మున్సిపల్ కమీషనర్లను వివాహాధికారులుగా నియమించడం జరిగింది. ఈ అధికారులు వారి అధికారిక పరిధిలోని స్థానిక ప్రాంతానికి వివాహాధికారిక వ్యవహరిస్తారు. ఈ వివాహాధికారి అధికారిత పరిధి ఆ ప్రాంతంలో జననమరణాల రిజిస్ట్రరు చేసే స్థానిక సంస్థ అధికారిక పరిధితో సమానంగా ఉండాలి.

వివాహ రిజిస్ట్రేషను ఆవశ్యకతను గూర్చి, నిర్బంధ వివాహాల రిజిస్ట్రేషను చట్టాన్ని గూర్చి ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత స్థానిక సంస్థలకు నియమితులైన వివాహాధికారులపై ఉంది. వివాహాధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అక్కడ పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాల గ్రూపు లీడర్లు, సభ్యులు, గ్రామ, మండల సమాఖ్యలు, విద్యావంతులు, మేధావుల సహాయ సహకారాలు తీసికొని వివాహ రిజిస్ట్రేషన్ల ప్రాధాన్యతను వధూవరులుకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయవలసిన అవసరం ఉంది. ఇందుకు ఆయాప్రాంతాలలో ఉన్న ప్రచారసాధనాలను ఉపయోగించుకోవలసి ఉంటుంది.

### వివాహాలను నమోదు చేయించుకోవటం వలన కలిగే ప్రయోజనాలు

- రిజిస్ట్రేషన్ చేయించుకున్న వివాహాలకు చట్ట బద్ధత ఏర్పడుతుంది.
- భార్యాభర్తల మధ్య సమస్యలు తలెత్తినప్పుడు కోర్టు ద్వారా పరిష్కరించుకోవచ్చు.
- భర్త ద్వారా భార్య, పిల్లలకు, ఆస్థి విషయంలో అన్యాయం జరిగినప్పుడు కోర్టును ఆశ్రయించటానికి వివాహాల రిజిస్ట్రేషన్ అవసరం.
- విదేశాలకు వెళ్ళటానికి, వీసాలు పొందటానికి వివాహ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి.
- స్త్రీలు భర్త నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురియైనపుడు నెల నెలా భర్త చెల్లించే మొత్తాన్ని (మనువర్తి లేదా భరణం) న్యాయపరంగా పొందటానికి వివాహాల రిజిస్ట్రేషన్ అవసరమవుతుంది.
- వివాహ సంబంధిత తగాదాల (వివాహ నిబద్ధత, విడాకులు, దాంపత్య హక్కులు, పిల్లల సంరక్షణా బాధ్యత, భార్య భర్తల మధ్య ఆస్తి గొడవలు) ను న్యాయపరంగా పరిష్కరించుకొనటానికి వివాహాల రిజిస్ట్రేషన్ అత్యంత అవసరం.

### వివాహాలను రిజిస్ట్రేషను చేసుకోవడం ఎలా?

- వివాహానికి సంబంధించిన వారు అనగా వధువు లేక వరుడు లేదా వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకుడు వివాహం జరిగిన తేదీ నుండి 30 రోజుల లోపల వివాహపు యదార్థ విషయాన్ని నమూనా 'బి' నందు పూరించి రిజిస్ట్రేషను చేయటానికి వివాహాధికారికి తెలియపరచాలి.

★ నమూనా 'బి' ను వివాహాధికారి నుండి ఉచితంగా పొందవచ్చు.

★ నమూనా 'బి' లలో ఉన్న వివాహ మెమోరాండం పైన వధువు, వరుడు సంతకం చేయాలి. వధువు తరపున ఇద్దరు, వరుడు తరపున ఇద్దరు సాక్షులు సంతకం చేయాలి. ఫారం 'బి', దాని డూప్లికేటుపై వధూవరుల పాస్‌పోర్టు సైజు ఫొటోగాని లేదా వివాహ ఫొటోగాని అంటించాలి.

★ వివాహాధికారి సమక్షంలో వివాహ రిజిస్ట్రరులో వధూవరులిద్దరూ, వారిలో ప్రతి ఒక్కరి తరుపున ఇద్దరు సాక్షులు సంతకం చేయాలి.

★ వివాహ మెమోరాండంలో (నమూనా 'బి' లో) ఏమైనా దిద్దుబాట్లు ఉన్నట్లయితే ప్రతి దిద్దుబాటు వద్ద వధూవరులిద్దరు వివాహాధికారి ఎదుట ధృవీకరణ సంతకం చేయాలి.

★ వివాహపు యదార్థతను తెలియజేసే మెమోరాండాన్ని వివాహం జరిగిన 30 రోజుల లోపుల మాత్రమే వివాహాధికారికి అందజేయాలి. నిర్దిష్టపరచబడిన 30 రోజులు ముగిసిన పిదప 60 దినాల కాలవ్యవధి లోపు రూ. 100 ల ఫీజుతో మెమోరాండం అందజేయవచ్చు.

★ వివాహ యదార్థతను వివాహాధికారి రిజిస్ట్రరు చేసిన వెంటనే నమూనా 'సి' లో వివాహ ధృవపత్రాన్ని వివాహాధికారి వద్ద ఉచితంగా పొందవచ్చు.

★ వివాహ రిజిస్ట్రరు నుండి లేదా ఇతర రికార్డుల నుండి ధృవీకృత ప్రతులను పొందవలసిన సందర్భంలో ప్రతి దరఖాస్తుపైన రూ. 10 లు రుసుం చెల్లించి పేజి ఒక్కింటికి రూ. 2 లు చొప్పున వివాహాధికారి కి చెల్లించి ధృవీకృత ప్రతులను పొందవచ్చు.

## వివాహాధికారి విధులు, బాధ్యతలు

★ నియమించబడిన ప్రతి వివాహాధికారి స్థానిక ప్రాంతంలో తన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

★ 'వివాహాల జిల్లా రిజిస్ట్రారు' ఆదేశించినట్టి దినాలలో, నిర్ణీత వేళలలో తన కార్యాలయానికి హాజరుకావాలి.

★ వివాహాధికారి తన కార్యాలయంలో అందరికీ స్పష్టంగా కన్పించే స్థలంలో లేదా వెలుపలి ద్వారానికి సమీపాన తెలుగు, ఇంగ్లీషు/ స్థానిక భాషలో వివాహాధికారిపేరు, వివాహాధికారి స్థానిక ప్రాంతం పేరు, వివాహాధికారి హోదా, వివాహాధికారి కార్యాలయానికి హాజరయ్యే దినాలు, వేళలను సూచించే బోర్డులను ప్రదర్శించాలి.





★ వివాహాధికారి అందుకొన్న మెమోరాండంతో బాటు డూప్లికేటు మెమోరాండం లేనప్పుడు, లేదా మెమోరాండం లోపభూయిష్టంగా ఉన్నప్పుడు, నిర్ణీత కాలవ్యవధి లోపల లోపాలను సరిదిద్దుకొమ్మని వధూవరులను కోరవచ్చు.

★ వివాహాధికారి నమూనా 'ఎ' లో ఉన్న వివరాలతో వివాహాల రిజిస్ట్రరును నిర్వహించాలి.

★ వివాహాధికారి అందుకున్న ప్రతి ఖాళీ రిజిస్ట్రరు టైటిల్ పేజిపై ఆ రిజిస్టరులో ఉన్న పేజీల సంఖ్యను అది తనకు అందిన తేది, దానిని ప్రారంభించిన తేదీని పేర్కొనాలి.

★ వివాహాధికారికి వివాహాల మెమోరాండం (ఫారం-బి) అందగానే ఆ మెమోరాండంపై వరుస సంఖ్యను, అది అందిన తేదీని వ్రాయాలి.

★ వివాహాధికారులు తాము నిర్వహించిన వివాహ రిజిస్ట్రర్లు అన్నింటిని శాశ్వతంగా భద్రపరచాలి.

★ వివాహాధికారి గత నెలలో తాను రిజిస్ట్రరు చేసిన వివాహాలకు సంబంధించిన వివరాలను మరుసటి నెలలోపు గాని, అంతకుముందుగాని, వివాహ మెమోరాండాన్ని డూప్లికేటు ప్రతులతోబాటు నెలవారీ రిటర్న్‌లను 'వివాహాల జిల్లా రిజిస్ట్రారుకు' ఫారం 'డి' నందు పంపించాలి.

★ వివాహాధికారులు తన అధికార ప్రాంతానికి సంబంధించిన అన్ని ప్రదేశాల (గ్రామాలు) లో 'వివాహ నిర్బంధ రిజిస్ట్రేషను చట్టం' దాని ఆవశ్యకతను గూర్చి విస్తృత ప్రచారం గావించాలి.

★ వివాహాధికారులు వారి స్థానిక ప్రాంతంలో వున్న కళ్యాణమండపాలు, దేవాలయాలు, చర్చీలు, మసీదులు, వివాహం జరిగే ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో వివాహ నిర్బంధ రిజిస్ట్రేషను చట్టాన్ని గూర్చి అచ్చట వివాహం చేసుకొనబోయేవారికి తెలియజేసే విధంగా చర్యలు చేపట్టాలి.

## వివాహాల రిజిస్ట్రేషను ఉత్తర్వులపైన అభ్యంతరం ఉంటే అప్పీలు ఎవ్వరికి చేసుకోవచ్చు?

- ★ వివాహాధికారి ఉత్తర్వు వలన ఎవరైనా వ్యక్తికి అభ్యంతరాలు ఉన్నచో అట్టి వ్యక్తి అట్టి ఉత్తర్వు అందిన తేదీ నుండి ముప్పై దినాలలోగా జిల్లా రిజిస్ట్రారుకు అప్పీలు చేసుకోవచ్చు.
- ★ జిల్లా రిజిస్ట్రారు ఉత్తర్వు వలన ఎవరైనా వ్యక్తికి అభ్యంతరాలు ఉన్నచో అట్టి వ్యక్తి అట్టి ఉత్తర్వులు అందిన తేది నుండి 30 రోజులు లోపల రిజిస్ట్రార్ జనరల్‌కు రివిజను దరఖాస్తు చేసుకోవచ్చు.

## శాసనం ప్రకారం వివాహాలు చేయటానికి లేదా లైసెన్సు పొందిన వ్యక్తులు పాటించవలసిన నిబంధనలు

- ★ హిందూ వివాహ చట్టం 1955, ప్రత్యేక వివాహాల చట్టం 1872, పార్సీ వివాహాల చట్టం క్రింద క్రైస్తవ మత గురువులు లేదా ఖాజీలు లేదా పార్సీ మత గురువులు చేసిన వివాహాలను వారే రిజిస్ట్రరు చేసి సంబంధించిన రికార్డును వారే నిర్వహించాలి.
- ★ వివాహాలు ఏ పద్ధతిలో జరిగినప్పటికినీ సంబంధిత అధికారి, మతగురువు, ఖాజీ లేదా లైసెన్సు పొందిన వ్యక్తులు వివాహానికి సంబంధించిన పార్టీలకు జారీ చేసిన వివాహపు ధృవపత్రం ప్రతిని నిర్ణీత గడువు లోపల స్థానిక ప్రాంతంలో నియమితులైన వివాహ రిజిస్ట్రేషను అధికారికి అందజేయాలి.
- ★ మతగురువులు, ఖాజీ లేదా లైసెన్సు పొందిన వ్యక్తులు గడిచిన నెలలో వారు రిజిస్ట్రరు చేసిన వివాహాల వివరాలను తరువాత నెల 30 వ తేదీనగాని, అంతకుముందుగాని వివాహ నిర్బంధ రిజిస్ట్రేషను చట్టము 2002 క్రింద నియమితులైన ఆ ప్రాంతపు వివాహాధికారికి పంపించాలి.

## "ఆంధ్రప్రదేశ్ వివాహాల నిర్బంధ రిజిస్ట్రీకరణ చట్టం 2002" లోని ఉన్న నిబంధనలు ఉల్లంఘించినందుకు అపరాధాలు

- ★ వివాహాలను ఉద్దేశ్య పూర్వకంగా రిజిస్ట్రరు చేయించని యెడల లేక రిజిస్టరు చేయించటానికి ఉపేక్షించిన యెడల అటువంటివారిని ఒక వెయ్యి రూపాయలు జరిమానాతో శిక్షిస్తారు.
- ★ ఏమైనా ముఖ్యమైన వివరాలకు సంబంధించి మెమోరాండంలో తప్పుడు ప్రకటన చేసినచో ఒక సంవత్సరం వరకు వుండగల కారాగారవాసంతో, లేక ఒక వెయ్యి రూపాయిల వరకు ఉండగల జరిమానాతో లేక రెండింటితో శిక్షిస్తారు.
- ★ వివాహాలు రిజిస్ట్రరు చేయటంలో వైఫల్యం చెందిన ఎవరైనా వివాహాధికారికి మూడు మాసాల వరకు వుండగల కారాగారవాసంతో లేక రూ.500 వరకు ఉండగల జరిమానాతో లేక రెండింటితో శిక్షిస్తారు.

## వివాహ రిజిస్టర్ల నిర్వహణ

- ★ నిబంధనలకు అనుగుణంగా వివాహాల రిజిస్ట్రేషను రిజిస్టర్లను వివాహాధికారి తన కార్యాలయంలో తన స్వాధీనంలో ఉంచుకోవాలి.
- ★ వధూవరులకు సంబంధించిన వివరాలు వివాహాధికారే తన చేతితో వ్రాయాలి. అతని సమక్షంలోనే వధువు, వరుడు, వధువుకు సంబంధించిన ఇద్దరు సాక్షులు, వరునికి సంబంధించిన ఇద్దరు సాక్షులు సంతకాలను రిజిస్టరు చేయించాలి.



- ★ పై నిబంధనలు హిందూ వివాహచట్టం, ముస్లిం, క్రైస్తవ మతగురువుల సమక్షంలో (శాసనం ద్వారా లైసెన్సు పొందిన వ్యక్తులు) నిర్వహించే వివాహాలకు వర్తించదు.
- ★ శాసనం ద్వారా లైసెన్సు పొందిన వ్యక్తులు నిర్వహించే వివాహాల సర్టిఫికెట్లను ఒక ప్రత్యేక రిజిస్ట్రరులో వివాహాధికారి నమోదు చేసుకోవాలి.
- ★ ముందు నెలలో జరిగిన వివాహాల జాబితాను తదుపరి నెల 30వ తేదీలోపల లైసన్సు పొందిన పై వ్యక్తులు వివాహ సర్టిఫికెట్‌ల నకళ్ళతో సహా స్థానిక వివాహాధికారికి అందజేసిన వివరాలు వివాహాధికారి ప్రత్యేక రిజిస్టరులో నమోదుచేసి భద్రపరచాలి.
- ★ వివాహ రిజిస్ట్రర్లు ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో ఉండాలి.
- ★ త్రైమాసిక నివేదికలు, వార్షిక నివేదికలు సకాలంలో జిల్లా రిజిస్ట్రారు కార్యాలయానికి వివాహధికారికి పంపించాలి. అట్లు పంపబడిన వార్షిక నివేదికలు తన కార్యాలయంలో భద్రపరచాలి.

స్థానిక ప్రభుత్వాలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమీషనర్లను వివాహాధికారులుగా ప్రభుత్వం నియమించింది. కాబట్టి స్థానిక సంస్థలు ఈ **'వివాహ నిర్బంధ రిజిస్ట్రేషన్ చట్టం',** సంబంధిత నియమ నిబంధనల ప్రకారం వివాహాలు రిజిస్ట్రేషన్ చేయించుకొంటే కలిగే ప్రయోజనాలను గూర్చి విస్తృతంగా ప్రచారం చేయవలసిన అవసరం ఉంది. వివాహాన్ని రిజిస్ట్రేషను చేయించుకొంటేనే ఆ వివాహానికి చట్టబద్ధత ఏర్పడుతుంది. కాబట్టి ఇందువలన స్థానిక సంస్థలలో ఉన్న అందరు ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా తమ వంతు కృషి చేసి వివాహ రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరగటానికి తోడ్పడాలి.

ఈ వివాహ రిజిస్ట్రేషను పద్ధతిని, విధివిధానాలను, రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే ఏర్పడే ఇబ్బందులను గూర్చి ఆ స్థానిక ప్రాంత పరిధిలోని ప్రజలందరికీ తెలియజేయాలి. ముఖ్యంగా వివాహం చేసుకోబోయే వధూవరులకు ఈ చట్టాన్ని గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించటానికి స్థానిక సంస్థలలో పనిచేసే అందరు ప్రభుత్వ ఉద్యోగులు ఈ కార్యసాధనకు సమాయత్తం కావాలి.

*డా॥ పి.వి. శేషారెడ్డి. యం.ఎ.,యం.ఫిల్.,పి. హెచ్‌డి.,*
*డివిజనల్ పంచాయతీ అధికారి, చిత్తూరు*



**గాంధీజి కలలుకన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా ప్రభుత్వం ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపట్టి స్వపరిపాలన ఆవశ్యకతను అద్దంలా చూపిస్తూ, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పాత్రను విశేషంగా ప్రోత్సహిస్తుంది. అందులో భాగంగా అపార్డ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో చేపడుతున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శిక్షణోద్యమం వీరి సామర్థ్యాల పెంపునకు మరింత దోహదం చేస్తుంది. అపార్డు సంస్థ అందిస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాలను 'సింహపురి' జిల్లా సర్పంచ్‌లు, యం.పి.టి.సిలు, వార్డు మెంబర్లు సద్వినియోగం చేసుకుంటూ శిక్షణలను విజయవంతం చేయుటవే కాకుండా ప్రతి శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ తమ తమ గ్రామాల అభివృద్ధికి నడుం బిగిస్తూ జిల్లా స్థాయిలో ప్రజా ప్రతినిధులంతా శిక్షణలు విజయవంతం చేస్తున్నారు.**

కార్యక్రమం నిర్వహించారు. 12 టీములుగా టి.ఓ.టీ.లను ఎంపిక చేసి, ప్రతి టీమ్‌కు ముగ్గురు ట్రైనర్‌ల ద్వారా ప్రతిమండల కేంద్రంలో విజయవంతంగా నిర్వహించిన శిక్షణలో ప్రజా ప్రతినిధులు తమ తమ అనుమానాలను నివృత్తి చేసుకొని ఆ దిశగా తాము కృషి చేస్తామని, గంగదేవుల పల్లి, హివ్రే బజార్ (మహారాష్ట్ర) లాంటి గ్రామాలను పరిశీలించిన మన టి.వి. ద్వారా తెలుసుకున్న వివరాలతో నెల్లూరు జిల్లా సర్పంచ్‌లు తమ జిల్లాలో అటువంటి గ్రామాలను తయారుచేయాలనే నిశ్చయంతో ఇక్కడ జరుగుతున్న శిక్షణల విజయవంతానికి కృషి చేస్తున్నారు. ఈ శిక్షణల అనంతరం గ్రామసభలు జరిపేందుకు సర్పంచ్‌లు ఆసక్తి కనబరుస్తూ, స్థానిక ఎం.పి.టి.సి.లు, వార్డు మెంబర్లతో కలసి సర్పంచ్‌లు గ్రామసభల ద్వారా గ్రామ కమిటీల ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు సాగుతాయని, ఈ స్ఫూర్తిని కొనసాగిస్తామనే అభిప్రాయానికి వచ్చారు.

# స్థానిక స్వపరిపాలనకు శిక్షణతో నడుంబిగిస్తున్న సింహపురి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన సారా వ్యతిరేక ఉద్యమాన్ని నెల్లూరు జిల్లా మహిళలు నడుం బిగించి నడిపిన స్ఫూర్తితో, నేడు ఆదర్శ గ్రామాలను తయారు చేయటానికి సర్పంచ్‌లు, ఎం.పి.టి.సి.లు, వార్డు మెంబర్లు జిల్లాలో శిక్షణల ద్వారా అభివృద్ధికి బాటలు ఏర్పాటు చేసుకుంటూ, ఆ దిశగా అడుగులు సాగిస్తున్నారు. ప్రతి గురువారం జరిగే 'మన టి.వి.' శిక్షణలో నేర్చుకుంటున్న అభివృద్ధి సూత్రాలు, ప్రణాళికలే కాకుండా, 2010, మార్చి 8 నుండి అపార్డ్ చేపట్టిన 2వ విడత సర్పంచ్‌లు, యం.పి.టి.సిలకు టి.ఓ.టీ. ల ద్వారా నిర్వహించిన శిక్షణకు స్థానికంగా విశేష స్పందన, ప్రభావం, ప్రోత్సాహం కనిపించింది.

నెల్లూరు జిల్లాలో వేసవిని సైతం లెక్క చేయకుండా ప్రజా ప్రతినిధులు ఈ శిక్షణలో సామర్థ్యాలను పెంపొందించుకోవటం విశేషం. జిల్లాను 3 డివిజన్‌లుగా విభజించి 46 మండలాల్లోని 961 మంది సర్పంచ్‌లు, 559 మంది యం.పి.టి.సి, లకు మార్చి 2010, 8 నుంచి 22 వరకు శిక్షణా

శిక్షణలో ముఖ్యంగా గ్రామసభ నిర్వహణ, గ్రామ పంచాయితీ నిధులు, వ్యయాలు, పనుల గుర్తింపు, గ్రామ కమిటీల ఎంపిక, వాటి నిర్వహణ, నాయకత్వం, మంచి నాయకుడి విధులు, మౌలిక వనరుల అభివృద్ధికి, గ్రామ వనరులు ప్రకృతి వనరుల కల్పన వంటి అంశాలు, మహిళల సమస్యలు, వారి నాయికత్వం ఆవశ్యకత వంటి అంశాలు ఈ శిక్షణలో విశేషంగా ఆకర్షించాయి

ఈ 2వ విడత శిక్షణా కార్యక్రమంలో జిల్లాలోని 961 మంది సర్పంచ్‌లకు గాను 774 మంది హాజరు కాగా, 81 శాతం విజయవంతం చేశారు. అలాగే జిల్లాలోని 559 మంది యం.పి.టి.సిలకు గాను. 409 మంది (63%) హాజరయ్యారు. ఇందులో 109 మంది ఎస్.సి.లు, 40 మంది ఎస్.టి.లు, 157 మంది బి.సి.లు, 103 మంది (ఇతరులు) హాజరు కాగా, ఇందులో మహిళలు 158 మంది, పురుషులు 251 మంది ఈ

కార్యక్రమంలో శిక్షణ పొందారు. మొత్తం మీద జిల్లాలో 81 శాతంగా కార్యక్రమం నిర్వహించటం వెనుక ప్రభుత్వ అధికారుల కృషి ఉంది.




### అధికారుల ప్రోత్సాహం, కృషి

జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. ఆధ్వర్యంలో జిల్లా ట్రైనింగ్ సెల్ నిర్వహణలో, ఇద్దరు డి. ఆర్.పి.ల పర్యవేక్షణలో జరిగే ఈ ప్రజా ప్రతినిధుల శిక్షణా కార్యక్రమానికి మండలస్థాయిలో మండల అభివృద్ధి అధికారుల పాత్ర ప్రశంసనీయం, ఈ శిక్షణా కార్యక్రమాల్ని ఎం.పి.డి.వో.ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జరిగే శిక్షణకు ముందుగా, ఇ.ఓ.పి. ఆర్.డి. సుపరింటెండెంట్, సమన్వయంతో అందరు గ్రామకార్యదర్శులకు శిక్షణ వివరాలను తెలుపుతూ సమావేశం నిర్వహించడం, శిక్షణకు 3 రోజులు ముందుగా ఆహ్వానం ద్వారా, ఫోన్ల ద్వారా సంబంధిత ప్రజా ప్రతినిధులకు కార్యదర్శుల ద్వారా సమాచారం పంపించటం దగ్గరుండి కార్యక్రమాన్ని ప్రారంభం, ముగింపులను నిర్వహించే అన్ని ఏర్పాట్లలో ఎం.పి.డి.వో. ల కృషి ప్రోత్సాహకరం. నెల్లూరు జిల్లా ఎం.పి.డి.వో. ఈ శిక్షణలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో మండల స్థాయిలో విజయవంతం అవుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

జిల్లాలో ఇటీవల 36 మంది సర్పంచ్‌లను మహారాష్ట్రలోని అహమ్మద్ నగర్ జిల్లా హివ్రే బజార్ స్టడీటూర్‌కు హాజరు కావటంతో సర్పంచుల్లో నూతన ఉత్తేజం కలిగించి ఈ ఉత్తేజం, ఉత్సాహంగా, శిక్షణలపై ఆసక్తిని కలిగించి 2వ విడత శిక్షణలకు టూర్ వెళ్ళి వచ్చిన సర్పంచ్‌లు ముందు నుండి విజయవంతం చేయటం విశేషం. ఈ స్టడీటూర్ ద్వారా దర్శనీయ ప్రదేశాలు, చారిత్రిక ప్రదేశాలు, ఆదర్శ గ్రామాల సందర్శన వీరిలో క్రొత్త అనుభూతులను కలిగించడమే కాకుండా, క్రొత్త పోకడలకు. క్రొత్తదనానికి శ్రీకారం చుట్టేలా ప్రొత్సహించినట్లు సర్పంచ్‌ల అభిప్రాయపడుతున్నారు.

అలాగే, జిల్లాలోని 18 మంది మండలాధ్యక్షులను. కర్నాటక స్టడీటూర్ తీసుకెళ్ళటంతో వీరు, గ్రామ సర్పంచ్‌లు, యం.పి.టి.సి.లు, వార్డు మెంబర్ల శిక్షణలకు మండల స్థాయిలో ప్రాధాన్యతనివ్వటం, దగ్గరుండి నిర్వహణలో ఏర్పాట్లను పరిశీలించటం, హాజరు శాతాన్ని పెంచే ఏర్పాట్లను పరిశీలించటం, అధికారుల ద్వారా సమీక్షలు జరపటం వంటి ప్రోత్సాహకాలు అందించటం హర్షదాయకంగా చెప్పవచ్చు. ఈ స్టడీటూర్ 2వ విడతకు నెల్లూరు జిల్లాలో సర్పంచ్‌ల నుంచి విశేష స్పందన, ఒత్తిడి రావటం విశేషం. ఏప్రిల్ 6 నుండి 11 వరకు సర్పంచ్‌ల మహారాష్ట్ర హివ్రే బజారు స్టడీటూర్‌కి 46 మండలాల నుండి ఎక్కువ స్థాయిలో పేర్లు నమోదు కావటం, శిక్షణల ప్రాధాన్యతను చూపిస్తుంది.

అంతేగాకుండా గ్రామస్థాయిలో స్థానిక పాలన పుస్తకాలు సర్పంచ్‌ల, వార్డు మెంబర్లును విశేషంగా ఆకర్షిస్తున్నాయి. 'స్థానిక పాలన' లోని వారి అధికారాల వినియోగంపై శిక్షణలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్న సర్పంచ్‌లు వార్డు సభ్యులు గ్రామసభలకు ప్రాధాన్యత నివ్వటం జిల్లాలో ప్రత్యేకత సంతరించుకుంది.

జిల్లా స్థాయిలో ట్రైనింగ్‌సెల్ నిర్వహణలో అధికారుల సమన్వయంతో జరిగే ఈ కార్యక్రమం రీజనల్ స్థాయిలో ఇ.టి.సి. బాపట్ల ప్రిన్సిపాల్, ఫ్యాకల్టి రాష్ట్రస్థాయిలో అపార్డ్ వారు నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శిక్షణా కార్యక్రమం, అధికార్ల శిక్షణా కార్యక్రమాలకు జిల్లాలో పూర్తి స్థాయిలో హాజరు కావటం, ఈ శిక్షణల ప్రభావంతో మండల స్థాయి, గ్రామ స్థాయి అభివృద్ధి పనులకు సమైక్యంగా ప్రణాళిక బద్ధంగా జరిగే అభివృద్ధికి నెల్లూరు జిల్లా దోహదకారిగా మారనుంది. నేడు జిల్లాలోని 46 మండలాల్లో శిక్షణలు అంటే, ట్రైనింగ్ సెల్, ఇ.టి.సి. బాపట్ల, అపార్డ్ సంస్థలనే, నానుడి అందరికీ, నినాదంగా మారింది.




మొత్తం మీద స్థానిక సంస్థల బలోపేతానికి జరుగుతున్న కృషిలో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాల్లో విజయవంతంగా నిర్వహించటం, దాని ప్రాముఖ్యతను గుర్తించటం పట్ల జరుగుతున్న పరిణామాలు హర్షణీయంగా ఉన్నాయి.

**– ఎ.వై. శివ.** *డి.ఆర్.పి., నెల్లూరు*

# వేసవి కాలపు టెన్నిస్ సంరంభం

**క్రీడా ప్రియులకు, ప్రత్యేకించి టెన్నిస్ క్రీడాభిమానులకు రాబోయే నెలలు మంచి కనువిందు నందించనున్నాయి. ఫ్రెంచి ఓపెన్, వింబుల్డన్ టోర్నమెంట్‌లు త్వరలో జరగబోతున్నాయి. ఈ సందర్భంగా ఫ్రెంచి ఓపెన్, వింబుల్డన్ టోర్నమెంట్‌లకు సంబంధించిన చరిత్ర, ఇతర ఆసక్తికరమైన విషయాలను తెలుసుకుందాం.**

టెన్నిస్ క్రీడ విషయానికి వస్తే, ప్రతి ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యుఎస్ ఓపెన్ అనే నాలుగు రకాల పోటీలు ఇదే వరసలో జరుగుతుంటాయి. వీటిని గ్రాండ్ శ్లామ్' ఈవెంట్లుగా వ్యవహరిస్తారు. వీటిలో వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకమైనవిగా భావిస్తారు. వీటిని తిలకించే ప్రేక్షకుల సంఖ్య కూడా చాలా ఎక్కువ.

మే 24 తేదీన పారిస్‌లోని రోలండ్ గారస్ స్టేడియమ్‌లో ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభమవుతుంది. దీనికి 120 సంవత్సరాల చరిత్ర ఉంది. 1891లో ఇది ఒక జాతీయ స్థాయి టోర్నమెంట్‌గా ప్రారంభమైంది. తొలుత దేశీయ క్లబ్‌లకే దీనిని పరిమితం చేశారు. తరువాత మహిళా క్రీడాకారులకు కూడా ఇందులో పాల్గొనే అవకాశం కల్పించారు. 1925 లో ఈ పోటీలకు అంతర్జాతీయ స్థాయి వచ్చింది. ఇతర దేశాలకు చెందిన క్రీడాకారులకు కూడా ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు.

ఆమెరికా నేలపై 1927లో జరిగిన డేవిస్ కప్ పోటీల్లో అమెరికాను ఓడించి ఫ్రాన్స్ డేవిస్ కప్‌ను గెలుచుకోవటంతో టెన్నిస్ క్రీడ చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ అద్భుత విజయం ఫ్రాన్స్‌కి మంచి పేరు తెచ్చింది. ఈ అద్భుత విజయాన్ని ఫ్రాన్స్‌కి అందించిన వారు జీన్ బరోట్రా, రెన్ లాకోస్ట్, హెన్రీ కోచట్. వీరిని "ముగ్గురు సైనిక యోధులు" గా అభివర్ణిస్తారు.

తదుపరి సంవత్సరంలో జరిగిన డేవిస్ కప్ పోటీల్లో తన కప్‌ను కాపాడుకోవాలని ఫ్రాన్స్ కృతనిశ్చయంలో ఆడింది. ఈ పోటీలు సరికొత్త స్టేడియంలో జరిగాయి. మొదటి ప్రపంచ యుద్ధ యోధుడయిన రోలండ్ గారస్ పేరును ఈ స్టేడియంకి పెట్టారు. 1928 నుంచి ఈ స్టేడియమే పోటీలకు వేదికగా నిలుస్తోంది. 1968 వరకు గ్రాండ్ శ్లామ్ టోర్నమెంట్లను వర్ధమాన క్రీడాకారులకే పరిమితం చేశారు.




SthanikaPalanaTel_May_2010_Colour.pmd 3 4/29/2010, 5:49 PM

ఆ సంవత్సరం వృత్తిపరమైన నిపుణులకు, క్రీడా కారులకు ఫ్రెంచ్ ఓపెన్ అవకాశం ఇచ్చి, పోటీల్లో పాల్గొనేలా చేసింది.

ఇదివరకటి తరం టెన్నిస్ క్రీడాకారులు కళాత్మకతను, ప్రత్యేకమైన శైలిని సొంతం చేసుకోగా, నేటి క్రీడాకారులు వేగాన్ని, శక్తిని అందుకోగలిగారు. 'సర్వ్ అండ్ వాలీ' పద్ధతిలో బుల్లెట్‌లా దూసుకుని పోయే నేటి క్రీడాకారులకు నెమ్మదిగా కదలికను అందించే మట్టితో కూడిన ఉపరితలం ఒక సవాలుగానే ఉంటున్నది. అందువల్లనే ఇతర గ్రాండ్‌శ్లామ్ టోర్నమెంట్లలో టైటిల్స్ గెలిచిన అనేకమంది చాంపియన్లు ఇక్కడ గెలవలేరు. ఇటువంటి వారిలో పీట్ సంప్రాస్, జాన్ మెకన్రో, బోరిస్ బెకర్, వీనస్ విలియమ్స్ వంటివారు అనేకులున్నారు. వీరిలో పీట్ సంప్రాస్ రికార్డు స్థాయిలో 14 గ్రాండ్ శ్లామ్ సింగిల్స్ టైటిళ్లను అనేక సంవత్సరాల పాటు స్వంతం చేసుకున్నారు. అదే విధంగా జాన్ మెకన్రో, బోరిస్ బెకర్, వీనస్ విలియమ్స్ వంటివారున్నారు. రోజర్ ఫెదరర్ మొత్తం 16 గ్రాండ్ శ్లామ్ టైటిల్స్ సాధించి ఆల్ టైమ్ రికార్డు సాధించారు. ఆయన కూడా ఈ స్టేడియంలో అనేకసార్లు విఫలమైనప్పటికీ, చివరికి 2009 లో సాధించారు.



భారతదేశానికి చెందిన లియాండర్ పేస్ గ్రాండ్‌శ్లామ్ ఈవెంట్లలో క్రమం తప్పక పాల్గొంటారు. లూకాస్ డ్లేహీతో కలిసి ఆయన డబుల్స్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్‌ను గెలుచుకోవటం ఆయనకు ఇది మూడవసారి. అన్ని గ్రాండ్ శ్లామ్ ఈవెంట్లను గెలుచుకున్న జాన్ బోర్గ్ 1978 నుంచి నాలుగేళ్ల పాటు వరసగా పురుషుల సింగిల్స్ చాంపియన్‌గా ఉన్నారు. స్పెయిన్‌కి చెందిన రాఫెల్ నాడల్ 2005 లో మళ్లీ ఇటువంటి ఘనతను సొంతం చేసుకున్నారు. 1974-1980 మధ్య కాలంలో అమెరికాకు చెందిన క్రిస్ ఎవర్ట్, లాయిడ్ మహిళల సింగిల్స్ టైటిళ్లను ఏడు సార్లు సొంతం చేసుకున్నారు.



ఈ ఈవెంట్లలో టైటిల్ గెలుచుకునే పురుష క్రీడాకారులకయినా, మహిళా క్రీడాకారులకయినా ప్రైజ్‌మనీ సమానంగానే ఉంటుంది. 10 లక్షలపైగా యూరోలను బహుమానంగా ఇస్తారు.

## టెన్నిస్ వైభవానికే తలమానికం వింబుల్డన్

ప్రపంచ టెన్నిస్ టోర్నమెంట్లలో వింబుల్డన్ అత్యంత ప్రముఖమైన, ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్. దీని చరిత్ర ఫ్రెంచ్ ఓపెన్ కంటే పాతది. దీన్ని 'క్రేడిల్ ఆఫ్ లాన్ టెన్నిస్' గా కూడా వ్యవహరిస్తారు.



SthanikaPalanaTel_May_2010_Colour.pmd 4 4/29/2010, 5:49 PM



# వింబుల్డన్‌లో భారతదేశం

అమెరికన్లు, యూరోపియన్లు, ఆస్ట్రేలియన్లు ప్రముఖపాత్ర వహించే టోర్నమెంట్ దృశ్యంలో, వింబుల్డన్‌లో భారత టెన్నిస్ క్రీడాకారులు ఎలా ఆడారోనని ఎవరైనా ఆలోచిస్తారు.

భారతదేశపు రికార్డులు పరిశీలిస్తే, అంత సంచలనాత్మకంగా లేవు కానీ, క్రీడాకారులు వ్యక్తిగత వైభవాన్ని విరజిమ్మే కొన్ని ఈవెంట్లు ఉన్నాయని చెప్పక తప్పదు.

1940 ల దశకంలో క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్న మొదటి భారతీయుడు హైదరాబాద్‌కి చెందిన గౌస్ మహమ్మద్ అని భారతీయుడు 1954 లో జూనియర్ సింగిల్స్ టైటిల్ గెలవటమే కాక, 1960, 1961 లలో పురుషుల సెమీ ఫైనల్ గ్రేడ్‌కి చేరుకున్నారు. ఆస్ట్రేలియాకు చెందిన నీల్ ఫ్రేసర్, రాడ్ లావర్ పోటీల్లో గెలుపొందారు.

ఆర్ - కృష్ణన్ కుమారుడు రమేష్ కూడా 1979లో జూనియర్ సింగిల్స్ టైటిల్‌ను గెలుపొందారు. ఆయన ఫ్రెంచ్ ఓపెన్ జూనియర్ టైటిల్ కూడా గెలుచుకున్నారు. 1980లో పురుషుల క్వార్టర్ ఫైనల్స్‌కు కూడా రమేష్ చేరుకున్నారు.

విజయ్ అమృతరాజ్ 1973లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. ఆ పోటీల్లో జాన్ నోడ్స్ టైటిల్ గెలుచుకున్నారు. విజయ్, ఆయన సోదరుడు ఆనంద్ 1976లో పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్‌కు చేరుకున్నారు. 2003లో సానియా మీర్జా బాలికల డబుల్స్ టైటిల్‌ను గెలుచుకుంది.

ప్రపంచంలోనే లియాండర్ పేస్ అత్యున్నత స్థానానికి వచ్చిన డబ్బుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ క్రీడాకారుడు. మహేష్ భూపతితో కలిసి ఆయన పురుషుల డబుల్స్ టైటిల్‌ను, లిసా రేమండ్, మార్టినా నవ్రతిలోవాలతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్స్‌ను సొంతం చేసుకున్నారు.



1875లో మేజర్ వాల్టర్ క్లాప్టన్ వింగ్‌ఫీల్డ్ అనే వ్యక్తి ఈ ఆటను అభివృద్ధి చేశారు. 1877 లో వింబుల్డన్‌లో మొదటి టెన్నిస్ టోర్నమెంట్ జరిగింది. ఆల్ ఇంగ్లాండ్ క్రోక్వెట్, లాన్ టెన్నిస్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇది నిర్వహించారు.

తదుపరి 133 సంవత్సరాలలో ఇది 'మక్కా ఆఫ్ లాన్ టెన్నిస్' గా ఆవిర్భవించింది. టెన్నిస్ టోర్నమెంట్లలో దీనికి ఉన్న ప్రముఖ స్థానం ఇంక దేనికీ లేదు. ఏ చాంపియన్ కయినా ఇందులో టైటిల్ సాధించటం కంటే వేరే ఘనత ఏమీ లేదు. ఫైనలిస్టులు టైటిల్ కోసం పోరాడటానికి ఆడే ఆట సెంటర్ కోర్టులో జరుగుతుంది. జూన్ నెల మూడవ సోమవారం టోర్నమెంట్ ప్రారంభమై, జూలై మొదటి ఆదివారం ముగుస్తుంది.

1968 నుంచి వింబుల్డన్‌లో ప్రపంచ దేశాల్లోని ఇతర క్రీడాకారులకు ఆడే అవకాశం లభించింది. అనేక సంవత్సరాల పాటు అమెరికన్లు, ఆస్ట్రేలియన్లు ఆటపై అధిపత్యం ప్రదర్శించారు. 1936లో ఇంగ్లాండ్‌కు చెందిన ఫ్రెడ్ పెరీ పురుషుల సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న తరువాత ఏ బ్రిటిష్ ఆటగాడూ ఆ ఘనతను సాధించలేదు. పెరీ టేబుల్ టెన్నిస్‌లో కూడా ప్రపంచ చాంపియన్‌గా ఉన్నారు. ఆఖరుసారిగా మహిళలు సింగిల్స్ టైటిల్ గెలుచుకున్న బ్రిటిష్ మహిళా క్రీడాకారిణి వర్జీనియా వేడ్. 1977 లో శత సంవత్సరం పోటీల్లో ఆమె ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం బ్రిటన్‌కు టెన్నిస్‌లో ఆశాజ్యోతిగా ఉన్నది ఆండీ ముర్రే.

అనేక చరిత్రాత్మక పోటీలకు వింబుల్డన్ వేదికగా నిలిచింది. 1980 లో జాన్ బోర్గ్ (స్వీడన్), జాన్ మెక్ ఎన్‌రో (అమెరికా) ల మధ్య జరిగిన ఫైనల్ పోటీలు చరిత్రాత్మకమైనవీ, మరుపురానివీ. అదే విధంగా 2009 లో రోజర్ ఫెదరర్, అమెరికాకు చెందిన ఆండీరోడిక్‌ల మధ్య జరిగిన ఫైనల్ కూడా అద్భుతమైనదే.

1968 తరువాత, అమెరికాకు చెందిన పీట్ సంప్రాస్ 1993-2002 మధ్య ఏడుసార్లు టైటిల్స్‌ను సొంతం చేసుకున్నారు. రోజర్ ఫెదరర్ 2003-09 మధ్య కాలంలో ఆరు సార్లు, బోర్గ్ 1976-80 మధ్యకాలంలో మూడుసార్లు, మార్టినా నవ్రతిలోవా 1978-1990 మధ్యకాలంలో తొమ్మిదిసార్లు టైటిల్స్ సొంతం చేసుకున్నారు. ఇకపోతే, స్టెఫీగ్రాఫ్, క్రిస్ ఎవర్ట్, బిల్లీ జీన్ కింగ్, లీనస్ వీలియమ్స్ కూడా అనేక సార్లు గెలుపొందారు. స్టెఫీగ్రాఫ్ మొత్తం 22 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలుచుకున్నారు. ఇందులో ఒలింపిక్ టైటిల్, 1988లో జరిగిన నాలుగు గ్రాండ్ శ్లామ్ ఈవెంట్ల టైటిళ్లు కూడా ఉన్నాయి.

టెన్నిస్ టోర్నమెంట్లలో టిక్కెట్లకు అధిక డిమాండ్ ఉంటుంది. ప్రత్యేకించి ఫైనల్ పోటీలకయితే చెప్పనక్కరలేదు. జోరున కురిసే వానను కూడా లెక్కచేయకుండా టిక్కెట్ల కోసం రాత్రంతా పడిగాపులు పడటానికి కూడా వారు సిద్ధం. అలాంటి సమయాల్లో నిద్రపోవటానికి సామగ్రి, టెంట్ సామగ్రిని కూడా వారు తెచ్చుకుంటుంటారు.

అనేక సందర్భాలలో ముఖ్యమైన మ్యాచ్‌లు వర్షం వల్ల ఆలస్యం కావటమో, అంతరాయం ఏర్పడటమో జరుగుతుంది. గత ఏడాది వాన పడినా పడకపోయినా మ్యాచ్ నిరంతరాయంగా జరగటానికి అప్పటికప్పుడు ఏర్పాటు చేయగలిగే ఒక రూఫ్‌ను సిద్ధంగా ఉన్నారు. వింబుల్డన్ పోటీలను టెలివిజన్‌లో చూపించటం 1937 లోనే ప్రారంభమైంది.

పారిస్ అంటే ఫ్యాషన్ సిటీ అని, ప్రపంచానికే గ్లామర్ రాజధానిగా పేరు పొందిందని మనందరికీ తెలుసు కాని టెన్నిస్ ఆకర్షణలు, కలర్, ఫ్యాషన్, గ్లామర్ విషయానికి వస్తే, ఫ్రెంచ్ ఓపెన్ కంటే వింబుల్డన్ ఎక్కువ ఖ్యాతి గడించింది. మేరియా షర్‌పోవా, గాబ్రియేలా సబాటిని, సెరీనా విలియమ్స్, అనా ఇవనోవా మొదలైన వారంతా ఏదో ఒక సమయంలో నెంబర్ వన్‌గా నిలిచిన వారే, వీరితో పాటు అన్నా కోర్నికోవా, సానియా మీర్జా, మరికొందరు వింబుల్డన్ పోటీలకు గ్లామర్ స్టార్లుగా వెలిగారు.

అదే సమయంలో వింబుల్డన్ పూర్తిగా బ్రిటిష్ స్వభావం కలిగినది. ప్రేక్షకులు అత్యంత క్రమశిక్షణ, పరిజ్ఞానం కలిగినవారు. మంచి షాట్ ఎవరు కొట్టినా వారికి అభినందనల చప్పట్లు లభిస్తాయి. అయితే, ఆట జరుగుతున్నప్పుడు గుసగుసలు కూడా వినపడవు. ఈ గ్లామర్‌కు రాజరికపు ఆదరం కూడా తోడవుతుంది. బహుమతుల ప్రదానానికి డ్యూక్, డచెస్ విచ్చేసి, మరింత హుందాతనాన్ని టోర్నమెంట్‌కి జోడిస్తారు. రాజరికపు జంట కూర్చున్న బాక్స్ వద్ద క్రీడాకారులు మ్యాచ్ ప్రారంభమవటానికి ముందు, ముగిసిన తరువాత తలవంచి నమస్కరించటం పరిపాటి.

**- దాసు కేశవరావు**

(అనువాదం: వై. సరోజ)



# అంతర్జాతీయంగా అదే స్ఫూర్తి....దీప్తి 'మేడే'

ప్రతి ఏడాది మే 1వ తేదీన ప్రపంచంలోని అన్ని దేశాల కార్మికుల అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. గత ఒకటిన్నర శతాబ్ద కాలంగా అంతర్జాతీయ కార్మికోద్యమం సాధించిన సామాజిక, ఆర్థిక విజయాలకు ప్రతీకగా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. క్లుప్తంగా, ఇది 'మేడే' గా ప్రాచుర్యం పొందింది. మేడే రోజున నూతనంగా సాధించబోయే డిమాండ్లకోసం ఎలుగెత్తడానికి గానీ, సాధించిన విజయాల పునశ్చరణకు గానీ, వాటి నుంచి స్ఫూర్తి పొందడానికి, వాటిని అమల్లో పెట్టడానికి గానీ అనేక దేశాల్లో లక్షలాది మంది కార్మికులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించటం, పాద యాత్రలు నిర్వహించటం పరిపాటి.



## పోరాట చరిత్ర

అసలు అంతర్జాతీయ కార్మిక దినం అనేకమంది కార్మికుల వధకు స్మారక దినంగా ప్రారంభమైంది. 1886లో ఎనిమిది గంటల పని దినం కోసం చికాగోలోని 'హే మార్కెట్‌లో సాధారణ సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులు కాల్పులు జరిపినప్పుడు అనేక మంది కార్మికులు మరణించారు. 1889లో 'సెకండ్ ఇంటర్నేషనల్' మొదటి మహాసభ ఫ్రెంచ్ విప్లవ శత సంవత్సర వేడుకల కోసం పారిస్‌లో సమావేశమైంది. చికాగోలో పోలీసు కాల్పుల్లో కార్మికులు మరణించినందుకు 1890లో అంతర్జాతీయంగా అన్ని దేశాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఈ మహాసభ పిలుపు నిచ్చింది.

ఈ ప్రదర్శనలు విజయవంతం కావంటంతో, 1891లో 'సెకండ్ ఇంటర్నేషనల్' రెండవ సభ వీటిని గుర్తించి, ప్రతి ఏడాది వీటిని జరపాలని నిర్ణయించింది తదుపరి 1894



SthanikaPalanaTel_May_2010_Colour.pmd 7 4/29/2010, 5:49 PM

లోనూ, 1919లోనూ కూడా మే డే సందర్భంగా హింసాకాండ, గొడవలు జరిగాయి. 1904లో ఆమ్‌స్టర్‌డామ్‌లో ఇంటర్నేషనల్ సోషలిస్టు కాన్ఫరెన్స్ సమావేశమై, 8 గంటల పని విధానాన్ని చట్ట బద్ధం చేసేందుకు మే 1 వ తేదీన అన్ని దేశాల్లో కార్మికులు భారీ ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపు నిచ్చింది. కార్మికుల ఇతర సమస్యల పరిష్కారానికి, ప్రపంచ శాంతికి కూడా ఈ ప్రదర్శనలు నిర్వహించాలని ఈ కాన్ఫరెన్స్ కోరింది.



ప్రదర్శనలన్నిటిలో సమ్మె అత్యంత శక్తివంతమైన మార్గం కాబట్టి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని కార్మిక సంఘాలు మే 1వ తేదీన పని మానేసి ప్రదర్శనలు జరపటం తప్పనిసరి చేస్తూ ఈ కాన్ఫరెన్స్ తీర్మానించింది. ఈ ప్రక్రియలో సాధ్యమైనంత వరకు కార్మికులకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా కాన్ఫరెన్స్ సూచించింది.

ఒక వైపు భూమి ఉత్తరార్థ గోళంలో ఇందంతా జరుగుతుండగా, ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో 8 గంటల పని దినం కోసం రాతి కార్మికుల సంఘం వీరోచిత పోరాటం చేసి, కార్మికోద్యమ ప్రారంభ కాలానికి మంచి ఊపునిచ్చింది.

1856 నాటికల్లా, ఆస్ట్రేలియా కార్మికులు ఆ పోరాట ఫలితాలను అందుకున్నారు. ఈ పోరాటానికి గుర్తుగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్‌లో గల లైగోన్ వీధిలో నెలకొల్పిన స్మారక స్థూపం నేటికీ ఉంది. దీనిపై '888' అనే నెంబర్లు ఉంటాయి. ఒక '8' 8 గంటల పనికి, రెండో '8' 8 గంటల వినోదానికి మూడో '8' 8 గంటల విశ్రాంతికి ప్రతీకలు.




అందుకే చాలా కాలంగా పలు సోషలిస్టు, కమ్యూనిస్టు, అనార్కిస్టు కార్మిక సంఘాలకు మే డే అనేది కార్మిక ప్రదర్శనలకు అనువైన దినంగా నిలిచింది. కొన్ని చోట్ల హే మార్కెట్ అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల స్మృత్యర్థం కాగడా పునర్శనలు చేస్తుంటారు.

కార్మికులు తమ హక్కుల సాధన కోసం చేసిన ఉద్యమాలు ఫలించినందుకు, సోషలిస్టు ఉద్యమం విజయం సాధించినందుకు గుర్తుగా జరుపుకునే ఉత్సవం కాబట్టి, చైనా, క్యూబా, పాత సోవియట్ యూనియన్ వంటి కమ్యూనిస్టు దేశాల్లో మే డే అనేది ఒక ముఖ్యమైన ప్రభుత్వ శెలవు దినం. ఈ దేశాల్లో మేడే రోజున విస్తృతమైన సైనిక ప్రదర్శనలు కూడా జరుగుతుంటాయి.

అమెరికా, కెనడా మినహా ఇతర దేశాలన్నిటిలో 'మేడే' ని అధికారిక శెలవు దినంగా ప్రకటింప చేసుకోవటానికి అక్కడి కార్మికులు అనేక ప్రయత్నాలు చేశారు. చాలామటుకు ఆ ప్రయత్నాల్లో సఫలమయ్యారు కూడా. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాల్లో మే డే రోజున వీధుల్లో భారీ కార్మిక ప్రదర్శనలు జరగటం పరిపాటి.

అయితే, అమెరికాలో మటుకు, కార్మికులకి అధికారక శెలవు దినమైన 'లేబర్ డే' సెప్టెంబర్‌లో వస్తుంది. అమెరికాలోని సెంట్రల్ లేబర్ యూనియన్ ఈ శెలవు దినాన్ని ప్రతిపాదించింది. 1852లో సెప్టెంబర్ 5న మొదటి కార్మిక దినంగా పాటించారు. తరువాత ప్రతి సంవత్సరం అదే రోజున 'లేబర్ డే' జరుపుతుండే వారు. అయితే, ఇతర యూనియన్లు ఇతర దేశాల మాదిరిగా మే 1న కార్మిక దినం జరుపుకోవాలని ప్రయత్నిస్తూ సెప్టెంబర్ 5 లేబర్ డేని వ్యతిరేకించాయి. కాని, సఫలం కాలేదు.

## అనేక దేశాల్లో శెలవు దినం

మే 1వ తేదీని అనేక దేశాలు జాతీయ శెలవు దినంగా ప్రకటించాయి. అల్బేనియా, ఆర్మేనియా, అర్జెంటీనా, అరుబా, ఆస్ట్రియా, బంగ్లాదేశ్, బెలారస్, బెల్జియం, బొలీవియా, బోస్నియా, హెర్జ్‌గోవినా, బ్రెజిల్, బల్గేరియా, కామెరూన్, చిలీ, కొలంబియా, కోస్టారికా, చైనా, క్రోయేషియా, క్యూబా, సైప్రస్, చెక్ రిపబ్లిక్, డొమినిషన్ రిపబ్లిక్, ఈక్వడార్, ఈజిప్ట్, ఎల్ సాల్వడార్, ఫ్రాన్స్, జర్మనీ, గ్రీస్, గ్వాటిమాలా, హైతీ, హోండురాస్, హాంగ్‌కాంగ్, హంగరీ, ఐస్‌లాండ్, ఇండియా, ఇరాక్, ఇటలీ, ఐవరీకోస్ట్, జోర్డాన్, కెన్యా,


SthanikaPalanaTel_May_2010_Colour.pmd 8 4/29/2010, 5:49 PM

లాట్వియా, లిథుయేనియా, లెబనాన్, లగ్జెంబర్గ్, మాసెడోనియా, మలేషియా, మాల్టా మారిషస్, మెక్సికో, మొరాకో, మైయన్మార్ (బర్మా), నేపాల్, నైజీరియా, నార్త్ కొరియా, నార్వే, పాకిస్తాన్, పనామా, పరాగ్వే, పెరు, పోలండ్, ఫిలప్పీన్స్, పోర్చుగల్, రుమేనియా, రష్యా, సింగపూర్, స్లోవేకియా, స్లోవేకియా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, స్పెయిన్, శ్రీలంక, సెర్బియా, స్వీడన్, సిరియా, థాయిలాండ్, టర్కీ, ఉక్రెయిన్, ఉరుగ్వే, వెనెజులా, వియత్నాం, జాంబియా, జింబాబ్వే మొదలైన దేశాలు ఈ కోవలోనివే.

బ్రెజిల్‌లో మేడే రోజున రోజంతా కార్మిక సంఘాలు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాయి. అనేక వృత్తిపరమైన పోస్టులకు వేతనాలు, కార్మికులకు కనీస వేతనాలను ఈ రోజున సవరించటం అక్కడ పరిపాటి. కెనడాలో ఆ రోజు శెలవు లేకపోయినా. కార్మిక సంఘాలు దాన్ని ముఖ్యమైన దినంగా పరిగణించి, సందర్భానుసారం కార్యక్రమాలు చేపడతాయి. సెప్టెంబర్ లో మొదటి సోమవారాన్ని కెనడాలో అధికారిక కార్మిక దినంగా 1894 లోనే ప్రకటించారు. అమెరికాలో కూడా ఇదే అధికారిక శెలవు దినం. అయినప్పటికీ, కొన్ని అతివాద కార్మిక సంఘాలు మే 1న కొన్ని కార్యక్రమాలను అనధికారంగా నిర్వహిస్తుంటాయి.



భారతదేశంలో మొదటిసారి మేడే ని 1923లో నిర్వహించారు. హిందుస్తాన్ లేబర్ కిసాన్ పార్టీ 1923, మే1న మేడే జరిపింది. భారతదేశంలో మొదటిసారి ఎర్రజెండా ఎగిరినది కూడా ఆ రోజునే ఆ పార్టీ నాయకుడు సింగరవేలు చెట్టియార్ 1923లో రెండు చోట్ల మేడేని నిర్వహించటానికి ఏర్పాటు చేశారు. మద్రాసు హైకోర్టు ఎదురుగా ఉన్న బీచ్ వద్ద ఒక సమావేశం ఏర్పాటు కాగా, రెండవ సమావేశం ట్రిప్లికేన్ బీచ్ వద్ద జరిగినట్లు మద్రాసు నుంచి వెలువడే 'హిందూ' దిన పత్రిక పేర్కొంది. ఆ విధంగా చెన్నైలో 'మేడే' వేడుకలని ప్రవేశపెట్టిన ఘనత లేబర్ కిసాన్ పార్టీకి దక్కింది.




ఈ సమావేశాలకి అధ్యక్షత వహించిన సింగర వేలు చెట్టియార్ మాట్లాడుతూ, మేడే ని ప్రభుత్వం శెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ అహింసా విధానాలను కూడా ఆయన ఆ సమావేశంలో వివరించారు. స్వాతంత్ర్యం సాధించాలంటే ప్రపంచ కార్మికులు ఏకం కావాలని ఆయన పిలుపు నిచ్చారు.

భారతదేశంలో 'మేడే' రోజున దేశవ్యాప్తంగా బ్యాంకులకి కూడా శెలవు దినమే. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకి మే 1న మరో కారణానికి కూడా శెలవుదినం. మహారాష్ట్ర అవతరణ దినం, గుజరాత్ అవతరణ దినం కూడా మే 1నే. ఎందుకంటే, 1960లో ఇదే రోజున ఈ రెండు రాష్ట్రాలు ఆవిర్భవించాయి. భాషా ప్రాతిపదికన పాత బొంబాయి రాష్ట్రం విడిపోయి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలుగా ఏర్పడ్డాయి.

జపాన్‌లో ప్రభుత్వం మే 1వ తేదీన అధికారంగా శెలవు దినంగా ప్రకటించక పోయినప్పటికీ, ఇతర జాతీయ శెలవు దినాల మధ్య ఇది వస్తుండటంతో ఇంచు మించు కార్మికులందరికే అది శెలవు రోజే. చాలా మంది యజమానులు ఆరోజును శెలవుగా ప్రకటిస్తారు. లేదంటే, కార్మికులే శెలవు తీసుకుంటారు. జపాన్‌లో మే1న 'గోల్డెన్ వీక్' శెలవుల మధ్య వస్తుంది. ఏప్రిల్ 29న షోవా డే (మాజీ చక్రవర్తి హిరోహిటో జన్మదినం) మే 3న రాజ్యాంగ సార్మక దినం, మే 4 గ్రీనరీడే, మే 5 బాలల దినం మొదలైన వాటిని జపాన్‌లో పాటిస్తున్నారు.

ఆ రకంగా జపాన్ కార్మికులు ఏ ప్రదర్శనలు చేయటానికో కాక వరసగా శెలవులు తీసుకోవటానికి వీలుగా మే 1వ తేదీన కూడా శెలవు తీసుకుంటారు. జపాన్‌లోని కార్పోరేట్ సంస్కృతిలో, వ్యక్తిగత ఆనందానికి ఒక వారం రోజులు శెలవు తీసుకోవటాన్ని అభ్యంతరకరంగా పరిగణిస్తారు.

అయితే సాధారణంగా కొన్ని ప్రధాన కార్మిక సంఘాలు మే 1న టోక్యో, ఒసాకా, నగోయా వంటి చోట్ల ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తాయి.

2008లో 'జెన్రొరెన్' అనే నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ యొయోగి పార్క్‌లో ర్యాలీ నిర్వహిస్తే, 44,000 మంది కార్మికులు హాజరయ్యారు. 'జెన్‌రోక్యో' అనే నేషనల్ ట్రేడ్ యూనియన్స్ కౌన్సిల్స్ కూడా హిబియా పార్క్‌లో మేడే ర్యాలీని నిర్వహించింది. అయితే, జపాన్‌లోని అతిపెద్ద కార్మిక సంఘమైన 'రెంగో' (జపనీస్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్) తన మేడే ర్యాలీని మే 3 వ తేదీన


SthanikaPalanaTel_May_2010_Colour.pmd 9 4/29/2010, 5:49 PM



నిర్వహించటం ద్వారా అతి వాద కార్మిక సంఘాలకు తాను దూరంగా ఉంటానని చాటుకుంది.

జపాన్‌లో నవంబర్ 23న 'లేబర్ థ్యాంక్‌గివింగ్ డే' అధికారిక శెలవు దినంగా ఉంది. 1873లో మేజి ప్రభుత్వం 'ఇంపీరియల్ హార్వెస్ట్' ఫెస్టివల్‌గా దీనిని శెలవు దినంగా ప్రకటించగా, రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1948లో అప్పటి ప్రభుత్వం దాని పేరు మార్చింది.

మే డేని నేపాల్‌లో కూడా 1963 నుంచి నిర్వహిస్తున్నారు. అయితే, 2007లో మాత్రమే అది ప్రభుత్వ శెలవు దినంగా మారింది.

జర్మనీలో 1919 సంవత్సరంలో మటుకు మే 1న శెలవుదినంగా అప్పటి వామపక్ష విప్లవ ప్రభుత్వం ప్రకటించింది. అయితే, 1933 నుంచి మాత్రమే శాశ్వత అధికారిక శెలవు దినంగా నాజీ ప్రభుత్వం ప్రకటిస్తూ, 'హాలిడే ఆఫ్ నేషనల్ లేబర్' గా పేరు మార్చింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం 'నేషనల్' అనే పదం తీసివేసి 'డే ఆఫ్ లేబర్'గా మాత్రం వ్యవహరిస్తున్నారు.

ఇటలీలో మొదటిసారిగా 1890లో మేడేని నిర్వహించారు. కార్మికులు తమ హక్కులను సాధించుకోవటానికి మరింత మెరుగైన సామాజిక, ఆర్థిక పరిస్థితులను కల్పించుకోవటానికి చేసే ప్రయత్నంగా ఇది మొదలైంది. అయితే, ఫాసిస్టు ప్రభుత్వం మేడేని నిషేధించింది. కాని రెండవ ప్రపంచ యుద్ధానంతరం తిరిగి మేడే ప్రారంభమైంది.

ప్రస్తుతం ఇటలీలో మేడే అనేది చాలా ముఖ్యమైన ఉత్సవం. ఇటాలియన్ కార్మిక సంఘాలు రోమ్‌లోని పియాజా శాన్ జియోవనిలో మే1న పెద్ద సంగీత కచేరి నిర్వహిస్తాయి. దీనికి ప్రతి ఏటా 3,00,000 మంది పైగా హాజరవుతారు. అనేక మంది ప్రముఖ సంగీతకారులు, గీత రచయితలు, వాద్య బృందాలు ఇందులో పాల్గొంటాయి.

రష్యాలో ఫిబ్రవరి విప్లవం వరకు మేడేని అనధికారికంగా నిర్వహించేవారు. 1917లో మొదటిసారిగా చట్టబద్ధంగా నిర్వహించారు, తదుపరి సంవత్సరం మెన్షెవిక్‌లు, లెఫ్ట్ సోషలిస్టు రివల్యూషనరీలు, అనార్కిస్టులు మేడే ఉత్సవాలని బహిష్కరించారు. తరువాత మేడే సోవియట్ యూనియన్‌లో ఒక ముఖ్యమైన అధికారిక శెలవు దినమైంది. అనేక ప్రధాన నగరాల్లో పెద్దపెద్ద పెరేడ్లు జరిగేవి. ఇప్పటికీ, రష్యాలో 'మేడే' ఒక ప్రధానమైన అధికారిక శెలవు దినమే.

బ్రిటన్‌లో ఆ మధ్య సంవత్సరాల్లో మేడే సందర్భంగా లండన్, గ్లాస్‌గో, ఎడిన్ బర్గ్, డోన్ కాస్టర్‌లలో పెట్టుబడి దారీ వ్యతిరేక ఉద్యమం పెద్ద పెద్ద ప్రదర్శనలు నిర్వహించింది. లండన్‌లో ఇవి ప్రదర్శనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు సృష్టించాయి. 2000 సంవత్సరంతో ఇవి అంతమయ్యాయి. అయితే, ఇటీవలి సంవత్సరాల్లో ప్రదర్శనలు, ఊరేగింపులు ప్రశాంతంగానే జరుగుతున్నాయి.




న్యూజీ లాండ్‌లో అక్టోబర్‌లోని నాలుగవ సోమవారం కార్మిక దినం శెలవు జరుపుతారు. 1840లో 8 గంటల పని కోసం జరిగిన ఉద్యమం నుంచి ఈ కార్మిక దినం ఆవిర్భవించింది. 1900 సంవత్సరం నుంచి ఇది అధికారిక శెలవు దినంగా ఉంటుందని 1899లోనే ప్రభుత్వం చట్టం చేసింది.

ఆస్ట్రేలియాలో కార్మిక దినం అధికారిక శెలవును వివిధ రాష్ట్రాలు వివిధ రోజుల్లో ప్రకటించటం విశేషం. కొన్ని చోట్ల ఈ ఉత్సవాలు అంతర్జాతీయ కార్మిక దినానికి సంబంధించినవయితే, మరికొన్ని చోట్ల ఇతరత్రా విషయాలకి సంబంధించినవి.

ఆస్ట్రేలియన్ కాపిటల్ టెరిటరీ, న్యూసౌత్‌వేల్స్, సౌత్ ఆస్ట్రేలియాలో అక్టోబర్ లోని మొదటి సోమవారం కార్మిక దినంకాగా, వెస్టర్న్ ఆస్ట్రేలియాలో మార్చి నెల మొదటి సోమవారం. కార్మిక దినంగా జరుపుతారు. ఇక విక్టోరియా, టాస్మానియాలలో మార్చిలోని రెండవ సోమవారం కార్మిక దినం. ఇకపోతే క్వీన్స్ లాండ్, నార్తర్న్ టెర్రిటరీలలో మే నెలలోని మొదటి సోమవారం కార్మిక దినం.

ఏదేమైనప్పటికీ, భారతదేశంలో మటుకు మేడే అన్ని ఫ్యాక్టరీల్లోని కార్మికులకు, బ్యాంకు ఉద్యోగులకు, షాప్స్ - ఎస్టాబ్లిష్‌మెంట్ల కార్మికులకు శెలవుదినంగానే ఉంది. ఆ రోజున కార్మికులు, ఉద్యోగులు ఒక ఉత్సవంగా జరుపుకోవటమే కాక, తమ సమస్యల పరిష్కారానికి గళ మెత్తటం కూడా పరిపాటి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కార్మికుల సంక్షేమార్థం వివిధ పథకాలను ప్రకటిస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అధికారికంగా కార్మిక దినోత్సవాన్ని మే1న నిర్వహించి, ఉత్తమ కార్మికులకు 'శ్రమశక్తి' అవార్డులను ప్రదానం చేస్తుంది.

ఏ విషయాలు ఎలా ఉన్నా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను చూపడానికి, వారి సంక్షేమార్థం పలు చర్యలు తీసుకోవటానికి, కార్మికులు కూడా తమ ఉత్పాదక శక్తిని మెరుగు పరుచుకుని పని సంస్కృతిని పెంపొందించటానికి ఈ మేడే తగిన స్ఫూర్తినందించి, మార్గాలు చూపుతుందని ఆశిద్దాం.

**– గొట్టిపాటి సుజాత**



SthanikaPalanaTel_May_2010_Colour.pmd 10 4/29/2010, 5:49 PM

# ఆంధ్ర కళాప్రాభమ్మోలికించి తీయగా పాడిన కోయిలమ్మ

గాయనిగా, రంగస్థల, చలనచిత్ర నటీమణిగా భారతీయ సాంస్కృతిక వైభవాన్ని అంతర్జాతీయ కళావేదికలపై ప్రదర్శించిన బహుముఖ ప్రజ్ఞానిధి టంగుటూరి సూర్యకుమారి.

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి తమ్ముడు టంగుటూరి శ్రీరాములు రాజేశ్వరి దంపతుల పుణ్యాల పంటగా, టంగుటూరి సూర్యకుమారి 1926 నవంబర్ 13న రాజమండ్రిలో జన్మించింది.

చిన్నతనంలో విఖ్యాత గాయకుల గ్రామఫోన్ రికార్డులు వింటూ, వారిలాగే పాడేది.. కూతురి కంఠ మాధుర్యం విని, తల్లి రాజేశ్వరి 'నీకు కోకిల గానమబ్బిందమ్మా' అని మురిసిపోయేది. కోకిల మామిడి కొమ్మల పై కూర్చొని పాటపాడుతుందని తెలుసుకొన్న సూర్యకుమారి తానూ మామిడికొమ్మపై కూర్చుని కాళ్ళు ఊపుతూ, లయబద్ధంగా పాడుతూ వుండేది. ఆ దారిన పోయేవారు ఆగి ఆ బాలకోకిల గానాన్ని వింటూ తన్మయులయ్యేవారు.

ఆమె ఏ పాఠశాలలోగాని, ప్రైవేట్ మాస్టరు వద్ద గాని చదువుకోలేదు. తండ్రి శ్రీరాములు వద్ద ఇంగ్లీష్ నేర్చుకొన్నది. కొద్దికాలంలోనే షేక్స్పియర్, మిల్టన్, సోమర్‌సెట్ మామ్ రచనలు చదివేది. బాల గాయనిగా, అందాల బరిణెగా ప్రజలు ఆమెను వేయి కళ్ళతో చూచేవారు.

పెదనాన్న ప్రకాశం పంతులు, సూర్యకుమారిని తనతో తీసుకు వెళ్ళేవారు. ప్రకాశం గారి ఉపన్యాసాలు, సూర్యకుమారి జాతీయ గీతాల ఆలాపనతో ప్రారంభమయ్యేవి. 'మ్రోయింపు నగారా!' మా తెలుగు తల్లికీ మల్లెపూదండ, 'ఓ మహాత్మా, ఓ మహర్షీ' మొదలగు గీతాలు శ్రావ్యంగా పాడుతూ శ్రోతలను ఉర్రూతలూగించేది.

ఇంట్లోనే చదివి కేంబ్రిడ్జి సీనియర్ మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణురాలైంది. ప్రముఖ సంగీత విద్వాంసులు, అరియకుడి రామానుజ అయ్యంగార్ వద్ద కర్ణాటక సంగీతం అభ్యసించింది. వయొలిన్ వాద్యవాదనంలోను, కూచిపూడి నృత్యంలోను ప్రావీణ్యం గడించింది.

అమె అక్క సావిత్రి వివాహం తర్వాత భర్త సూర్యప్రకాశరావుతో పాటు మద్రాసులో స్థిరపడింది. బాలసూర్యకుమారి అక్క వద్దకు చేరింది. న్యాయవాది సూర్యప్రకాశరావు మిత్రుడు సూర్యకుమారి పాట విని, తాను తీయబోయే తమిళ చిత్రాలలో నటించే అవకాశం కల్పించాడు. 1937, ఆయన తీసిన 'విప్రనారాయణ'లో (తమిళం) పాడింది.

### తెలుగు సినీ రంగ ప్రవేశం

తెలుగులో ఆమె నటించిన చిత్రాలలో 'రైతుబిడ్డ' చెప్పుకోతగింది. సారథీ ఫిల్మ్ వారు గూడవల్లి రామబ్రహ్మం దర్శకత్వంలో విడుదలయింది. విఖ్యాత నటుడు బళ్ళారి రాఘవ, సి.ఎస్.ఆర్. ఆంజనేయులుగార్లతో పదమూడేళ్ళ సూర్యకుమారి ఈ చిత్రంలో నటించింది. ఆమె పాడిన పాట "రాబోకు, రాబోకురా చందురూడా" గొప్ప హిట్. 'దీనబంధు' (1942), 'కృష్ణప్రేమ' (1943) చిత్రాలలో ఆమె పాటలను ప్రేక్షకులు ప్రశంసించారు. చిత్తూరు నాగయ్య నటించిన 'మరదలు పెళ్ళి' (1952) చిత్రానికి సూర్యకుమారి సంగీత దర్శకత్వం వహించింది.

1944లో 'గీతప్రకాశ్' అన్న సాంస్కృతిక సంస్థను స్థాపించింది. కచేరీలు చేసి సంపాదించిన డబ్బును రెడ్‌క్రాస్ సంస్థకు, టి.బి. శానిటోరియంకు విరాళంగా ఇచ్చింది.



టంగుటూరి సూర్యకుమారి (1926-2005)

1952లో సూర్యకుమారి 'మిస్ మద్రాసు'గా ఎన్నుకోబడింది. మోషన్ పిక్చర్స్ ఇండస్ట్రీ ఆఫ్ అమెరికా వారు భారత చలన చిత్ర పరిశ్రమ నుండి హాలీవుడ్ సందర్శించడానికి 14 మంది ప్రముఖులను ఆహ్వానించింది. ఈ బృందంలో రాజ్‌కపూర్, నర్గీస్, బీనారాయ్‌గార్లతో పాటు సూర్యకుమారి కూడా వున్నారు. ఆ బృందమంతటిలో ఇంగ్లీషులో చక్కగా మాట్లాడేవారు సూర్యకుమారి ఒకరే. శ్రీశ్రీ రచించిన 'ఓ మహాత్మా ఓ మహర్షీ' అన్న పాటను అద్భుతంగా పాడి శ్రోతలను తన్మయులకావించేది.



## హిందీ చిత్ర రంగం

1952 నవంబర్ 6న, ఫాల్కన్ ఫిలిమ్స్ బానర్ కింద తీసిన పతన్ చిత్రంలో సూర్యకుమారి, మునవ్వర్‌లు నాయికా నాయకలుగా నటించారు. మరో మూడు హిందీ సినిమాలలో కూడా నటించింది. దిలీప్‌కుమార్ హీరోగా ఎస్.యు. సున్నీ దర్శకత్వంలో 'ఉరన్ ఖటోలా'లో నటించి మంచి పేరు గడించింది.

1959లో అమెరికా వెళ్ళిపోయే ముందు సూర్యకుమారి, నాగయ్య హీరోగా నటించిన 'రామదాసు' లో సితారా బేగంగా నటించింది. ఆ సినిమా పూర్తికావటానికి కొన్ని ఏళ్ళు పట్టింది. నాగయ్య నష్టాలు చవిచూశారు. శాంతారాం తీసిన తెలుగు 'అప్నాదేశ్'లో సూర్యకుమారి ఆరు పాటలు పాడింది.

సూర్యకుమారి తల్లి రాజేశ్వరి 1956 జనవరి 10న కాలగతి చెందటంతో ఆమె తల్లిని గురించిన 'స్మృతికవిత' రాసింది. కళాచైతన్య సంస్థను ప్రారంభించింది. రవీంద్రనాథ్ టాగూర్ రచించిన 'చిత్ర' నాటకాన్ని తెలుగులో చిత్రార్జున ప్రదర్శించటానికి ఇరువది అయిదు మంది నటులు సాంకేతిక నిపుణులతో ఎంపిక చేసింది. 1957లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారి ప్రోత్సాహంతో చిత్రార్జున తొలిప్రదర్శన జయప్రదంగా జరిగింది.

అదే చిత్రాన్ని భారత రాజధానిలో ప్రదర్శించినపుడు ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత సర్వసేనాపతి జనరల్ తిమ్మయ్య చూసి ప్రశంసలందించారు.

కుటుంబ పెద్దగా తన బాధ్యతలన్నీ ముగించి భారత్- అమెరికాల మధ్య సుహృద్భావాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో అమెరికా వెళ్ళింది. కొలంబియా విశ్వవిద్యాలయంలో భారతీయ సంగీత బోధకురాలుగా ఉద్యోగం సంపాదించింది.

కృష్ణా షా, 'ది కింగ్ ఆఫ్ డార్క్ చేంబర్' అన్న టాగూరు నాటకాన్ని ప్రదర్శించాలని నిశ్చయించి అందులో రాణి సుదర్శన పాత్రధారణకు సూర్యకుమారిని ఎన్నుకొన్నారు. ఆ నాటకం అందరి ప్రశంసలందుకొన్నది. వారానికి ఎనిమిది ప్రదర్శనల ప్రకారం పది నెలల పాటు ప్రదర్శన సాగింది. అమెరికా రంగస్థల విమర్శకులు ఆమె నటనా ప్రతిభకు ముగ్ధులై 1961లో ప్రతిష్ఠాత్మకమైన 'ఒబిఐఈ' అవార్డుతో సత్కరించారు.

1968లో లండన్‌లో 'ఇండియన్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ సంస్థ'ను స్థాపించింది. 1968లో బ్రిటిష్‌రాణి ఎలిజబెత్ ఆహ్వానంపై ఆమెను కలుసుకొనింది.

1969లో కాంటర్‌బరి ఆర్చిబిషప్ మైకేల్‌రామ్సే ఆహ్వానంపై మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాలలో పాల్గొని గాంధీజీకి నివాళులర్పిస్తూ పాటలు పాడింది. ఈ ప్రదర్శనకు భారతదేశ చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటెన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

1975లో హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభ ఈమె సేవలను గుర్తించి సత్కరించింది. ఆ సభలోనే, 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతకర్త శంకరంబాడి సుందరాచారిని కూడా ప్రభుత్వం సత్కరించింది. 1979లో రాజాలక్ష్మీ ఫౌండేషన్ సత్కరించింది.

నార్వే, స్వీడన్ అమెరికాలలో భారతీయ సంగీత శిక్షణాలయాలను నెలకొల్పి ఎందరో కళాకారులను తయారు చేసింది. ప్రాచ్యత్య నృత్య సంగీతాలకు మధ్య సుహృద్భావ సేతువుగా అంతర్జాతీయ కీర్తిగాంచిన మధురగాయని సూర్యకుమారి.

ఎనిమిదేళ్ళ పరిచయం తర్వాత 1973 అక్టోబర్ 22 సూర్యకుమారి హెరాల్డ్ ఎల్విన్‌ను వివాహం చేసుకుంది. అది ప్రేమ వివాహం. ఎల్విన్ గొప్ప రచయిత, చిత్రకారుడు. పరస్పరం అంకిత భావంతో ఉండేవారు. హెరాల్డ్ ఎల్విన్ 1985 కాలధర్మం చెందాడు. సూర్యకుమారి తంబూరా వాయిస్తూ భజగోవింద శ్లోకాలు, భగవద్గీత శ్లోకాలు గానం చేసింది. హెరాల్డ్ అంతిమ యాత్రలో అతనికత్యంత ప్రియమైన అతని సైకిల్‌ను కూడా తీసుకువెళ్ళారు.

ఆమె డెబ్బై అయిదేళ్ళు పైబడిన తర్వాత కూడా చురుగ్గా కార్యక్రమాలు నిర్వహించింది. 2004లో ఆరోగ్యం క్షీణించి కొన్ని రోజులు వెస్ట్‌మినిస్టర్ హాస్పిటల్‌లో చికిత్స పొందింది. కెన్సింగ్‌టన్‌లో, ఆమె ఇంటి వద్ద వున్న శిష్యుడు నరేశ్‌కుమార్ సేథి, అతని స్నేహితురాలు రోహిణీపటేల్ సూర్యకుమారికి, తోడుగా పరిచర్యలు చేసేవారు. ఆసుపత్రిలోని రోగులను సందర్శిస్తూ వారు కోరిన పాటలు పాడుతుండేది. ప్రతి పడక దగ్గరకి వెళ్ళి పరామర్శించేది. మూర్తీభవించిన మానవతావాదిగా, విఖ్యాత కళాకారిణిగా భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను పెంచిన సూర్యకుమారి 2005 ఏప్రిల్ 25న నిద్రలోనే తుది శ్వాస వదలింది.

ప్రముఖ విద్యావేత్త లండన్‌లో వుంటున్న డాక్టర్ గూటాల కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, విశాలాంధ్ర పబ్లికేషన్స్ సమర్పణలో శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి 82వ జయంతి ఉత్సవం నిర్వహించి 'సూర్యకుమారి ఎల్విన్-ఎ మెమోరియల్ వాల్యూమ్' గ్రంథాన్ని 2007 నవంబర్ 13న రవీంద్రభారతిలో విడుదల చేశారు.

భారతీయ సాంస్కృతిక రాయబారిగా టంగుటూరి సూర్యకుమారి చిరస్మరణీయురాలు.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

1993 ఏప్రిల్ 24 నుండి అమలులోకి వచ్చిన 73వ రాజ్యాంగ సవరణ చట్టం దేశ పంచాయతీ రాజ్ వ్యవస్థలో పెనుమార్పులు తీసుకొనివచ్చింది. పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగబద్ధత కల్పించటమే కాకుండా పంచాయతీరాజ్ సంస్థలు స్థానిక ప్రభుత్వాలుగా పనిచేయుటానికి అవసరమయిన నిధులు, విధులు, సిబ్బంది బదలాయింపుకి మార్గం సుగమం చేసిన 73వ రాజ్యాంగ సవరణ చట్టం అమలులోకి వచ్చిన ఏప్రిల్ 24వ తేదీని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా ప్రతీ ఏటా జరుపుకుంటున్నాము. గ్రామీణ ప్రాంతాల పురోభివృద్ధికి పంచాయతీరాజ్ సంస్థలు చేస్తున్న కృషిని సమీక్షించుకుంటూ భవిష్యత్ కార్యాచరణకు పంచాయతీరాజ్ సంస్థలను కర్తవ్యోన్ముఖులను చేయటానికి గాను ప్రతీ సంవత్సరం కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పంచాయతీరాజ్ క్రొత్త ఢిల్లీలో నిర్వహిస్తోంది.

ఈ సంవత్సరం ఏప్రిల్ 24న జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాలకు భారత ప్రధాని మన్మోహన్ సింగ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ దేశ పంచాయతీరాజ్ చరిత్రలో ఏప్రిల్ 24వ తేదీ అత్యంత గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో మూడంచల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటయినదనీ, దీని ద్వారా అట్టడుగు స్థాయి వరకూ అధికార వికేంద్రీకరణకు వెసులుబాటు కలిగినదని ప్రధాని అన్నారు. సం. 2009 అక్టోబరు 2 నాటికి మన దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తి ఐన సందర్భాన్ని పురస్కరించుకొని 2009 అక్టోబరు 2 నుండి 2010 అక్టోబరు 2 వరకూ గల కాలాన్ని గ్రామసభల సంవత్సరంగా పాటించటం తనకు ఆనందాయకంగా ఉన్నదని ప్రధాని అన్నారు.

73వ రాజ్యాంగ సవరణ ప్రభావం నేడు గ్రామీణ ప్రజల జీవనంపై చెప్పుకోదగ్గ మార్పును తీసుకొని వచ్చిందని ప్రధాని అన్నారు. ఈ

# పంచాయతీల సాధికారతతోనే అభివృద్ధి సాధన - ప్రధాని మన్మోహన్






SthanikaPalanaTel_May_2010_Black&White.pm7 4/29/2010, 3:02 PM




సవరణ వల్ల సాధారణ ప్రజలలో, మరీ ముఖ్యంగా సమాజంలోని పేదలు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలలో సాధికారత పెంపొందటమే కాక గ్రామీణ ప్రాంతాలలో అధికార సమీకరణలలో చెప్పుకోదగ్గ మార్పులు సంభవించాయని ప్రధాని అన్నారు. దేశంలోని 600 జిల్లా పరిషత్తులు, 6000 పంచాయతీ సమితులు, రెండు లక్షల ముప్పై వేల గ్రామ పంచాయతీలలో క్రమం తప్పకుండా ఎన్నికలు జరగుతుండటం పట్ల, సుమారు 28 లక్షల ప్రజా ప్రతినిధులు ఎన్నిక కావటం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేసారు.

పంచాయతీలలో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు జరుగుతుండటం దేశానికే గర్వ కారణమన్నారు, దీని వల్ల దాదాపు 10 లక్షల మంది మహిళలకు పాలనాధికారం దక్కిందన్నారు. స్థానిక సంస్థలలో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించటానికి ఉద్దేశించిన ప్రతిపాదిత బిల్లు చట్టరూపంలో అమలులోకి వస్తే ఈ సంఖ్య 14 లక్షలకు పెరుగుతుందని ప్రధాని అన్నారు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలలో ఎస్సీ,ఎస్టీ, ఓ.బి.సీలకు కూడా రిజర్వేషన్లు కల్పించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ప్రధాని చెప్పారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ఈ రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని, మిగిలిన రాష్ట్రాలలో కూడా రిజర్వేషన్లు కల్పించే విధంగా చర్యలు తీసుకొంటామని ప్రధాని చెప్పారు.

స్థానిక అవసరాలపై పంచాయతీలకు పూర్తి అవగాహన ఉండటం వల్ల అభివృద్ధిలో ప్రతిబక్కరినీ భాగస్వామ్యులను చేస్తే ఆశించిన ఫలితాలను పొందవచ్చని ప్రధాని అన్నారు. గిరిజన, మారుమూల వెనుకబడిన ప్రాంతాలలోని పంచాయతీలు అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టవలసిన అవసరం ఉందని ప్రధాని చెప్పారు. సంక్షేమ పథకాల ఫలాలు అట్టడుగున ఉన్న ప్రజలకు చేరినప్పుడే అభివృద్ధి నిరోధక శక్తులుగా తయారైన మావోయిస్టులను కట్టడి చేయటానికి వీలుకలుగుతుందని మన్మోహన్‌సింగ్ అన్నారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరిగేలా పంచాయతీలు పనిచేయాలని ప్రధాని కోరారు.

పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపట్ల ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉన్నదని, పంచాయతీలకు వివిధ రాష్ట్రాలు నిధులు, విధులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో బదలాయించే విధంగా తగుచర్యలు తీసుకొనటానికి సదా ప్రయత్నిస్తున్నామని తెలియచేసారు. పంచాయతీలను ఆర్థికంగా పరిపుష్టి చేయటానికి అన్ని చర్యలు తీసుకొంటున్నామని, పన్నువసూళ్ళలో పంచాయతీరాజ్ సంస్థలకు వాటా ఇవ్వాలని 13వ ఆర్థిక సంఘం చేసిన సిఫారుసులను త్వరలో అమలు చేస్తామని ప్రధానిచెప్పారు.

ఈ సదస్సులో పాల్గొన్న కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖమంత్రి సి.పి.జోషి మాట్లాడుతూ పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాల బదలాయింపును తప్పనిసరి చేస్తూ చట్టసవరణ తీసుకొని రావలసిన సమయం ఆసన్నమయిందని అన్నారు. మానవ అభివృద్ధి సూచికల స్థాయిని నిర్ణయించటం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో మార్పును తీసుకొనిరావలసిన అవసరం ఉన్నదని సి.పి.జోషి అన్నారు. గ్రామాలను సామాజికంగా, ఆర్థికంగా శక్తివంతం చేయటం కోసం త్వరలో జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషను (నేషనల్ రూరల్ లైవ్‌లీ హుడ్ మిషన్) ను ప్రవేశపెడుతున్నట్లు తెలియచేసారు.

పంచాయతీరాజ్ సంస్థలకు అధికారాల బదలాయింపులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కేరళ, కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, సిక్కిం రాష్ట్రాలకు పంచాయతీల సాధికార జవాబుదారీ ప్రోత్సాహక బహుమతులను ఈ సందర్భంగా ప్రధాని అందచేసారు. 2010 సంవత్సరపు పంచాయతీరాజ్ నివేదికను కూడా ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మాత్యులు బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాలనుండి విచ్చేసిన పంచాయతీరాజ్ ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రులు కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎ.ఎన్.పి.సిన్హా మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**సేకరణ : డా.వి.శివశంకర ప్రసాద్,**

**జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డు**



SthanikaPalanaTel_May_2010_Black&White.pm6 4/29/2010, 3:02 PM

**తమ్ముడు పదిరోజులుగా బాధపడుతున్నాడు. రక్తహీనత వల్ల నానాటికీ కృశిస్తున్నాడు. పలుమార్లు విరేచనాలవుతున్నాయి. వ్యాధి మరింత తీవ్రమైంది. తమ్ముని బాధ చూస్తూ నిస్సహాయుడై నిల్చున్నాడు అన్న. పెద్ద వైద్యం చేయించేందుకు డబ్బులు లేనివాడా బాలుడి తండ్రి, అందరూ చూస్తుండగా తమ్ముడు శాశ్వతంగా కన్ను మూశాడు.**

భయంకరమైన ఈ వ్యాధిని నిర్మూలించాలి. అందుకు మందు కనిపెట్టాలి. తనే డాక్టర్ కావాలని నిశ్చయించుకొన్నాడు అన్న. ఆ బాలుడే నిరంతర కఠోర పరిశ్రమ, పరిశోధన వల్ల గొప్ప వైద్య శాస్త్రవేత్తగా ప్రపంచ ప్రజల మన్ననలందుకొన్న డాక్టర్ యల్లా ప్రగడ సుబ్బారావు.

సుబ్బారావు జులై 1, 1896న రాజమండ్రిలో జన్మించాడు. తండ్రి తాలూకా ఆఫీసులో గుమాస్తా. బీద కుటుంబం. బాల్యంలోనే తండ్రిని కోల్పోయారు. చిన్నతనం నుండి దైవ చింతన, సత్య నిష్ఠ

# వైద్య రంగంలో ధృవతార



## మన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు

కలవారు. సుబ్బారావుకు శ్రీరామ కృష్ణ పరమ హంస, వివేకానందులు ఆరాధ్య పురుషులు. బాలుని ప్రతిభను గుర్తించిన మద్రాసులోని రామకృష్ణ మఠం వారు మద్రాసు మెడికల్ కాలేజీలో చదివించారు. పట్టభద్రులైనారు. విద్యార్థి వేతనం లభించినందున చదువు బాగా సాగింది. ఉపనిషత్తులు, బైబిల్, ఖురాన్ బాగా చదివారు.

విద్యార్థి వేతనం లభించినందున లండన్ వెళ్ళి మెడిసిన్ డిప్లొమా అందుకొన్నారు. 1923లో మల్లాది సత్యలింగం నాయకర్ ధర్మ సంస్థ సహాయంతో అమెరికా వెళ్ళారు. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్ సంస్థలో లైబ్రేరియన్‌గా చేరారు. జీవ రసాయన శాస్త్రంలో అభిరుచి పెరగటంతో, డాక్టర్ ఓటో ఫొలిన్ అనే ఆచార్యుని నేతృత్వంలో పరిశోధన సాగించి. పి.హెచ్.డి. పట్టా పొందారు. విరామం దొరికినపుడల్లా వైద్యశాలలో ఆర్డర్లీగా పనిచేస్తూ తన చదువుకు కావలసిన పైకం సంపాదించుకొనేవారు.

తన తమ్ముని బలిగొన్న 'స్ప్రూ' వ్యాధిని నిర్మూలించటానికి, తగిన మందులను సాధించటానికి కంకణం కట్టుకొన్నారు. ఆయన అవిశ్రాంత పరిశోధనాసక్తిని గమనించిన, సియానమిడ్ వైద్య బృందం నాయకులుగా ఫోలిక్ ఆమ్లం నిజ స్వరూపాన్ని కనుగొన్నారు సుబ్బారావు. 1945 జూలై 20న ఫోలిక్ ఆమ్లం నుండి బంగారు వన్నె భస్మాన్ని తయారు చేశారు. ఆ పొడి 'స్ప్రూ' వ్యాధి, మైక్రోసైటిక్ అనీమియా- రక్త హీనత వల్ల కలిగే వ్యాధి నిర్మూలనకు అద్భుతమైన మందుగా నిర్ణయంపబడింది. తన తమ్ముని ప్రాణాన్ని హరించిన వ్యాధిని ప్రపంచం నుండి పార దోలగించానన్న సంతృప్తి లభించింది.

ప్రపంచమండలి రక్తశాస్త్రవేత్తలలో అగ్రగణ్యులుగా మన్నన లందుకొన్నారు. లెడర్లి సంస్థ డైరెక్టర్‌గా నియమింపబడ్డారు. ఒక భారతీయునికి ఆ కాలంలో అంత గొప్ప పదవి లభించడం అపూర్వం!

క్షయ రోగ నివారణి యగు బిసోనికాట్, నికానిట్, హైడ్రాజైడ్ మందులను కనుగొన్నారు బోదకాలు, టైఫాయిడ్, పాండురోగం మొదలగు వ్యాధులను సమూలంగా నిర్మూలింపగల మందులను కనుగొన్నారు.

విద్యార్థుల పట్ల ఎంతో ప్రేమగల వారు. ఎందరో బీద విద్యార్థులకు ఆర్థికంగా సహకరించారు. విశ్రాంతి లేకుండా పరిశోధనలు సాగించిన సుబ్బారావు ఆరోగ్యం దెబ్బతింది. ఒక్కో మారు 36 గంటల పాటు నిద్రాహారాలు లేక పరిశోధనలో నిమగ్నులయ్యేవారు.

ఆయనలోని మానవుడు ఆయన కంటే గొప్పవాడై వెలిగాడు. తనతో పాటు పరిశోధన సాగిస్తున్న ఒక యువ పరిశోధకురాలు క్షయ వ్యాధితో శానిటోరియంలో చేరింది. ఆమె చికిత్స కోసం తమ వేతనం నుండి ఆర్థిక సహాయం నెలనెలా 6 సంవత్సరాల పాటు పంపారు. ఏ రోగి కూడా తాను అనాథనని భావింపరాదనే వారాయన.

"నేను పుట్టుకతో ఏమీ పట్టుకు రాలేదు. చనిపోయేటపుడు ఏమీ తీసుకెళ్ళను. నా ఆదాయ వ్యయాలు, నా జీవనోపాధికి తగినంత వుంటే చాలు" అనే ఉదార హృదయులు సుబ్బారావు.

సుబ్బారావు నైష్ఠిక బ్రహ్మచారి. క్రిస్మస్ నాడు ఎందరో పేదలకు ఉదారంగా కానుకలిచ్చేవారు. విజ్ఞాన శాస్త్రవేత్త అయిన సుబ్బారావు ప్రగాఢమైన దైవభక్తి కలవాడు. వేకువనే లేచి దైవ ప్రార్థన చేయనిదే ఏ పనీ ప్రారంభించేవారు కాదు. తనను ప్రోత్సహించిన శ్రీరామకృష్ణ మఠం పురోగతికి విరాళాలు అందజేసేవారు.

1948లో అమెరికా అతనికి పౌర సత్యమిచ్చింది. లెడర్లి వైద్య పరిశోధనా కేంద్ర ముఖద్వారం దాటిన తర్వాత, పెద్ద కాంస్య పతకంపై, డా.యల్లాప్రగడ సుబ్బారావు, ప్రముఖ పరిశోధకులు, విద్యావేత్త, తత్వవేత్త, దయామయుడు, లెడర్లి పరిశోధనా సంస్థ డైరెక్టర్ అన్న వాక్యాలు అందరినీ ఆకర్షిస్తాయి. సోదర ప్రజానీకం రోగ విముక్తులు కావాలన్న తపనతో రేయింబవళ్ళు పరిశోధనలు చేసిన ఉదాత్త గుణనిధి డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు.

ఎందరినో కాపాడిన సుబ్బారావు కరోనరిత్రాంబసిస్ వ్యాధితో 1948 ఆగస్టు 9న అమెరికాలో తుదిశ్వాస వదిలారు.

భారతీయుడైన సుబ్బారావు పట్ల గౌరవ సూచకంగా, ముంబైలోని బల్సార్‌లో నిర్మించిన తమ ప్రయోగశాలకు. 'డాక్టర్ యల్లా ప్రగడ సుబ్బారావు సంస్థ' అని నామకరణం చేసింది అమెరికాకు చెందిన లెడర్లి సంస్థ. ఆయన మానవాళి కందించిన వైద్య విధానాలు చిరకాలం జీవించి వుంటాయి.

*- జానమద్ది హనుమచ్ఛాస్త్రి*

# శ్రమైవ జయతే

మానవ జీవితంలో అతి భయంకరమైన శత్రువు సోమరితనం. సర్వకాల సర్వావస్థలలో మన అభివృద్ధిని అడ్డుకోవాలని శత్రువు ఎలా చూస్తుంటాడో అలాగే సోమరితనం కూడా. మనిషి కష్టాన్నే నమ్ముకోవాలి. కష్టజీవి ఎన్నటికీ పతనం కాడు. మనిషి శ్రమించడానికి మూలకారణం కోరిక. కోరికలుండడం సహజమే కాదు. అభివృద్ధికి అవసరం కూడా. అయితే ఆ కోరికలు కోరికలుగానే ఉంటే, మానవ ప్రయత్నం లోపిస్తే అభివృద్ధి జరగదు, 'ఉద్యమేన హి సిద్ధ్యంతి కార్యాణి నమనోరథైః' అన్నారు పెద్దలు. ఒక పని జరగాలంటే దానికి కావలసినది కష్టపడాలన్న తపనగానీ, కోరిక కాదు. ఆకలి తీరాలంటే సింహమైనప్పటికీ, వళ్ళు వంచి వేటకు వెళ్ళవల్సిందే. అడవికి రాజుకదా అని జంతువులు వాటంతట అవే వచ్చి సింహం నోట్లో పడవుకదా! అంటే కష్టపడడం అనేది ఎంతవారికైనా తప్పదు. ఆ కష్టం వారి వారి స్థాయిని బట్టి ఉంటుంది. ఫలితం కూడా కష్టాన్ని బట్టే ఉంటుంది. రాజు కష్టం రాజుదైతే, బంటుకష్టం బంటుది. ఇక్కడ ఒకరిని చూసి ఇంకొకరు అసూయచెందడం వల్ల ప్రయోజనం లేకపోగా, చెయ్యవలసిన పని సక్రమంగా చెయ్యలేక నష్టం కూడా వస్తుంది. కోరికలకు అనుగుణంగా కష్టం ఫలించని నాడు ఆ కోరికలు ఉన్నా వ్యర్థమే. అందువల్ల వాటిని త్యజించడమే మంచిది.

తన ప్రయత్నం తాను చేయని సోమరిపోతు ఇంట చిటికెనవేలుకొన కూడా మోపని లక్ష్మీదేవి, కష్టజీవి కండలు చిందే స్వేదబిందువుల్లో సైతం నిలిచి వుంటుంది. నిరంతరం చైతన్యంతో సాగిపోయే చీమల బారులు సైతం సముద్రాన్ని అవలీలగా దాటగలవు. కానీ మనోవేగంతో సమానంగా ప్రయాణం చేయగల గరుత్మంతుడైనా సరే కదలకుండా కూర్చుంటే ఒక అంగుళం కూడా ముందుకు వెళ్ళలేడు. సోమరిని లోకం నిలదీస్తుంది. శ్రమజీవి వడిపోకుండా నహాయంతో నిలబెడుతుంది. అలాగే సోమరితనం అనారోగ్యాన్నిస్తే, శ్రమజీవితం ఆరోగ్యాన్నిస్తుంది. ఆరోగ్యంవల్ల మనోవికాసం, సృజనాత్మకత లభిస్తాయి. ఇవి వ్యక్తి సమష్టినించి వేరుచేసి ప్రత్యేకంగా నిలబెడతాయి. నిత్యం కష్టపడడం, మనసుపెట్టి పనిచేయడం అనే రెండు నేత్రాలు కల ఏ పనైనా సత్ఫలితాన్ని ఖచ్చితంగా చూస్తుంది. ఆ కార్యాన్ని ఏకాగ్రతతో సాధించే కార్యసాధకుడే కార్మికుడు. కార్మికుల చేతిరేఖలలోనే దేశ భవిష్యత్ రేఖ ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ పనిలో నైపుణ్యం ఉన్న కార్మికులయితే, అప్పుడు శ్రమలో ఉండే సౌందర్యం అందరికీ బోధపడుతుంది.

**ఒక్క మాటలో చెప్పాలంటే**

శ్రమించే ప్రతివాడూ శ్రామికుడే. శ్రమకు కొలమానం లేదు. శ్రామికుడి స్వేదానికి సరివిలువ వేరొకటి లేదు. ఇప్పుడు లోకానికి కష్టపడే కండలే కావాలి. నిత్యం శ్రమించే వారి చూపుడు వేళ్ళే ఆనందమయ లోకానికి దారులు చూపుతాయి. శ్రమను ధైర్యంగా భావించి శ్రమిస్తే, శ్రమలోనే నిస్వార్థంగా జీవిస్తే ఆ శ్రమ మనల్ని ఎన్నటికీ రక్షిస్తుంది. శ్రమదే నిత్య విజయం. శ్రమముందు దుర్మార్గాలు, కుతంత్రాలు, అలసత్వం, స్వార్థ ప్రయోజనాలు దూదిపిందెల్లా తేలిపోతాయి. మహాబలవంతుడైన రావణాసురుణ్ణి సైతం శ్రీరాముడు శ్రమ అనే ఆయుధంతోనే హతమార్చాడు. నిలకడలేని వానరుల శక్తిని సంఘటితం చేశాడు. శ్రమనే బండరాళ్ళుగా పేర్చి విజయానికి వారధికట్టాడు. అందుకే ఆ శ్రమశక్తి ముందు దానవులు, అదృశ్యశక్తులూ నిలువలేక పోయాయి.




కష్టం ఇష్టంగా మారి విధుల్ని ఆనందంగా నిర్వర్తిస్తే ఫలితం మనకోసమే ఎదురు చూస్తుంటుంది. త్రికరణశుద్ధిగా పనిని దైవంలా భావించి శ్రమించడంలో ఉన్న ఆనందం, సౌందర్యం అనుభవైక వేద్యం. ఇలా మనం పడే కష్టమంతా మనకోసమే కాక ఎంతో కొంత ఇతరులకు చెందే విధంగా ఉంటే మంచిది. అలాగే నేడు మన శ్రమ తత్కాల ఫలితాన్నే కాక, శాశ్వత ప్రయోజనం కోసం ఉపయోగపడే విధంగా ఉంటే ఇంకా మంచిది. ఎందుకంటే ప్రతిఒక్కరూ కష్టపడేది కేవలం నేటి సుఖం కోసం మాత్రమే కాదు రేపటికోసం. వర్షాకాల సుఖం కోసం తక్కిన కాలాల్లోనూ, రాత్రి సుఖం కోసం పగటి సమయంలోనూ, వార్ధక్యం కోసం యవ్వనంల్లోనూ శ్రమిస్తాం. భవిష్యత్ దీపాల్ని శ్రమ అనే చమురుతో వెలిగించుకోవాలని ఆశిస్తాం. ఎందరో మహానుభావులు రేపటికోసం ఆలోచించబట్టే వారి కష్టానికి పూసిన స్వాతంత్ర్యాన్ని నేడు మనం అనుభవిస్తున్నాం. ఒక శాశ్వత ప్రయోజనాన్ని కోరే శ్రమకు తగిన గుర్తింపు, ఫలితం ఖచ్చితంగా ఉంటాయి. అందుకోసం మనం చిందించే ప్రతి స్వేద బిందువూ మన కీర్తిఫలకంపై అక్షరమవుతుంది. శ్రమించడానికి సౌకర్యాలు అవసరం లేదు. సంకల్పం ముఖ్యం. పట్టుదల, ఊపిరి, ప్రయత్నం, శరీరం, శ్రమ, ఆత్మ, ఇవన్నీ కలిస్తే ఏర్పడే రూపమే కార్మికుడు. సుఖదుఃఖాల్ని గానీ, కష్టనష్టాల్ని కానీ లెక్కించకుండా శ్రమతో అభిషేకం చేయించుకొనే కర్మసామ్రాజ్యానికి అతనే యువరాజు. కాలాన్ని కష్టంతో కలిపికట్టి కీర్తికాంక్షనీ, ధనవ్యామోహాన్ని, మృత్యుభయాన్ని అదిలిస్తూ సోమరితనం సరిహద్దుల్ని దాటే నిత్య చైతన్య స్వరూపుడు. అలా కర్మలో జీవించే కార్మికుడే అభివృద్ధి దారుల్ని చూపే మార్గదర్శి.

**- డా॥ అద్దంకి శ్రీనివాస్**



**శ్రమజీవికి జగమంతా లక్ష్మీనివాసం**




SthanikaPalanaTel_May_2010_Black&White.pm 4/29/2010, 3:02 PM

# పేదవడిన జానపద గాయకులు

# 'పిచ్చుక గుంట్లు'

**భిక్షాటనయే వృత్తిగా జీవనయాత్ర సాగిస్తున్న జానపద గాయకులు 'పిచ్చుక గుంట్లు". శతాబ్దాలుగా పాటనే నమ్ముకుని, ఆ పాట కోసమే జీవిస్తూ అనువంశికంగా తమ కుటుంబ సభ్యులకు ఆ 'పాట'ను పాథేయంగా అందిస్తూ జానపద గీత పరిమళాలను తెలుగునాట వ్యాపింపజేస్తున్న పిచ్చుకగుంట్లు కూచిపూడి భాగవతులలాగా తమ పూర్వ సంప్రదాయాలను తూచా తప్పకుండా పాటించే శైవులు. శ్రీశైల మల్లికార్జునుడు వీరి ఆరాధ్యదైవం జంగాలను వీరు గురువులుగా భావిస్తారు. వీరి ఇళ్ళల్లో జంగాలే పౌరోహిత్యం చేస్తారు. జంగాలను పోలిన వారే పిచ్చుకగుంట్లు. భిక్షుకుంట్లు, పిచ్చుకగుంట్లు, పిచ్చగుంట్లు, పిచ్చకుంట్లు అని వీరిని వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలో 'పిచ్చుక గుంట్లు' నివసిస్తున్నారు. అయితే తెలంగాణా జిల్లాలలోనే వీరి సంఖ్య ఎక్కువగా కన్పిస్తున్నది.**



### పిచ్చుకగుంట్లు - కథా కమామీషు

పిచ్చుకగుంట్లు ప్రస్తావన పాల్కురికి సోమనాథుని పండితాచార్య చరిత్రంలో ఉంది.

*'మాకు వీవంగ చేతులు లేవయ్య నడిచి*
*పోవంగ కాళ్ళును లేవయ్య, అంధ*
*కులమయ్య పిచ్చుకగుంటులమయ్య'*

అన్న ద్విపదను బట్టి వీరు పాల్కురికి కాలమున వికలాంగులుగా నున్నట్టు తెలుస్తున్నది. 'భిక్షుక' శబ్దమే 'పిచ్చుక' గా మారినట్టు సుప్రసిద్ధ పరిశోధకులు ఆచార్య బిరుదరాజు రామరాజు గారు అభిప్రాయపడ్డారు. 'కుంటి బిచ్చగాండ్రు' పాటలు పాడుతూ పొట్టపోసుకున్నారనీ, రాను రాను వారే పిచ్చుకగుంట్లనే వృత్తిగాయకులుగా పరిణమించారని వారన్నారు.



మొదట 'కాపులను' మాత్రమే స్తుతిస్తూ గీతాలు పాడి వారిని యాచించి జీవించే పిచ్చుకగుంట్లు తరువాత కాలంలో 'గొల్ల' వారిని అడుక్కునేవారు. కాపులలో, గొల్లలలో చరిత్ర పురుషుల వీరగాథలను పాడుతూ వారి నాశ్రయించి బ్రతికిన ఈ జానపద గాయకులు రానురాను కాల వైపరీత్య ఫలితంగా సమాజంలో అన్ని కులాల వారి ఇళ్ళ ముందు పాటలు పాడుతూ యాచనకు దిగారు. నాటి నుండి నేటి దాకా వీరు తమకబ్బిన 'పాట'తోనే బ్రతుకు సాగిస్తున్నారు.

### పిచ్చుకగుంట్ల 'పుట్టుక' - పుక్కిటి పురాణం

పూర్వం త్రిమూర్తుల పెండ్లి సమయంలో వారి గోత్రనామాలు చెప్పేందుకు ఓ మనిషి కావలిసివస్తే వారు ఓ మట్టి బొమ్మను చేసి ప్రాణం పోసి అందుకు నియోగించారట. బొమ్మ చేసేప్పుడు ఓ కాలు కుంటిగా చేశారట. వారే పిచ్చుకగుంట్లు అయ్యారని ఒక కథ. పూర్వం ఏడుగురు గొల్ల స్త్రీలు సంతానం కోసం శివుని గూర్చి తపస్సు చేశారు. శివుడు అనుగ్రహించాడు. ఏడుగురు గర్భవతులై ఏడుగురు బిడ్డలను కన్నారు. శివుని ఆజ్ఞ ప్రకారం ఆ ఏడుగురు కన్యలను ఓ కుంటివానికిచ్చి పెండ్లి చేశారు. పరమేశ్వరుడా కుంటివానికి శంఖం, గంట ఎద్దు, త్రిశూలం (గజాశూలం) ఇచ్చి బిచ్చమెత్తుకొని జీవించమని వరమిచ్చాడు. కుంటివాడా ఎద్దునెక్కి శూలధారియై శంఖమూదుతూ గంట మోగిస్తూ బిచ్చమెత్తుకొని జీవించాడు. వాని సంతానమే పిచ్చుకగుంట్లు అన్నది రెండో కథ.

పిచ్చుకగుంట్లే తమ వృత్తాంతాన్ని తెలిపేందుకు ఈ కథలను చెబుతారు. ఇవి కేవలం కల్పనా కథలు మాత్రమే. కాపులను, గొల్లలను అడుగుకొని జీవించిన వారైనందున వీరు ఆ కులాల సంతానం కావచ్చునని ఊహించడం సరికాదు.

### పిచ్చుకగుంట్లు - జాతిభేదాలు

పిచ్చుకగుంట్లలో ఏడు జాతులున్నాయి. గొల్ల, తెలగ, గంట, తురక, తొగరు, మంద, తిత్తి అనేవి. వీరిలో తొగరు, పిచ్చికగుంట్లు మిగిలిన ఆరుజాతులకన్నా తక్కువ వారిగా చూడబడతారు. గంట, తిత్తి అనే జాతులు వారుపయోగించే సాధనాలను బట్టి ఏర్పడ్డాయి. ఈ ఏడు

జాతుల మధ్య వియ్యపు పొత్తు లేదు. ఏ జాతివారు ఆ జాతితోనే సంబంధ బాంధవ్యాలు నెరపుతారు. మొదట్లో ఒక జాతి మరో జాతి వారి అన్నం తినకపోయేవారట. కాని ఇప్పుడు అన్నం తినడాన్ని తప్పుగా భావించడంలేదని పిచ్చుకుంట్ల ఎల్లయ్య అనే వయోవృద్ధుడు చెప్పాడు. పిచ్చుకగుంట్లు గోత్రనామాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. గంటెడు వారు, బండారువారు, సింగంవారు, సిడం వారు అంటు గలవారు. వీరి ఇంటిపేర్లూ ఆలోచింపజేసేవిగా ఉంటాయి. అవి తాళ్ళవారు, గండసరివారు, కుంకుల వారు, బాణం వారు, పోపలవారు. కులాచారాల పాలనలో 'పట్టు' కలవారు. 'విడుపు' అన్నది వీరి నిఘంటువులో కన్పించదు.




### పిచ్చుకగుంట్లు - పూజించే దేవతలు

వీరి ఆరాధ్యదైవం శ్రీశైల మల్లికార్జునడని ముందే తెలుసుకున్నాం. పోచమ్మ, ఎల్లమ్మ, మల్లమ్మ మొదలైన దేవతలను కూడా వీరు పూజిస్తారు. వారు నివసించే ప్రాంతాల సమీపక్షేత్రాలను కూడా వీరు దర్శించి ఆ దైవాలను పూజిస్తారు. నల్లగొండ జిల్లాలోని శ్రీ యాదగిరి నరసింహస్వామి, వరంగల్ జిల్లా పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వరస్వామి, కొడవటూరులోని శ్రీ సిద్దేశ్వరస్వామి మొదలైన దేవుళ్ళను కూడా వీరు పూజిస్తారు.

### అంతరించిన దురాచారం

పూర్వం 'పిచ్చుక గుంట్లు' మల్లన్న, రాజరాజేశ్వరీదేవీ, ఎల్లమ్మ దేవతల పేర్లపై కన్యలను 'జన్నె'కు విడిచేవారట. కాని ఇప్పుడా ఆచారం అంతరించింది. నాగరిక సమాజాన్ని చూస్తున్న ఈ జాతుల వారు 'జన్నె'కు విడిచే దురాచారాన్ని ఏనాడో నిర్మూలించామని ఆ కుటుంబాల వారు చెప్తున్నారు.

### పిచ్చుకగుంట్లు కథాగానం

తెలుగువారినింతగా తన గానమాధుర్యంతో ఆకట్టుకునే పిచ్చుకగుంట్లు శారదక్రాండు, వీరముష్టులకన్నా ప్రతిభగల కళాకారులని వారి ప్రదర్శన చూసినవారికి తెలుస్తుంది. కాపుల, గొల్లవాళ్ళ గోత్రనామాలను గొంతెత్తి చేసే రాగాలాపనం ఓ ప్రత్యేక శైలీ విన్యాసం. హృదమైన ప్రదర్శనం, లక్ష్మమ్మ, కామమ్మ, బాలనాగమ్మ, సరోజనమ్మ, రాములమ్మ, సోమనాద్రి, సదాశివరెడ్డి, చింతలపురి రామిరెడ్డి, సర్వాయి పాపన్న మొదలైన కథలనూ శ్రావ్యంగా గానం చేసే నైపుణ్యం పిచ్చుకగుంట్లకు అబ్బిన అపురూపమైన కళ. సాంఘిక జానపద గాథల్నే కాక 'హరిశ్చంద్ర' వంటి పౌరాణిక కథా గీతాలను కూడా వీరు పాడతారు. రాయలసీమ పిచ్చుకగుంట్లు కుంటి మల్లారెడ్డి కథను, గుంటూరు పిచ్చుకగుంట్లు పల్నాటి వీరచరిత్రను గానం చేస్తారు.

### కర్ణాటకలో 'హెళవరు'లు

పిచ్చుకగుంట్లు కర్ణాటక రాష్ట్రంలో కూడా ఉన్నారు. వీరు పాటలు పాడి పొట్ట పోసుకుంటున్నారు. వీరిని కన్నడంలో 'హెళవరు' అని పిలుస్తారు. కన్నడంలో కూడా తెలుగులో వలెనే 'హెళవరు' వంశావళిని గానం చేస్తారు. కన్నడదేశంలో స్థిరపడ్డ పిచ్చుకగుంట్లలో ఎద్దుకుంట్లు, గంటుకుంట్లు, చాపకుంట్లుగా పిలువబడుతున్నారు. వీరు కూడా తెలంగాణాలోని పిచ్చుకగుంట్లు వలెనే తమ వంశం గూర్చిన కుంటి కథలను చిత్రచిత్రమైన రీతుల్లో చెబుతారు. 63 జాతుల ప్రాచీన వృత్తాంతాల్ని కన్నడ పిచ్చుకగుంట్లు 'హెళవరు'గా చెప్తారు. తిరుపతి తిమ్మప్ప కథను, కరిభంటిని కథను కన్నడ పిచ్చుకగుంట్లు శ్రావ్యంగా వినిపిస్తారు.

### కుటుంబ సభ్యులు - ఇతర వృత్తులూ

ఈ కుటుంబాలలోని స్త్రీలు చాపలల్లుతారు. ఈనాడు కాల ప్రభావం వల్ల వ్యవసాయ పనులకు అంటే కలుపు, కోత మొదలైన పనులకో వెడుతున్నారు. మగవారు చేపలు పట్టడం, కుందేళ్ళను వేటాడడం, పందులను పెంచడం వంటి పనులను చేస్తుంటారు. కొందరు వనమూలికల రహస్యాలు తెలిసినవారు ప్రధానంగా వృద్ధులు వైద్యం చేస్తారు. కడుపునొప్పితో పాటు, చర్మవ్యాధులనూ నయం చేస్తారు.

అన్ని జానపద కుటుంబాలలో వచ్చిన ఆర్థిక సామాజిక మార్పులు పిచ్చుక గుంట్ల జీవన విధానంలో కూడా వచ్చాయి. గతంలోవలె రెడ్లనో, కాపులనో, గొల్లలనో ఆశ్రయించి వారి గోత్రనామాలను, వంశావళిని గానం చేసి పొట్టపోసుకునే పరిస్థితి వారికి ఈనాడు లేదు.

వీధుల్లో పడ్డాయి వారి జీవితాలు. ఆస్తులు ఏ మాత్రం లేవు. ఉండడానికి కనీసం ఇల్లు కూడా లేని పరిస్థితి మరీ దయనీయంగా కన్పిస్తున్నది. దొరికిన చోట చిన్న చిన్న గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. ఆకలి, పేదరికం కుంగదీస్తున్నాయి. వారిని చిరకాలంగా పోషించిన కళ ఈనాడు పట్టెడన్నం పెట్టని గడ్డు పరిస్థితులలో ఉంది.

అయినా ఊరూరా తిరుగుతూ తమ చిరకాల ఉపాధి అయిన 'పాట'నే పాడుతూ భిక్షాటనం చేస్తున్న జానపద గాయకులు పిచ్చుకగుంట్లు. వారి వర్తమాన జీవితాన్ని గురించి కళాభిజ్ఞులు యోచించవలసిన తరుణం ఇది. జానపద కళలు అంతరించిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న ఈ సమయంలో పిచ్చుకగుంట్లపైనా, వారి సంప్రదాయ కళపైనా అనుకున్నంతగా దృష్టిని కేంద్రీకరించకపోవడం విచారకరం.

- ఎ.ఎమ్. ఫీచర్స్

రాష్ట్ర మంత్రి వర్గం ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్య అధ్యక్షతన ఏప్రిల్ 7, 2010 నాడు సచివాలయంలో సమావేశమై పలు ప్రధాన నిర్ణయాలు తీసుకున్నది.

వాటిలో ముఖ్యమైనవి - రాష్ట్రమంతటికీ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పేదలకు ఎంతగానో ఉపయోగపడే 2010, ఆంధ్రప్రదేశ్ వడ్డీ వ్యాపారుల బిల్లు ముసాయిదా ఆమోదం, వ్యవసాయకంగా ముందంజలో ఉన్న కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం ఓడరేవు అభివృద్ధి కోసం ప్రధాన ప్రమోటర్‌ను మార్చడం వంటివి ఉన్నాయి.

- ఆంధ్రప్రదేశ్ మాంస అభివృద్ధి సంస్థ స్థానంలో ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య ఏర్పాటు ప్రతిపాదన ఆమోదం.
- వ్యవసాయంతో పాటు, పారిశ్రామికంగా అభివృద్ధికి దోహదపడే మచిలీపట్నం పోర్టు అభివృద్ధికి లీడ్ ప్రమోటర్‌ను మార్చి, సవరించిన రాయితీ ఒప్పందం ప్రతిపాదన ఆమోదం. తీవ్ర ఆర్థిక సంక్షోభం వల్ల లీడ్ ప్రమోటర్‌గా ఉన్న మేటాస్ సంస్థ ఈ ప్రాజెక్టును కొనసాగించలేక పోయింది. అడ్వకేట్ జనరల్ న్యాయ సలహాపై నవయుగ ఇంజనీరింగ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవాలని మంత్రి వర్గం నిర్ణయించింది.

# ప్రజా సంక్షేమానికి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు

### మంత్రివర్గ ప్రధాన నిర్ణయాల్లోని ముఖ్యాంశాలు

పేదలను, ముఖ్యంగా గ్రామీణ పేదలను వడ్డీ వ్యాపారులు ఇబ్బందుల పాలు చేయకుండా, కట్టడి చేసేందుకు వీలు కల్పించే" ఆంధ్రప్రదేశ్ మనీ లెండర్స్ బిల్లు, 2010" ముసాయిదా ఆమోదం.

- చట్టంగా రూపొందిన తరువాత రిజిస్టర్ కాని వ్యాపారులు అప్పులు ఇవ్వరాదు. ప్రతి వ్యాపారి నగదు, ఖాతా పుస్తకాలు నిర్వహించాలి.
- వ్యాపారులు గరిష్టంగా ఎంత వడ్డీ వసూలు చేయాలన్నది ఎప్పటికప్పుడు ప్రభుత్వం ప్రకటిస్తుంది.
- వడ్డీ వ్యాపారులతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని అప్పులు ఇచ్చేవారు ఈ చట్టం పరిధిలోకి వస్తారు.
- ఎరువులు, క్రిమి సంహారక మందులు అప్పుగా ఇచ్చి, వడ్డీ రాబట్టే వారికి కూడా ఈ చట్టం వర్తిస్తుంది.
- గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ మండలం కోనంకి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూలు ఏర్పాటుకు ఉచితంగా 4.24 ఎకరాలు భూమి కేటాయింపు ప్రతిపాదన ఆమోదం.




- ఇటీవల కాలంలో రాష్ట్రంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. ట్రాఫిక్, రోడ్డు భద్రత వంటి పలు సమస్యలు తీవ్రతరమవుతున్నాయి. ఈ అంశాలు పరిష్కార దిశగా కొన్ని రకాలైన మోటారు వాహనాలపై పన్ను పెంచేందుకు వీలు కల్పించే ఆర్డినెన్స్‌ను తిరిగి జారీ చేసే ప్రతిపాదన ఆమోదం.
- రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రజోపయోగ కార్యకలాపాల కోసం భూమి కేటాయింపు ప్రతిపాదనలను మంత్రి వర్గం ఆమోదించింది.
- గుంటూరు జిల్లా పిడుగురాళ్ళ మండలం కోనంకి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూలు ఏర్పాటు కోసం ఉచితంగా 4.24 ఎకరాల భూమి.
- అనంతపురం జిల్లాలోని ఐదు గ్రామాల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల ఏర్పాటు కోసం 11.38 ఎకరాలు భూమి ఉచితంగా కేటాయింపు.

ఆ గ్రామాలు- కదిరి, ఎన్.పి. కుంట, వేరుగుంట, నల్లమడ, ఎల్లనూరు.

- కృష్ణాజిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో కళ్యాణ మంటప నిర్మాణానికి 11 సెంట్ల భూమి కేటాయింపు.
- విశాఖపట్నంలోని ఇండో- జర్మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ టెక్నాలజీ సంస్థకు నిర్మించి ఉన్న భవనంతో సహా 5.28 ఎకరాల భూమి కేటాయింపు, ఈ సంస్థ నానో టెక్నాలజీ, ప్రెసిషన్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో శిక్షణ, కన్సల్టెన్సీ, మౌలిక నదుపాయాలు, మాన్యుఫాక్చరింగ్ వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ఇంతే కాకుండా పలు ప్రజోపయోగ కార్యక్రమాలకు అవసరమైన భూముల కేటాయింపును, ఉద్యోగ నియామకాలను మంత్రివర్గం ఆమోదించింది.

**- అదపాక సత్యరావు**

అదనపు సంచాలకులు, సమాచార, పౌరసంబంధాల శాఖ



SthanikaPalanaTel_May_2010_Black&White.pm11 4/29/2010, 3:02 PM

# "గ్రామీణ నిరుద్యోగ యువతకు ఆసరా ఇజిఎంఎం"

"ఉద్యోగ కల్పన మరియు మార్కెటింగ్ మిషన్" గ్రామీణ పేద యువతకు ఉద్యోగాలు కల్పించే ప్రత్యేక లక్ష్యంతో ఏర్పడింది. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెంది సాంఘికంగా, మరియు ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ యువతకోసం ఈ మిషన్ పని చేస్తుంది.ఇజిఎంఎం అంటే ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్.

**ఇజిఎంఎం కార్యనిర్వాహక వర్గం:** గౌరవనీయ గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

గ్రామీణ, పట్టణ నగర ప్రాంతాలలో ఉపాధి అవకాశాన్ని కల్పించడానికి, వ్యూహరచనకు, శిక్షణా సంస్థలు నెలకొల్పటం కోసం ప్రైవేటు రంగంలో ఇజిఎంఎం భాగస్వామ్యం ఏర్పరచుకొని కలిసి పని చేస్తుంది. జిల్లాయందు ప్రైవేటు రంగ సంస్థలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్, ఇందిరా క్రాంతి పథం - జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ భాగస్వాములుగా వ్యవహరిస్తారు.

**దార్శనికత :** గ్రామీణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి గ్రామంలోని ప్రతి పేద గృహంలో కనీసం ఒకరికి ఉద్యోగం కల్పించడం.

**ధ్యేయం :** మార్కెట్ అవసరాలకు అనుగుణంగా గ్రామీణ యువతకు శిక్షణ ద్వారా "ఉపాధిని, ఉద్యోగతను" పెంపొందించి సాంఘికంగా, ఆర్థికంగా వారి స్థితి గతులను మెరుగు పరచడం

**లక్ష్యం :** మానవ వనరులు ఉపయోగించుకొనడం, వారి శక్తిని, వారి ఆలోచనలకు పదును పెట్టడం EGMM లక్ష్యం. గ్రామీణ యువతకు ఆసరాగా నిలిచి ఒకటిన్నర లక్షల మంది గ్రామీణా యువతకు ఉపాధి కల్పించడం.

**ఇజిఎంఎం స్వయంగా చేపట్టిన శిక్షణలు :** సెక్యూరిటి, ఇంగ్లీష్ సాఫ్ట్‌స్కిల్, కంప్యూటర్ అకాడమీ.

**ఇజిఎంఎం ఇతర సంస్థల భాగస్వామ్యంతో చేపట్టిన శిక్షణలు**

- సెక్యూరిటి : G4 సెక్యూరిటీస్
- సేవలు : డా॥ రెడ్డి ఫౌండేషన్ లాబ్స్, సిఎమ్‌సిటాలీ,
- నిర్మాణం : ఎన్ఏసి / సిఐడిసి
- టెక్స్‌టైల్స్ : ఐఎల్ ది ఎఫ్.ఎస్ / చెన్నయ్, బెంగుళూర్‌లకు చెందిన ప్రముఖ టెక్స్‌టైల్స్

### ప్రోత్సాహకులు / భాగస్వాములు

గుంటూరు స్పిన్నింగ్ మొదలగు టెక్స్‌టైల్స్ ఫ్యాక్టరీవారు, రిలయన్స్, కేఫ్ కాఫీడే, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, విప్రో, హిందుస్థాన్‌లివర్, మెల్ డోనాల్డ్, ఎయిర్‌టెల్, డోకోమా,ఐడియా, టాటా సెల్యూలర్, ఫ్లేవర్ ఐస్‌క్రీమ్, హిటాచి, పిజ్జాహట్, తాజ్‌స్లా మొదలగు సంస్థలు ప్రోత్సహిస్తున్నాయి.

### "పైలెట్ ప్రాజెక్టు"గా ఉంగుటూరి నియోజక వర్గంతో

'ప్రతి ఇంటా చిరు నవ్వులు చిందాలి" అని ఆశించిన స్వర్గీయ ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖర రెడ్డి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మాత్యులు, గౌరవనీయులు శ్రీ వట్టి వసంతకుమార్ ఆలోచనలతో పేద కుటుంబాలకు ఆర్థికంగా భద్రత కల్పించాలని, బడుగు బలహీన వర్గాలకు స్థిరమైన ఆదాయం కల్పించాలని, వారిని నిరంతర కృషిలో భాగంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించే వివిధ పథకాలతో పాటు ప్రతి ఇంటికి ఒక "ఉద్యోగాన్ని" కల్పించడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని కల్పించి ఆయా కుటుంబాలను సుస్థిరంగా పేదరికం నుంచి బయటకు తీసుకుని రావాలని ఆశయంలలో భాగంగా ప్రప్రథమంగా ఉంగుటూరు నియోజక వర్గంలోని నిరుద్యోగ గ్రామీణ యువతీ యువకులకు అర్హతలు, సామర్థ్యానికి తగినట్లుగా వివిధ ప్రైవేట్ ప్రముఖ సంస్థలతో సంప్రదించి వారి ద్వారా భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలలో "జాబ్ మేళా" కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి వాణీ ప్రసాద్, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ ఎమ్.జితేంద్ర ఆధ్వర్యంలో ఆయా మండలాల అధికారుల నిర్వహణలో ముందుగా గ్రామీణ నిరుద్యోగ యువత సర్వే పటిష్టవంతంగా నిర్వహించడం జరిగింది.

నిరుద్యోగ ఇందిరా క్రాంతి పథం మహిళలు, యువతీ యువకుల సర్వే నిర్వహించటం జరిగింది. 5200 మంది ఈ సర్వేలో నమోదు చేయించుకోవటం జరిగింది. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు , గణపవరం మండలాలలో వివిధ కార్పొరేట్ సంస్థల వారు గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు కార్పొరేట్ స్థాయిలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. కౌన్సిలింగ్ కార్యక్రమం తదుపరి 2 రోజులలో శిక్షణ ఇవ్వడం జరిగింది.

గ్రామీణ యువతీ యువకులకు వివిధ స్థాయిలలో వ్యక్తిత్వం వికాసానికి దోహదపడే శిక్షణ ఇచ్చి ఎయిర్‌టెల్, వివిధ హోటల్స్, రిలయన్స్, మోర్ మొదలగు సూపర్ మార్కెట్స్, విజయ ఎలక్ట్రానిక్ మొదలగు సంస్థలలో జీతంతో పాటు నివాసం, భోజన సదుపాయాలలో గ్రామీణ యువతీ యువకులకు 1150 మంది వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది.

"సూయింగ్ మిషన్ ఆపరేటర్స్, ఓవర్‌లాక్, కటింగ్ మాస్టర్ల శిక్షణా కార్యక్రమాన్ని భీమడోలు మండలంలో నిర్వహించి తదుపరి 22మంది యువతులకు బెంగుళూరు లోని "సాహి ఎక్స్ పోర్ట్స్" నందు, 26 మంది యువతులకు బెస్ట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఆర్ ఆర్ డి టెక్స్‌టైల్స్, కుందం ధర్మవరం నందు ఉద్యోగ అవకాశాలు లభించటం జరిగినది.

"BPO వాళ్ళనందు 50 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగింది. ఉంగుటూరు నియోజక వర్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ యువతకు ఆసరాగా నిల్చింది. ఈ జాబ్‌మేళా కార్యక్రమం విజయవంతమై నిరుద్యోగులకు ఆశా కిరణమైంది.

**- కె. కోటేశ్వరరావు, ఎమ్.ఏ, బి.ఇడి**

ఎమ్.పి.డి.ఓ. భీమడోల్ మండల్, వరంగల్ జిల్లా



SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 4/29/2010, 3:02 PM

# గిడ్డంగి వారి పల్లె ఆదర్శ మహిళా గ్రామ పంచాయతీ

"గ్రామాలకు సేవ చేయడం స్వరాజ్యాన్ని (స్వయంపాలన) పాలించటమే" "కేంద్రంలో ఇరవై మంది కూర్చొని శాసించే పద్ధతి సిసలైన ప్రజాస్వామ్యం కాదు, ప్రతి గ్రామంలోని ప్రజలు దిగువ స్థాయి నుంచి నడిపేదే ప్రజాస్వామ్యం". – మహాత్మాగాంధీ

"మహిళలను ఎక్కడ గౌరవిస్తారో అక్కడ సకల సంపదలకు నిలయం". పై వ్యాక్యాలను నిజం చేస్తున్న ఆదర్శ గ్రామపంచాయతీ, స్వర్గీయ రాజీవ్ గాంధీ కలలను నిజంచేస్తూ ఆయన ఆశించిన పంచాయతీల ద్వారా 'ప్రజలకు అధికారం' లక్ష్యాన్ని సాధించిన గ్రామపంచాయతీ, "భారత దేశంలోని ప్రతి గ్రామంలో స్వపరిపాలనా సంస్థలలో ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యాలు స్థాపింపబడాలి". అని గాంధీజి విశ్వసించిన విధంగా ఎంతో ఆదర్శవంతంగా గ్రామపంచాయతీల వ్యవస్థకు జీవం పోస్తున్న గ్రామపంచాయతీ గిడ్డంగి వారి పల్లె. ప్రజలందరూ అధికారంలో పాలుపంచుకోవడాన్నే ప్రజాస్వామ్యం అంటారు. ఒకరి అభిప్రాయాలు వేరొకరు గౌరవించడం, ఒకరి కోసం అందరు, అందరికోసం ఒకరు అనే భావన ప్రజాస్వామ్యానికి మూల సూత్రం.

కడప జిల్లా వేంపల్లె మండలంలోని గిడ్డంగి వారివల్లె గ్రామపంచాయతీ చుట్టూ అందమైన ప్రకృతి నడుమ, కొండలతో మమేకమై ఒదిగిఉంది. గ్రామంచుట్టూ అందమైన అరటి తోటలు, చీనీ తోటలు ఉన్నాయి. గ్రామంలోని అన్ని వర్గాలవారు, ఉన్నత విద్యావంతులు, ఇప్పటికీ ఎందరో ఉన్నత పదవులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామం అంతా విద్యానిలయం.

గొడవలు, కక్షలు, అసూయాద్వేషాలు, అనేవి ఈ గ్రామంలో లేనే లేవు. అందరూ వివేక వంతులు, విద్యావంతులు, చైతన్యవంతులు. అన్ని విషయాలలో ఒక్కటిగా వుండి తమ గ్రామ అభివృద్ధిని ఆకాక్షించేవారు. అందుకు తమ గ్రామం దేశంలోనే ఆదర్శగ్రామంగా పేరు గడించాలి అనుకొని ఎక్కడా లేని విధంగా గ్రామపంచాయితీ పాలకవర్గం అంతా మహిళలే. అదికూడా వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. సర్పంచ్, వార్డు సభ్యులు అందరూ విద్యావంతులు, మొట్టమొదటి సారిగా ప్రత్యక్ష ఎన్నికలలో పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికై ప్రభుత్వ నగదు పురష్కారాన్ని, ప్రశంశ పత్రము అందుకున్నారు.

గ్రామ ముఖద్వారం ఎంతో అందంగా, హుందాగా నిర్మింపబడినది. గ్రామంలోని అన్ని రహదారులు చక్కని సిమెంటు రహదారులు. ప్రతివీధికి వీధిదీపాలు ఉన్నాయి. ప్రతీ ఇంటికి మంచినీటి సౌకర్యం ఉంది. గ్రామంలో గల ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందిస్తున్నారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగు దొడ్డి ఉంది. ప్రజలు ఎక్కడ బహిరంగ మలవిసర్జన చేయరు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్ వాడి కేంద్రాలు ఉన్నాయి..

గ్రామంలోని ప్రత్యేకతలు ఏమంటే గ్రామస్ఫూర్తిని కలిగించే వాక్యాలు ప్రతి ఇంటి ముందర రాసిఉంటాయి. అంతేగాక ప్రతి వీధికి పారిశుధ్య కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. వీటిని ఆయా వీధుల్లో వున్న మహిళా స్వయం సంఘం వారు నిర్వహిస్తున్నారు.

గ్రామం మధ్య వేపచెట్టు ఉంటుంది. దాని చుట్టూ అరుగు, గ్రామదేవత కూడ ప్రతిష్టింపబడినది. దానినే గ్రామ ప్రజలు గ్రామచావడిగా ఉపయోగిస్తున్నారు. సాయంత్రం వేళలలో గ్రామంలోని పెద్దలు తరచూ అక్కడ సమావేశాలు జరుపుతూ వుంటారు.

గ్రామపంచాయతీకి పక్కా భవనము ఉంది. గ్రామసభ గ్రామపంచాయతీ సర్వసభ్య సమావేశాలు, ప్రత్యేక సమావేశాలు, గ్రామపంచాయతీ పాలకవర్గం, ప్రజలు అంతా పంచాయతీ కార్యాలయములో సమావేశమై గ్రామ అభివృద్ధికి తగు సలహాలు, సూచనలు ఇస్తారు. సర్పంచ్, వార్డు సభ్యులు ఎ ఎంఆర్ - అపార్డ్ వారు నిర్వహించే ప్రతి శిక్షణా కార్యక్రమానికి తప్పకుండా మండల కార్యాలయము నందు హాజరై ఎంతో పరిణతి చెంది తమ గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు సిద్దంచేసి అమలు చేశారు. గ్రామ అభివృద్ధికి గ్రామంలోని ప్రజలు ఆమోదంతో కొన్ని కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. అవి

- **గ్రామ పారిశుధ్య నిర్వహణ కమిటీ**
- **రక్షిత మంచినీటి నిర్వహణ కమిటీ**
- **వీది దీపాల నిర్వహణ కమిటీ**

ఈ కమిటీల ఆధ్వర్యంలో గ్రామం ఎంతో అభివృద్ధి దిశలో పయనిస్తున్నది. ఇప్పటికే రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ అవార్డులు అయిన శుభ్రం, నిర్మల్ గ్రామ పురస్కారాలను కూడా గ్రామీణ అందుకున్నది.

గ్రామంలో ఏ కార్యక్రమం జరపాలన్నా గ్రామస్తులందరూ ఐక్యంతో, సభ్యతతో మెలగడం విశేషం. గ్రామంలో మొత్తం 210 కుటుంబాలు 600 మంది జనాభా కలిగివుంది. ఇక్కడ అరటి, చీని తోటల పెంపకం ఎక్కువ. ఇక్కడి నుండి అరటి విదేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నది. పాడిపశువులు, గొర్రెలు, మేకల పెంపకము కూడా ఉంది. గ్రామం అంతా ఉన్నత విద్యావంతులు. విదేశాలలో కూడా ఈ గ్రామస్తులు ఉన్నారు. ఈ గ్రామంలోని ఉన్నత విద్యావంతులు ఇప్పటికే అనేక రంగాలలో పేరుగాంచినారు. వారిలో ముఖ్యులు ప్రొఫెసరు. యం.రామసుబ్బారెడ్డి, ఐ.ఐ.టి, ఛైర్మన్, డా. యం. రామ సుబ్బారెడ్డి, వై.వి.యూనివర్సిటీ మొదలగువారు.

గ్రామ అభివృద్ధికి గ్రామ స్వరంచ్ శ్రీమతి యం. రాధిక, వార్డు సభ్యులు అందరూ ఎంతో పాటుపడుతున్నారు.

**పాలకవర్గం:** సర్పంచ్ - రాదిక, ఉప సర్పంచ్ - రాజేశ్వరి

**వార్డు సభ్యులు:** కృష్ణవేణి, బాల ఓబులమ్మ, బాల బయమ్మ, మహేశ్వరి, షేక్ పక్రున్ బీ, రమాదేవి

**గ్రామ పారిశుధ్య కమిటీ:** టి. ఆది లక్షమ్మ, జి. వెంకట లక్ష్మమ్మ, జి. వెంకట కృష్ణారెడ్డి, జి. వెంకట శివారెడ్డి, ఓ సుదర్శన్ రెడ్డి, కె. చిన్న దొడ్డప్ప

**రక్షిణ మంచినీటి నిర్వహణ కమిటీ:** యం. రఘునాధ రెడ్డి, యస్. సాహిబ్, జి. సాంబశివ, జె. మల్లికార్జున, జి. మధుసూదన్

**వీధి దీపాల నిర్వహణ కమిటీ:** యం. బ్రహ్మానంద రెడ్డి

**ముగింపు:**

గ్రామ పంచాయతీ అంతా ఒకటిగా వుండి తమ సమస్యలను అందరూ కలిసి పరిష్కరించుకొని గ్రామ అభివృద్ధికి బాట వేసినారు. అందుకే ఆ గ్రామం రాష్ట్ర ప్రభుత్వం నుండి శుభ్రం అవార్డును, కేంద్ర ప్రభుత్వం నుండి నిర్మల్ గ్రామ పురస్కారం సత్కారాన్ని అందుకొన్నది.

ఇక్కడి ప్రజలు సమైక్య జీవన ప్రవంతికి సంకేతంగా భారతీయ సంస్కృతికి ప్రతీకగా గ్రామాలు దేశానికి పట్టు గొమ్మలు అనే నానుడికి అర్ధం వచ్చేలా ఆదర్శంగా జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి స్ఫూర్తిని గ్రహించి ఎన్నో గ్రామాలు అభివృద్ధికి బాటలు వేయాలి, గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అపుడే గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుంది.

– **ఏ.వి. సురేష్ కుమార్,** జిల్లా శిక్షణా అధికారి జిల్లా పరిషత్ శిక్షణా విభాగం, కడప



SthanikaPalanaTel_May_2010_Black&White.pm6 4/29/2010, 3:02 PM



# అటవీ హక్కుల పునరుద్ధరణకు తోడ్పడే విప్లవాత్మక చట్టం ఇది

షెడ్యూల్డు తెగల అటవీ హక్కుల చట్టాన్ని 2005 డిసెంబర్ 13వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తరువాత ఏడాదిపాటు సుదీర్ఘ బహిరంగ చర్చ జరిగింది. దరిమిలా షెడ్యూల్డు తెగలు, ఇతర పరంపరాగత అటవీ నివాసితుల (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం-2006గా 18 డిసెంబర్ 2006లో పార్లమెంట్ ఆమోదం పొందింది. భారత రాష్ట్రపతి అదే ఏడాది డిసెంబర్ 29న ఆమోదం తెలపడంతో ఈ చట్టం అమల్లోకి వచ్చింది. దేశంలో అడవుల పరిరక్షణతో పాటు, సంప్రదాయ అటవీ నివాసితుల హక్కుల పునరుద్ధరణకు ఇది దోహదం చేస్తుంది. వలస పాలనలోనే కాక స్వాతంత్ర్యానంతరం కూడా ఈ హక్కులను పట్టించుకున్నవారు లేదు. ఆ సమయంలో అటవీ నివాసితుల్లో తీవ్ర అసంతృప్తి రేకెత్తింది. దేశంలోని అడవుల్లో, ఆ పరిసర ప్రాంతాల్లో నివసించే గిరిజనుల అభివృద్ధి గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ బాధ్యత. అటవీహక్కుల గుర్తింపుతో పాటు అటవీ నివాసితుల జీవనోపాధికి అవసరమైన విలువైన అటవీ వనరుల సమర్థ నిర్వహణకు పంచాయితీరాజ్ వ్యవస్థలో కీలకమైన గ్రామసభ విధానాన్ని ఈ చట్టం ఏర్పాటు చేసింది.

గ్రామంలోని పెద్దలంతా ఈ సభలో సభ్యులుగా ఉంటారు. మహిళలకు కూడా సభ్యత్వ అవకాశం కలుగుతుంది. ఈ సభల్లో వారు నిరాటంకంగా పాల్గొనవచ్చు. (ఒకవేళ పంచాయితీలు లేని రాష్ట్రాలలో పదాలు / తోలాలు ఇతర సంప్రదాయ గ్రామవ్యవస్థలు, ఎన్నికైన కమిటీలు, గ్రామకమిటీలు అని అర్థం)

అటవీ సంరక్షకులు, గిరిజన హక్కుల ఉద్యమకారులు అటవీ భూహక్కులపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించిన నేపథ్యంలో ప్రతిపాదిత చట్టం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ బిల్లు ఆమోదం పొందే ముందు మంత్రుల బృందం అనుమతి, పార్లమెంటరీ సంయుక్త సంఘం అంగీకారం పొందవలసి ఉంది. దీనిపై సుదీర్ఘ చర్చలు, రాజకీయ జోక్యాలకు, అధికారి గణం/అధికారిక సంబంధమైన మెలికలు, గిరిజనులు, సంరక్షక వర్గాల లాబీయింగ్‌కు తెరదించుతూ 2008 జనవరి ఒకటో తేదీన ఈ చట్టాన్ని ఆమోదించారు.

గిరిజనులు అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తూ అటవీ భూములు సాగుచేసుకుంటూ వంటచెరకు, తేనె, చెట్లబెరళ్ళు, ఆకులు, పండ్లు తదితర కలపేతర అటవీ ఉత్పత్తులు సేకరించుకుంటున్నారు. వారితోపాటు గిరిజనేతరులు కూడా అడవుల్లో ఆవాసాలు ఏర్పరచుకుని జీవనం కోసం అడవులపైనే పూర్తిగా ఆధారపడి ఉన్నారు. ప్రకటిత (నోటిఫైడ్) అడవుల్లోని గ్రామాల్లో అటవీపనుల కోసం కూలీలను నియమించి వారికి గృహవసతి కల్పించడమే ఇందుకు ఉదాహరణ. ఈ అటవీ నివాసితులు అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నా, వారికి తమ హక్కులకు సంబంధించి న్యాయపరమైన ఎలాంటి పత్రాలు లేవు. మరోవంక అటవీభూముల్లో ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడం దురాక్రమణలు, చట్టవిరుద్ధంగా స్వాధీనం చేసుకోవడంతో సమానమని అటవీశాఖ పేర్కొంది. అటవీ నివాసితుల సంప్రదాయ హక్కులకు, వాటికి చట్టపరమైన గుర్తింపు లేకపోవడానికి మధ్య కొనసాగుతున్న వైరుధ్యాలను సరిదిద్దాలన్నది ప్రస్తుత చట్టం లక్ష్యం. అందుకోసం గిరిజన. గిరిజనేతరులు అడవులు, అటవీ ప్రాంతాలపై ఆధారపడినంతకాలం ఇరువర్గాలను సమానంగా పరిగణిస్తుంది.

ఈ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం అటవీ నివాసితులకు సంబంధించిన అటవీ హక్కులు అన్నిటినీ గుర్తించి వారికి సంక్రమింప చేసింది. భూములను కలిగి ఉండే హక్కు వ్యక్తిగతంగా కాని, సామాజికంగా కానీ అడవుల్లో నివసించే హక్కు వసతి, స్వయం సేద్యం, యాజమాన్య/సేకరణ హక్కు, కలపేతర ఉత్పత్తుల వినియోగం, విక్రయం, అటవీ భూముల పట్టా/లీజ్‌లు/గ్రాంట్లను టైటిళ్ళుగా మార్చుకోవడం, పునరావాసం హక్కు, అటవీ గ్రామాలను రెవెన్యూ గ్రామాలుగా మార్చుకోవడం, అటవీ ప్రాంతాల నుంచి ఖాళీ చేయిస్తే తగిన పునరావాసం కల్పన సహా సామాజిక హక్కులను ఈ చట్టం కల్పిస్తుంది. అటవీ వనరులు, జీవవైవిధ్యం, మేధోసంపత్తి హక్కు, జీవవైవిధ్యానికి సంబంధించిన సంప్రదాయ విజ్ఞానం/సంస్కృతీ సామాజిక పరిరక్షణ, పునరుజ్జీవనం, సంరక్షణ, నిర్వహణలను అటవీ నివాసితులకు, గ్రామసభలకు దాఖలు పరిచింది. సామాజిక అటవీవనరులు సక్రమంగా వినియోగమయ్యేందుకు, వన్యప్రాణులు/అడవులు/జీవవైవిధ్యానికి విఘాతం కలుగకుండా



**- మణిశంకర్ అయ్యర్**

కేంద్ర పంచాయితీరాజ్ శాఖామంత్రి



SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 14 4/29/2010, 3:02 PM

చూసేందుకు ఈ చట్టం గ్రామసభలకు అధికారాన్నిచ్చింది. ఈ చట్టం అమలులోకి రాకపూర్వం అడవుల నుంచి అక్రమ తొలగింపునకు గురైనా లేదా తగిన పునరావాసం చూపకపోయినా ఖాళీ చేసి వెళ్ళినవారు కూడా ఈ చట్టం క్రింద తగిన పునరావాసానికి అర్హులు. ప్రత్యామ్నాయ భూమి కేటాయింపులోనే పునరావాసం కూడా ఇమిడి ఉంటుంది. పాఠశాలలు, ఆస్పత్రి, అంగన్‌వాడీలు, చౌకధరల దుకాణాలు, విద్యుత్ టెలికమ్యూనికేషన్ లైన్‌లు, మంచినీటి సరఫరా, గొట్టపు మార్గాలు, వర్షపునీటి నిల్వ కట్టడాలు, వృత్తివిద్యా శిక్షణాకేంద్రాలు, సామాజిక కేంద్రాలు, రహదారులు తదితర సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం అటవీభూములు మళ్ళించవచ్చు. అయితే ఇలాంటి అభివృద్ధి పనులు ఆయా గ్రామసభల అనుమతితోనే జరగవలసి ఉంది. ఈ విధంగా ఈ చట్టం అటవీ హక్కులు ఇవ్వడమే కాక అటవీ ప్రాంతాలలో వ్యక్తిగతంగా, సామాజికంగా గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన విధానాన్ని రూపొందించింది.

అటవీహక్కుల నమోదు, వాటి గుర్తింపు, సంక్రమిత ప్రక్రియ కోసం ఈ చట్టం సవివరమైన ప్రణాళిక రూపొందించింది. సంప్రదాయ గ్రామీణ వ్యవస్థలో మహా గ్రామసభలు ఏర్పాటు చేసింది. గ్రామంలోని పెద్దలంతా అందులో సభ్యులుగా ఉంటారు. మహిళలు కూడా పూర్తి స్వేచ్ఛగా భాగస్వాములు కావచ్చు. అటవీ హక్కుల గుర్తింపులో వారు కీలకపాత్ర వహిస్తారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్ డివిజన్ స్థాయి కమిటీలు (ఎస్‌డిఎల్‌సి), జిల్లా స్థాయి కమిటీలు (డిఎల్‌సి), రాష్ట్ర స్థాయి కమిటీలను నియమిస్తాయి. సబ్ డివిజనల్ అధికారి ఎస్‌డిఎల్‌సికి అధ్యక్షుడుగా వ్యవహరిస్తారు. బ్లాక్ లేదా తహసీల్ స్థాయి పంచాయతీల నుంచి ముగ్గురు సభ్యులను జిల్లా స్థాయి పంచాయతీ నియమిస్తుంది. అటవీ, గిరిజన సంక్షేమ శాఖల నుంచి అధికారులను నియమించాలి. అలాగే, జిల్లా స్థాయి కమిటీకి జిల్లా కలెక్టర్ అధ్యక్షుడుగా ఉంటారు. జిల్లా పంచాయతీకి చెందిన ముగ్గురు సభ్యులుగా ఉంటారు. వారిలో కనీసం ఇద్దరు అటవీ నివాసితులు, మరొకరు మహిళా సభ్యురాలు ఉండాలి. అటవీ, గిరిజన సంక్షేమ శాఖల నుంచి అధికారులను నియమిస్తారు.

క్లెయిమ్‌ల పరిష్కార తుది నివేదికను డిఎల్‌సి ఆమోదించినప్పటికీ, ప్రక్రియ పంచాయతీరాజ్ వ్యవస్థలో పంచాయతీదే కీలకభూమిక. ఈ చట్టం ప్రకారం గ్రామసభలు తమ తమ పరిధిలోని వ్యక్తిగత, సామాజిక అటవీ హక్కులను అజమాయిషీ చేస్తాయి. అందుకోసం గ్రామపంచాయతీలు గ్రామసభలు నిర్వహించి 10-15 మంది సభ్యులతో అటవీహక్కుల కమిటీని ఎన్నుకోవాలి. గ్రామసభలు క్లెయిమ్‌లు స్వీకరిస్తాయి. దరఖాస్తులు స్వీకరించడానికి అటవీ హక్కుల సంఘానికి అధికారాన్నిస్తుంది. కనీసం రెండు సాక్ష్యాధారాలతో స్వీకరించిన క్లెయిమ్‌లను వాటిని స్వీకరించిన తేదీ నుంచి మూడు నెలల్లో పరిష్కరించవలసి ఉంది. అటవీ హక్కులను గుర్తించి, భూములు సంక్రమింప చేసేందుకు ఈ చట్టం 13వ నిబంధనలో కొన్ని సాక్ష్యాధారాలను పేర్కొన్నది. బహిరంగ పత్రం/పబ్లిక్ దస్తావేజు (పబ్లిక్ డాక్యుమెంట్), ప్రభుత్వ రికార్డులు, ఉపగ్రహ చిత్రాలు, నిర్వాహక ప్రణాళికలు (వర్కింగ్ ప్లాన్‌లు), ఇతర అటవీ రికార్డులు, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్‌కార్డు, పాస్‌పోర్టు, ఇంటిపన్ను రసీదులు, ఇల్లు, గుడిసె, భూ సంబంధిత శాశ్వత అభివృద్ధి పనులు, పవిత్ర క్షేత్రాలు వంటి కట్టడాలు, శ్మశానవాటికలు, న్యాయస్థానాల తీర్పులు, ఉత్తర్వుల వంటి న్యాయ సంబంధిత రికార్డులు మున్నగు వాటిని సాక్ష్యాధారాలుగా వినియోగించుకోవచ్చు. గ్రామసభలు తయారుచేయాలి. అటవీహక్కుల కమిటీ తన ప్రక్రియను పూర్తి చేసిన తరువాత గ్రామసభ ముందస్తు ప్రకటన ద్వారా సమావేశమై ప్రతి క్లెయిమ్ పైనా తీర్మానాన్ని ఆమోదించి, వాటిని సబ్ డివిజనల్ స్థాయి కమిటీకి పంపాలి. సామాజిక అటవీ వనరులపై విశ్లేషణకు గ్రామసభ ఒక తేదీని నిర్ణయించి, పరిసర గ్రామసభలకు, సబ్ డివిజనల్ స్థాయి కమిటీలకు ఈసమాచారాన్ని తెలియచేస్తుంది. అటవీ హక్కులపై క్లెయిమ్‌ల విషయంలో పొరుగు గ్రామాల మధ్య అభిప్రాయ భేదాలు ఉంటే సబ్ డివిజనల్ స్థాయి కమిటీకి పంపాలి. ప్రతిపాదిత చట్టంలోని సెక్షన్ 4(2)లోని నిబంధన (ఇ) కింద జాతీయ పార్కులు, అభయారణ్యాల ప్రాంతాల్లోని వారికి పునరావాసం, పునరావాస ప్యాకేజీలను పరిశీలిస్తుంది. చట్టంలోని సెక్షన్ 5లోని అంశాలను అమలు చేసేందుకు గ్రామసభలు వన్యప్రాణి, అటవీ జీవవైవిధ్యం పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు చేస్తారు. గ్రామసభల తీర్మానాలకు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులపై సబ్ డివిజనల్ స్థాయి కమిటీ వివరణలు పరిగణనలోకి తీసుకుని, అర్జీదారులను విచారించి తీర్మానాన్ని ఆమోదించి సబ్ డివిజనల్ స్థాయి కమిటీకి పంపుతుంది.

అటవీభూముల గుర్తింపు, తనిఖీ ప్రక్రియ కోసం గ్రామసభలు ఏర్పాటు చేసే అటవీహక్కుల కమిటీలు గ్రామసభల ఆయుధంగా పనిచేయాలి. నిర్ణీత ఫారంలో తగిన సాక్ష్యాధారాలతో సమర్పించిన క్లెయిమ్‌లు స్వీకరించి, వాటికి రసీదులు ఇవ్వడం, క్లెయిమ్‌లకు సంబంధించిన సాక్ష్యాలు, మ్యాప్‌లు సహా రికార్డులు రూపొందించడం వంటి ప్రధాన బాధ్యతలు నిర్వహించవలసి ఉంటుంది. ఇందుకోసం అర్జీదారునికి, అటవీ శాఖకు ముందస్తు సమాచారం అందజేసి, క్లెయిమ్‌కు సంబంధించిన ప్రాంతాలు/స్థలాలను సందర్శించి సాక్ష్యాలు సేకరించి, నమోదు చేయవలసి ఉంది. సంచారజీవులు, పశుపోషకుల నుంచి అందే అర్జీలను స్టేక్ హోల్డర్ల సమక్షంలో పరిశీలించాలి. ఆదిమ గిరిజనులు, పశుపోషకులు, సంచార గిరిజనజాతులకు చెందనివారు పెట్టుకున్న అర్జీలను తనిఖీ చేసి సరిహద్దులతో మ్యాప్ తయారుచేసి, వాటిని నమోదుచేసి గ్రామసభకు పంపాలి. సామాజిక అటవీహక్కులకు సంబంధించి గ్రామసభ తరపున క్లెయిమ్‌లు తయారుచేసి, దానిపై పొరుగు గ్రామంతో సమస్య ఎదురైతే సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించుకోవాలి.

గ్రామసభల విధులు సక్రమంగా నెరవేరేందుకు సబ్ డివిజనల్ స్థాయి కమిటీ ప్రధాన భూమిక పోషిస్తుంది. అందులో భాగంగా అటవీ, రెవెన్యూ శాఖల మ్యాప్‌లు, ఓటర్ల జాబితాలను గ్రామసభ/అటవీహక్కుల కమిటీకి అందచేస్తుంది. ఈ చట్టంలోను, నిబంధనలలోను పొందుపరచిన లక్ష్యాలు, కార్యవిధానాల గురించి అటవీ ప్రాంతవాసులలో అవగాహన కలిగిస్తుంది. అర్జీదారులకు


SthanikaPalanaTel_May_2010_Black&White.pm6 4/29/2010, 3:02 PM

(వ్యక్తిగతంగా కానీ, సామూహికంగా కానీ) క్లెయిమ్ నమూనాలను ఉచితంగా అందచేస్తుంది. కావలసిన కోరంతో స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంతంగా గ్రామసభల సమావేశాలను నిర్వహించుకోవచ్చు. తనిఖీ కార్యక్రమం పూర్తయిన తరువాత సంబంధిత గ్రామసభల నుంచి తీర్మానాలను సేకరించి, గ్రామసభలు సమకూర్చిన మ్యాప్‌లు, వివరాలను ఏకీకరించి, గ్రామసభల తీర్మానాలను, మ్యాప్‌లను పరిశీలిస్తుంది. అటవీహక్కుల స్వభావం, విస్తీర్ణానికి సంబంధించి గ్రామసభల తీర్మానాల వల్ల నష్టపోయినట్లు భావించే వారి ఫిర్యాదులు సహా రాష్ట్ర స్థాయి ఏజెన్సీల పిటిషన్‌లను కూడా ఇది విచారిస్తుంది. అంతర్ సబ్ డివిజన్‌ల క్లెయిమ్‌ల విషయంలో ఇతర సబ్ డివిజినల్  స్థాయి కమిటీలను అవసరాన్ని బట్టి సమన్వయపరుస్తుంది. ప్రతిపాదిత అటవీహక్కులపై బ్లాక్, తహసీల్ వారీ ప్రతిపాదనల ముసాయిదాతో కలిపి తుది నిర్ణయం కోసం జిల్లా స్థాయి కమిటీకి పంపుతుంది. గ్రామసభల తీర్మానాలకు వ్యతిరేకంగా దాఖలయ్యే ఏవైనా పిటిషన్‌లను ఇది స్వీకరిస్తుంది. వాటి విచారణకు ఒక తేదీని నిర్ణయించి రాతపూర్వక నోటీసులను బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేస్తుంది. వాటిపై సముచిత ఆదేశాలు ఇచ్చేటప్పుడు గ్రామసభల తీర్మానాలను పరిగణనలోకి తీసుకుంటుంది. గ్రామసభలకు వాటి విధి విధానాల గురించి తెలియచెప్పడంతో పాటు వన్యమృగ, వన, జీవవైవిధ్యం, వృక్షజంతుజాలం పరిరక్షణపై అటవీ హక్కుల అర్జీదారులకు, ఇతరులకు అవగాహన కలిగిస్తుంది. జిల్లాస్థాయి కమిటీ, అటవీ, రెవెన్యూ మ్యాప్‌లను, ఓటర్ల జాబితాలను గ్రామసభ/ అటవీ హక్కుల కమిటీలకు అందచేస్తుంది. ప్రత్యేకించి అదిమ గిరిజనులు, పశుపోషకులు, సంచార గిరిజన జాతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని చట్టంలోని లక్ష్యాల మేరకు అన్ని క్లెయింలను పరిశీలిస్తుంది. సబ్ డివిజనల్ స్థాయి కమిటీ రూపొందించిన అటవీ హక్కుల రికార్డులను పరిశీలించి క్లెయింలపై తుది నిర్ణయం తీసుకుంటుంది. సబ్ డివిజనల్ స్థాయి కమిటీ ఉత్తర్వుల వల్ల అన్యాయం కలగలేదని భావించే వారి పిటిషన్‌లను ఇది విచారిస్తుంది. అంతర్‌జిల్లా క్లెయింలకు సంబంధించి సమన్వయపరుస్తూ, అటవీ హక్కులను ప్రభుత్వ రికార్డుల్లో చేర్చేలా ఆదేశాలు ఇస్తుంది. అటవీహక్కులకు సంబంధించి తుది నివేదికను ప్రచురించి ఒక ప్రతిని అర్జీదారునికి, మరోటి గ్రామసభకు అందచేస్తుంది. ఈ చట్టంలోని అంశాల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

ఈ అంశానికి ఉన్న ప్రాధాన్యం, అవసరం, దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది అటవీ నివాసితులపై పడే ప్రభావం దృష్ట్యా ఈ చట్టం అమలును వేగవంతం చేయాలని ప్రధానమంత్రి ఈ ఏడాది జనవరిలో అన్ని రాష్ట్రాల ముఖ్య మంత్రులకు పిలుపునిచ్చారు. ఈ చట్టం, అందులోని నిబంధనలు అందరికి బాగా తెలియ చెప్పాలని, అప్పుడే దీని అమలులో పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి సూచనల మేరకు దేశవ్యాప్తంగా నిర్ణీత రోజున గ్రామసభలు నిర్వహించి ఈ చట్టం అమలులో కీలకపాత్ర పోషించే గ్రామసభలు, పంచాయతీలకు చట్టంలోని అంశాలను తెలియచెప్పాలని పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ఎన్నికలు లేని రాష్ట్రాలు ఆ దిశలో ముందడుగు వేశాయి.

గిరిజన, గిరిజనేతరులకు సంబంధించిన అటవీ హక్కులను గుర్తించడంలో ఈ చట్టం అద్భుతమైన అవకాశాన్ని ఇచ్చింది. ఈ హక్కులు అన్ని రకాల అడవులకు వర్తిస్తాయి. సామాజిక అవసరాలకు కావలసిన అటవీ భూమి కేటాయింపునకు ఈ చట్టం అవకాశం కల్పించింది. ఒకసారి భూమి ఇచ్చిన తరువాత దానిని సవరించే వీలు లేకుండా ఈ చట్టం కఠినతరమైన నిబంధనలు చేసింది. ఒకవేళ సవరణలు చేయాలనుకుంటే, బహిరంగంగా సలహా సంప్రదింపుల ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు తగిన ఆవాసాలు కల్పించాలి.

అటవీహక్కుల గుర్తింపులో గ్రామసభలు, పంచాయతీల రాజ్యంగబద్ధ ఆదేశాలకు, రాష్ట్రప్రభుత్వ కార్యనిర్వాహక యంత్రాంగం సహాయ సహకారాల మధ్య సమతౌల్యం పాటించవలసి వుంది. భూమి కోసం ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా భూమిలేనిచోట ఇది మరింత ఎక్కువ. గిరిజనుల హక్కులు, ఇతర సామాజికవర్గాల మధ్య వివాదాలతో నిరుపయోగంగా పడి ఉన్న భూముల పరిరక్షణకు చట్టాలు ఉన్నాయి. అటవీహక్కుల గుర్తింపులో క్లిష్టమైన పాత్ర వహిస్తున్న గ్రామసభలు తమ బాధ్యతను మరింత సమర్థంగా నిర్వహించేందుకు సామర్థ్యాన్ని పెంచుకోవలసి ఉంది. అంతేకాక, ఒకసారి గుర్తింపు పొందిన హక్కులు ఇంకోసారి ధారాదత్తం జరిగితే అటవీ నివాసితుల జీవితాలు దుర్భరమై పరిస్థితి మొదటికి వస్తుంది. ఈ పరిస్థితి నివారణకు సామర్థ్యం పెంపు ఉపకరిస్తుంది. శతాబ్దానికి పైగా, అటవీ ప్రాంతాల పరిరక్షణ బాధ్యతలను ప్రభుత్వం భుజాలకెత్తుకుంది. అందుకు అవసరమైన చట్టాన్ని తెచ్చింది.

వన్యప్రాణుల సంరక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ బాధ్యతలను గ్రామసభలకు, హక్కుదారులకు అప్పగించింది. దీంతోపాటు, స్వార్థపరత్వంతో, దురాకర్షణతో సులభ ద్రవ్యం కోసం అటవీ వనరులను విధ్వంసం చేసేవారి బండారం బయటపెట్టే అవకాశాన్ని ఈ చట్టం కల్పించింది. విలువైన జీవవైవిధ్యం, అమూల్యమైన పరిసరాలు, సహజఅడవులు మన దేశానికే కాక మొత్తం మానవజాతికే ముఖ్యసంపద. సామాజిక వనురుల సమర్థ నిర్వహణకు అటవీ హక్కుల గుర్తింపులో గ్రామసభలకు ప్రధాన బాధ్యతలు అప్పగించింది. సామాజిక ముఖ్య అవసరాలకు అటవీ భూములను కనీసస్థాయిలో బదలాయించే అవకాశం కల్పించింది. మైలురాయిగా చెప్పదగిన ఈ చట్టం ప్రజాస్వామిక సంస్థలైన గ్రామసభలు, పంచాయితీరాజ్ సంస్థ (పిఆర్‌ఐ)ల ప్రాధాన్యం, శక్తిని గుర్తించింది. ఈ అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించగలగడం గ్రామసభలకు మాత్రమే సాధ్యమనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికార యంత్రాంగం, సంబంధిత విభాగాల సహాయ సహకారాలు, రాజకీయ సంకల్పంతో ఈ చారిత్రక అవకాశాన్ని వినియోగించుకుంటూ ప్రగతి సాధించడంలో గ్రామసభలు, పంచాయతీరాజ్ సంస్థలు అగ్రగామిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను.

**(యీ వ్యాసం ప్రథమంగా 'యోజన'లో ముద్రించబడింది)**

అనువాదం **- ఎ.ఎస్.ఆర్. కౌశిక్**


SthanikaPalanaTel_May_2010_Black&White.pm16 4/29/2010, 3:02 PM

# ప్రణాళికా వికేంద్రీకరణ - కొన్ని సమస్యలు

## జిల్లా ప్రణాళిక రూపకల్పన

ప్రణాళికా సంఘం తయారు చేసిన సమగ్ర జిల్లా ప్రణాళికపై వచ్చిన రిపోర్టు రెండు సంపుటాలుగా వెలువడింది. మొదటి సంపుటంలో భాగస్వామ్య పద్ధతిలో జిల్లా ప్రణాళికా సంస్కరణలను, అమలును వివరించగా, రెండో దానిలో వివిధ భాగస్వామ్య పక్షాలు ఏ విధంగా వాటిని అమలులో పెట్టాలో వివరించబడింది. ఈ సంస్కరణలను ఇంకా చాలా రాష్ట్రాలు సీరియస్‌గా అమలు చేయడం లేదు. దీని క్కారణం కొన్ని సంస్కరణలకు ఇంకా తుది రూపం ఇవ్వకపోవడమే.

జిల్లా ప్రణాళికల్లో సంస్కరణలను ప్రవేశపెట్టడం రాజ్యాంగ పరంగా తప్పనిసరి. కానీ కొన్ని రాష్ట్రాలు వీటికి ఏ మాత్రం ప్రాముఖ్యం ఇవ్వడం లేదు. మామూలుగానే జిల్లా ప్రణాళికా కమిటి అధికారాలు లేని బలహీనమైన కమిటీ అని అంతా భావిస్తుంటారు. జిల్లా ప్రణాళిక అమలు బాధ్యతను ఈ కమిటీకి ముడి పెట్టడం వల్ల ఆశించినంత ఫలితాలు కన్పించడం లేదు. కొన్ని రాష్ట్రాలలో జిల్లా ప్రణాళికా సంఘాలు సమర్ధవంతంగా పని చేస్తున్నందున, సంస్కరణలను, అమలు చేయాల్సిన అవసరాన్ని గుర్తించడం లేదు. కానీ మరి కొన్ని రాష్ట్రాలలో జిల్లా ప్రణాళికా సంఘాలు కేవలం రబ్బరు స్టాంప్ వేయడానికి మాత్రమే ఉంటున్నాయి.

ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను అందుకున్నాక జిల్లా ప్రణాళికా సంఘం దాన్ని ఆమోదించాలన్న నిబంధనను పాటించాలి కాబట్టి, ఈ సంఘం అవసరమవుతుందన్న వాదనలు ఉన్నాయి. జిల్లా ప్రణాళికా సంఘాలలో పూర్తి కాలం పనిచేసే నిపుణులు, అధికారులు ఉండాల్సిన అవసరం ఉంది. వారు జిల్లా ప్రణాళికను సిద్ధం చేయడానికి ఏడాది పొడవునా కృషి చేయడమే కాకుండా వివిధ స్థాయిల్లోని స్థానిక సంస్థలకు ప్రణాళికలు రూపొందించడానికి మార్గ దర్శకత్వం వహించాల్సిన అవసరం ఉంది. ఈ విధమైన ఏర్పాటు ఉంటే జిల్లా ప్రణాళికా సంఘం పటిష్టమవుతుంది.

కొన్ని రాష్ట్రాలలో ఉత్తమ సాంప్రదాయాలను పాటించే జిల్లా ప్రణాళికా సంఘాలను అధ్యయనం చేసి కేంద్ర ప్రణాళికా సంఘానికి రికమెండేషన్లు చేయాలి. అటువంటి ఉత్తమ సంఘాలకు ప్రత్యేక సహాయం అందించాల్సిన అవసరం కూడా ఉంది. నిబంధనల ప్రకారం, ప్రతి గ్రామపంచాయతీ వార్షిక ప్రణాళికలను రూపొందించాల్సి ఉంది. కానీ వాటికి నైపుణ్యం ఉన్నవారు అందుబాటులో ఉండరు. గ్రామస్థాయిలో భాగస్వామ్య ప్రణాళికను రూపొందించి దాని అమలును పర్యవేక్షించేందుకు బ్లాక్ / మండల స్థాయిలో కొంతమేరకు మార్గదర్శకత్వం వహించే వారి అవసరం ఉంటుంది. రిసోర్స్ సెంటర్లుగా పిలువబడే బ్లాక్ స్థాయి సంస్థలకు కూడా నిపుణుల అవసరం ఉంటుంది. ఆ స్థాయిలో చాలా కొద్ది మంది మాత్రమే నైపుణ్యం గల వారుంటున్నారు.

ప్రణాళికా ప్రక్రియ రెండు రకాలుగా ఉంటుంది. మొదటి దాంట్లో గ్రామస్థాయిలో ప్రాధాన్యాలను, కార్యకలాపాలను గుర్తించడం. వాటిని పై స్థాయిలో చర్చించేలా చేయడం, పై స్థాయిలో ఈ ప్రాధాన్యాలన్నింటినీ ఒక చోట చేర్చి విశ్లేషించడానికి కొంత సాంకేతిక నైపుణ్యం అవసరమవుతుంది. ఇక రెండో అంశానికొస్తే, ఒక స్థానిక సంస్థ స్థాయిలో వివిధ రంగాల కార్యకలాపాలను సంఘటితం చేయాల్సి ఉంటుంది. మొదటి అంశంలో పేర్కొన్న విధంగా గ్రామస్థాయిలో ప్రణాళికా ప్రకియను చేపట్టడం చాలా కష్టతరమైన పని. రెండోదానికి, జిల్లా ప్రణాళికలు రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు సాంకేతిక సహాయం ఎక్కువగా అవసరం అవుతుంది.

## జిల్లా ప్రణాళికా స్వరూపం, ప్రణాళికా సంఘాల నిర్వహణ

జిల్లా ప్రణాళికను రూపొందించే ప్రక్రియను ప్లానింగ్ కమీషన్ తయారు చేసిన రిపోర్టులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ప్రక్రియను అన్ని రాష్ట్రాలలో ఎలా ప్రారంభించాలన్నదే ప్రధానమైన సమస్య. జిల్లా ప్రణాళికను తప్పనిసరిగా తయారు చేయాలన్న నిబంధన పెట్టడం ఒక మార్గం. ప్రస్తుతం అమల్లో ఉన్న స్వతంత్ర ప్రణాళికా పద్ధతిలో కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖల కింద నడిచే ప్రధాన పథకాలలో కొన్ని మార్పులు చేయాల్సి ఉంది. అక్కడ ప్రతి రంగానికి ఒక సమగ్ర ప్రణాళిక ఉంటుంది. అది స్వతంత్రమైన ప్రణాళికైనా సమగ్రంగా ఉండాలని అనేక మంత్రిత్వ శాఖలు కోరుతున్నాయి. ప్రణాళిక సమగ్రంగా ఉండాలన్న నిబంధన ఏదీ లేకపోవడం వల్ల కొన్ని రాష్ట్రాలు తమ ఇష్టం వచ్చిన రీతిలో రూపొందించుకొంటున్నాయి. ఒక రంగంలో వేరువేరు లక్ష్యాలతో అమలయ్యే జాతీయ పథకాలకు ఒక విధమైన సమగ్రత ఉండాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు NRHM పథకం కింద రూపొందిన ఆరోగ్య ప్రణాళిక, ICDS పథకంతో నడిచే పోషకాహార కార్యక్రమం లేకుండా అసంపూర్తిగా ఉంటుంది.

అలాగే తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలతో ఆరోగ్య పథకం ముడిపడి ఉంటుంది. పంచాయతీరాజ్ సంస్థలు పటిష్టంగా ఉన్న కొన్ని రాష్ట్రాలు నిధులను ఒక చోట కూడ కట్టడానికి ప్రయత్నం చేశాయి. ఈ ప్రయత్నాలను అట్టడగు స్థాయినుంచి అంటే గ్రామ స్థాయి నుంచి చేయాల్సి ఉంది. అయితే, ఒక పథకాన్ని అమలు చేయాల్సిన శాఖ, ఇతర శాఖల నుంచి నిధులను రాబట్టడం వీలుకాదు కాబట్టి స్వతంత్రంగా ఆ పథకాన్ని కొనసాగించడానికే అటువంటి శాఖలు ఇష్టపడతాయి. అందువల్లనే ఆయా పథకాలు అమలు చేశాక అనుకొన్న లక్ష్యాలను సాధించడంలో విఫలమవుతున్నాయి. ప్లానింగ్ కమీషన్ వంటి సంస్థలు మాత్రమే సమగ్ర జిల్లా ప్రణాళికను రూపొందించి, వివిధ శాఖల పద్దుల కింద మంజూరయ్యే నిధులను కూడగట్టగలవు. అలాగే, ప్లానింగ్ కమీషన్ మాత్రమే రాష్ట్ర ప్రణాళికలను ఆమోదించే అధికారం కలిగి ఉంటుంది. ప్రణాళికలను రాష్ట్రాలు అమలు చేసేందుకు ఈ కింది చర్యలు తీసుకోవాలి.

1. ప్రతి శాఖ జిల్లాల వారీగా ప్రణాళికలు రూపొందించి, వాటికి



SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 56 4/29/2010, 3:02 PM

సంబంధించిన వనరులన్నింటినీ జిల్లాలకు తెలియజేయాలి.

2. రాష్ట్ర ప్రణాళికా సంఘంతో జిల్లా ప్రణాళికా సంఘం ఛైర్మన్, కార్యదర్శులు తప్పనిసరిగా సమావేశమై జిల్లా వనరులపై చర్చించి విస్తృత స్థాయిలో రాష్ట్రాభివృద్ధికి దోహదపడే అంశాలను చర్చించాలి.
3. స్థానిక సంస్థలకు నిధులను కేటాయించేటప్పుడు, బడ్జెట్‌లో ఏ పద్దుల కింద ఎంత మొత్తాన్ని కేటాయిస్తున్నదీ స్పష్టంగా పేర్కొనాలి.
4. ప్రతి జిల్లాకు ఒక నమూనా టేబుల్ (టెంప్లేట్) ను తయారు చేసి ఆ జిల్లాకు సంబంధించిన ముఖ్యమైన సాంఘిక, ఆర్థిక సూచీలను పొందు పరచాలి. అలాగే రాష్ట్ర ప్రణాళికా సంఘం అన్ని స్థానిక సంస్థలకు సంబంధించిన డేటా బేస్‌ను రూపొందించాలి. అలా చేయడం ద్వారా ముందుచూపుతో ప్రణాళికా రూపకల్పన చేయడం సాధ్యమవుతుంది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ నిధులు అందించేందుకు అన్ని జిల్లాల సమాచారాన్ని ఒక వెబ్‌సైట్‌లో ఉంచి, అందులో సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలి.
5. జిల్లాలో శాఖప్రణాళికలను తగిన విధంగా రూపొందించి వాటికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయించాలి.

తమకు అప్పగించిన విధులను అమలు చేయడానికి రాష్ట్రాలు తగిన సహాయం అందించాలి. ప్రతి జిల్లా ప్రణాళికా సంఘంలో ఒక ముఖ్యమైన నైపుణ్యంగల అధికార బృందాన్ని నియమించాలి. జిల్లా, కింది స్థాయిల్లో డేటా బేస్‌ను రూపొందించడానికి, ప్రణాళికలు రూపొందించడానికి కనీస నిధులను కేటాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు సహాయపడాలి. జిల్లా ప్రణాళికా సంఘం పని చేయడానికి కనీస ఆఫీస్ వసతి ఉండాలి. ప్రస్తుతం రాష్ట్ర ప్రణాళికా సంఘాలిస్తున్న సహాయం ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్లాన్‌ప్లస్ వంటి ఆదాయపు పన్నుల సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించేందుకు జిల్లా ప్రణాళికా సంఘానికి ఐ.టి. నిపుణులు కావాలి. జిల్లాలోని NRDMS విభాగాలను, రాష్ట్ర స్టాటిస్టికల్ డైరెక్టరేట్ సిబ్బందిని జిల్లా ప్రణాళికా సంఘం పరిధిలోకి తేవాలి. అటువంటి యంత్రాంగాలు లేని రాష్ట్రాలు కొత్తగా వాటిని ఏర్పాటు చేసుకోవటానికి నిధులందించాలి.

స్థానిక సంస్థల ప్రణాళిక రూపొందించడానికి గ్రామీణ పట్టణ సమగ్రతా విషయాలు, ప్రాదేశిక ప్రణాళికాంశాలు చాలా ప్రధానమైనవి. ప్రతి జిల్లాకు కనీసం ఒక ప్లానింగ్ నిపుణుడు ఉండాలి. రాష్ట్ర ప్రణాళికా బోర్డులలో కనీసం కొంతమంది ప్రొఫెషనల్స్ ఉండాలి. ఒక్కోసారి ప్రాదేశిక రూపంలో ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉండవచ్చు. ప్రాదేశిక ప్రణాళికకు GIS ప్లాట్ ఫాంలో మ్యాపులను తయారు చేసి, వాటిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలి. ఈ మ్యాపులను కనీసం జిల్లా స్థాయి వరకైనా రూపొందించాలి. ముఖ్యమైన సిబ్బంది, ముఖ్యమైన సదుపాయాలు అన్ని జిల్లాలలో ఉండేందుకు ప్లానింగ్ కమీషన్ గ్రాంట్‌లను ఇవ్వాలి.

## గ్రామ స్థాయి భాగస్వామ్య ప్రణాళిక

గ్రామ పంచాయతీ స్థాయిలో గ్రామీణుల భాగస్వామ్యంతో ప్రణాళికలను రూపొందించాలి. కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో వేరు వేరు పద్ధతులలో ప్రణాళికా రూపకల్పన జరిగింది. ఆ పద్ధతులను అన్ని రాష్ట్రాలు అధ్యయనం చేసి ఎవరి కనుగుణంగా వారు అమలు చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రాథమికమైన కార్యకలాపాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ప్రతి గ్రామంలో ఒక వాలంటీర్ల బృందాన్ని ఎంపికచేసి వారికి ప్లానింగ్, అభివృద్ధి కార్యకలాపాలను ఎలా నిర్వహించాలి అన్న అంశాలపై శిక్షణ ఇవ్వాలి ఈ స్వచ్ఛంద కార్యకర్తల్లో మహిళలు, బలహీన వర్గాల వారికి తగిన ప్రాధాన్యతలు ఇవ్వాలి.
2. గ్రామస్థాయి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు, వారికి మార్గదర్శకత్వం వహించేందుకు ఒక నిపుణుల బృందాన్ని నియమించాలి. ఆ బృందాన్ని ప్రైవేటు సంస్థల నుంచి అవుట్ సోర్స్ చేయాలి. లేదా రాష్ట్ర ప్రభుత్వమే ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
3. గ్రామాలలో ప్రాథమిక, సెకండరీ డేటాను సేకరించడం, దాన్ని నిపుణుల సహాయంతో విశ్లేషించి ప్రణాళిక రచనకు సిద్ధం చేయాలి.
4. ప్లాన్‌ప్లస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి గ్రామస్థాయి, బ్లాక్‌స్థాయిలో డేటాను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలి. డేటా ఫీడింగును ఎప్పుడూ పర్యవేక్షిస్తుండాలి. ఒక వేళ గ్రామస్థాయిలో కంప్యూటర్లు లేకపోతే, బ్లాక్ స్థాయిలకెళ్లి ఆ పని చేయాలి. బ్లాక్ స్థాయిలో ఇంటర్నెట్ కనెక్టివిటీ ఉంటే, డేటాను బ్లాక్‌ల స్థాయిలో చూసే అవకాశం ఉంటుంది. ఆ డేటాను ప్లానింగ్ కమీషన్ వెబ్‌సైట్‌లో ఉంచవచ్చు.
5. గ్రామ పంచాయతీలకు వివిధ పథకాల కింద నిధుల మంజూరుకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుతుంది.
6. గ్రామ స్థాయిలో NREGA వంటి పనులను ఇతర పథకాలతో అనుసంధానం చేయడానికి ఉపయోగపడుతుంది.
7. గ్రామ స్థాయి ప్రణాళికను మదింపు చేయడం, రాష్ట్ర ప్రణాళికకు అనుగుణంగా దాన్ని సిద్ధం చేయడం, గ్రామసభల్లో వాటిని అనుమతించడం వంటి కార్యకలాపాలను చేపట్టవచ్చు.
8. ఫలానా గ్రామస్థాయి ప్రణాళికా కిందకు వస్తుందా, దానిపై స్థాయికి వస్తుందా అన్న విషయాన్ని నిర్ణయించాలి. గ్రామ పరిధిలోకి రాని అంశాలను బ్లాక్ స్థాయిలో చేపట్టాలి.
9. పంచాయతీ సమితులు (బ్లాక్‌లు), జిల్లా పరిషత్‌ల ప్రణాళికలను కింది స్థాయి రికమెండేషన్ల ఆధారంగానే జరగాలి.

## ప్రక్రియను ఎలా ప్రారంభించాలి?

ప్రణాళికా ప్రక్రియను పూర్తి చేయడం అనుకున్నంత తేలిక కాదు.



SthanikaPalanaTel_May_2010_Black&White.pmd 4/29/2010, 3:02 PM

సరైన మార్గదర్శకత్వంలో ముందుకు సాగాల్సి ఉంటుంది. నాణ్యత చెడకుండా ఫలితాలు రావాలంటే చాలా కాలం పడుతుంది. జిల్లా ప్రణాళికా సంఘం సభ్యులు, ఎన్నికైన ప్రతినిధులు, ఇతర సిబ్బందికి పునశ్చరణ తరగతులను నిర్వహించాల్సిన అవసరం ఉంది. ప్లానింగ్ అంశాలపై నిరంతర శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని అనుభవాలు తెలుపుతున్నాయి. ప్లానింగ్ ప్రక్రియలో పాల్గొనే వారికి ప్రతి ఏడాది స్వల్పకాలిక శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. గ్రామస్థాయిల్లో పాల్గొనే వాలంటీర్లలో కొంత మంది మధ్యలో మానివేసే అవకాశం ఉంది. ప్రణాళికా ప్రక్రియ మొదలు పెట్టే ప్రతిసారీ నూతనోత్సాహం నింపాల్సిన అవసరం ఉంది. బ్లాక్ స్థాయిలో శిక్షణనివ్వడానికి జిల్లాస్థాయిలోని అంకిత భావమున్న శిక్షకులను ఎంపిక చేసి నిర్థిష్టకాల వ్యవధిలో శిక్షణను పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర స్థాయినుంచి గ్రామ స్థాయి వరకు శిక్షణ సిబ్బందికి సంబంధించిన స్పష్టమైన ప్రణాళికను, కాలవ్యవవధిని ముందే ఖరారు చేసి ఉంచుకోవాలి.

ఇటువంటి దీర్ఘకాలిక ప్రక్రియను చేపట్టటానికి రాష్ట్రాలు ఆసక్తి కనపర్చవు. వాటికి సత్వర పరిష్కారం చూపే మార్గాలు కావాలి. ఈ సత్వర మార్గాల వల్ల ప్రణాళికా నాణ్యత దెబ్బ తింటుంది. సత్వర మార్గాలలో ఓ ప్రత్యేక పథకానికి సంబంధించిన ప్రత్యేక ప్రణాళికలు, వాటిని అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యల జాబితా, నిధుల లభ్యత, మార్గదర్శక సూత్రాల వంటివి ఉంటాయి. మానవవనరుల అభివృద్ధి, జీవనోపాధి అవకాశాల విస్తరణ, మౌలిక వనరులు కాకుండా ఇతర అంశాలపై అంచనాలు వేసేందుకు తగిన నిపుణులు ఉండాలి. సాధారణంగా ఈ విషయాలపై నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తూ ఉంటారు. అభివృద్ధి లక్ష్యాలను విశ్లేషించే సామర్థ్యం ఉండాలి. మానవవనరులు, సాంకేతిక పరిజ్ఞానం, సమాజవనరులు, నిధుల వంటి అన్ని రూపాల వనరులను అభివృద్ధి పరచడానికి ప్రత్యక్ష జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ జోక్యం ముఖ్యంగా అట్టడుగు స్థాయి నుంచి ఉండాలి. ఇది దేశమంతటా ఒక్కసారే అచరణలో చూడాలంటే సాధ్యంకాదు. క్రమంగా ప్రవేశపెడుతూ పోవాలి.

ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రణాళికా పద్ధతులను రాష్ట్రాలు అనుసరిస్తూ నిరంతరం మార్పులూ చేర్పులూ చేస్తూ ఉండాలి. కెపాసిటీ బిల్డింగ్ అంటే, కేవలం శిక్షణనివ్వడమే కాదు. స్థానిక భాషలతో ప్రణాళికా మాన్యువల్స్‌ను రూపొందించాలి. సంస్కరణలు విజయవంతంగా అమలు జరిగే చోటుకి, వాలంటీర్లను తీసుకెళ్లి చూపించాలి. ఉత్తమ సంప్రదాయాలను పుస్తక రూపంలో రూపొందించి అందరికీ అందుబాటులోకి తెచ్చి, అవి పాటించేలా చర్యలు తీసుకోవాలి.

## పర్యవేక్షణ, మదింపు

ప్రణాళికా వికేంద్రీకరణను పర్యవేక్షించే లేదా మదింపు చేసే యంత్రాంగం చాలా బలహీనంగా ఉంది. వార్షిక ప్రణాళికపై జరిగే ప్రస్తుతపు చర్చా పద్ధతి చాలా అసమగ్రంగా ఉంది. ప్లానింగ్ ప్రక్రియను దగ్గరగా ఉండి పర్యవేక్షించి మదింపు చేసే ఏర్పాటు ఉండాలి. ఇప్పటి పద్ధతులు ప్రణాళికా ఖర్చులను కనిపెట్టేవిగా మాత్రమే ఉన్నాయి. ఖరీదైన ''ప్లాన్ ప్లస్'' సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడంతోపాటు, జిల్లా స్థాయిలో ప్రణాళికలను విశ్లేషించి, వాటి అమలును పర్యవేక్షించి, లోపాలను అంటే ప్రణాళిక ప్రకారం అమలు జరుగని వాటిని గురించి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి. ఇ - గవర్నెన్స్ పద్ధతులు ఇందుకు చాలా ఉపయోగపడతాయి. దీనికోసం జిల్లా స్థాయిలో నిపుణుల అవసరం ఉంటుంది. ప్రతి రాష్ట్ర ప్రణాళికా సంఘం, జిల్లా ప్రణాళికా సంఘాలలో సరిపోయేంతమంది నిపుణులను నియమించాలి. నిపుణుల ఎంపికకు వృత్తి నైపుణ్య సంస్థలు లేదా విశ్వవిద్యాలయాల సహకారం తీసుకోవాలి. ప్రణాళికా ప్రక్రియలో పాలుపంచుకొనే డిగ్రీ కళాశాలలకు వికేంద్రీకరణ ప్రణాళికలపై పరిశోధనలు చేసే వారికి ప్రత్యేక రాయితీలు లేదా ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

## ప్రణాళికా వికేంద్రీకరణను బలపరిచే ఇతర సంస్థాగత ప్రక్రియలు

ప్రణాళికా రచన ఒక్కటే సరిపోదు. దాన్ని అమలు పరిచే స్థానిక సంస్థలు, ప్రభుత్వ శాఖలు ఉండాలి. స్థానిక సంస్థల బడ్జెట్‌ను రూపొందించడం, దాన్ని అమల్లో పెట్టి, పర్యవేక్షించడం కూడా చాలా ముఖ్యం. దిగువ స్థాయిలో రూపొందించే బడ్జెట్ రాష్ట్ర స్థాయి ప్రణాళికకు అనుగుణంగా ఉండాలి. స్థానిక సంస్థల బడ్జెట్ అందుబాటులో ఉన్న అవసరాలు, ఖర్చులకు అనుగుణంగా ఉన్న ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. కింది సంస్థలు పైసంస్థలకు అనుబంధంగా ఉండాలన్న నియమం ప్రాతిపదికగా ఆచరణ ఉండాలి. ముందు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సరైన పథకాన్ని రూపొందించడం, దాన్ని అమలు చేయడం, వస్తు సేకరణ వ్యవస్థ, అకౌంటింగ్ మొదలైన విషయాలన్నింటినీ పటిష్టంగా చేసినప్పుడే ప్రణాళికలో అనుకున్న ఫలితాలు వస్తాయి.

సరైన ప్రణాళికకు వనరుల సమీకరణ ఒక్కటే కాదు, నిధులు కూడా సకాలంలో అందినప్పుడే ప్రణాళిక పటిష్టంగా అమలు జరుగుతుంది. నిధుల విడుదలలో ఉన్న షరతులు ఒక ఎత్తు అయితే స్థానిక అవసరాల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్లక్ష్యభావన ఉండటం వల్ల నిధుల విడుదలలో చాలాసార్లు జాప్యం జరుగుతుంది. నిధుల బదిలీ మరో పెద్ద సమస్య. బ్యాంకుల సహాయంతో నిధులను ఎలక్ట్రానిక్ రూపంలో బదిలీచేసి, అవి సక్రమంగా చేరుతున్నాయో లేదో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. పంచాయతీ వ్యవహారాలలో ప్రజల భాగస్వామ్యం భాగస్వామ్య ప్రణాళికా ప్రక్రియలో అతి ముఖ్యమైన అంశం. ప్రజలు కోరుకున్నవి అమలు జరుగుతున్నాయంటే, అది ప్రజల భాగస్వామ్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తే ప్రణాళికా ప్రక్రియలో ప్రజలు నిరంతర భాగస్వాములు అవుతున్నట్లు లెక్క. ఈ విషయంలో కూడా రాష్ట్రాల మధ్య ఎంతో వ్యత్యాసం. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ వ్యవస్థను పద్ధతి ప్రకారం అభివృద్ధి చేయాల్సి ఉంది.

**– శ్రీ వాసు దేవులు,**

సి.ఇ.ఓ., సంగారెడ్డి జిల్లా పరిషత్ **(అనువాదం : బి. లలిత)**



SthanikaPalanaTel_May_2010_Black&White.prd 4/29/2010, 3:02 PM



# పెయిన్ ఫ్లూ

**- సుంకోజి దేవేంద్రాచారి**

**సుబ్బారావ్‌కు తెలివెక్కువ. ఆ విషయం సుబ్బారావ్‌కు చాలా ఎక్కువగా తెలుసు. రోజూ ఒక్క అక్షరం కూడా వదలకుండా పేపర్ చదువుతాడు. ఎవరికి ఏ సమాచారం కావాలన్నా, వారు అడగపోయినా సరే...., సలహాలు ఇచ్చేస్తుంటాడు. సుబ్బారావ్ చదువుతున్నాడని, పేపర్లో రోజూ కొత్త కొత్త వార్తల్ని రాయలేరు కదా! పాతవార్తలే కాస్త అటూ ఇటూ తిప్పి వేస్తుంటారు పేపర్లో. ఎప్పుడో తప్ప కొత్త వార్తలుండవు. అయినా సుబ్బారావు పేపర్ చదవగానే తానేదో కొత్త విషయం కనిపెట్టినట్టు, విశేషాలు లేని వార్తలను విశేషంగా చెప్పడం మొదలు పెడతాడు. అందుకే చాలావరకు జనం సుబ్బారావ్‌ను తప్పించుకుని తిరుగుతుంటారు.**

స్వైన్ ఫ్లూ గురించి మొదట పేపర్లో చూడగానే కొత్త విషయం దొరికిందని సంకలు గుద్దుకున్నాడు సుబ్బారావ్. ఏమాట కామాట చెప్పుకోవాలి. సుబ్బారావు మంచి నటుడు. తను చెప్పే విషయాలను హావాభావాలతో చెప్తాడు. ఇది పెద్దలకు వినోదదాయకంగా ఉంటే, పిల్లలు ఆయనను ఫాలో అవుతుంటారు.

ఉదాహరణకు ఒక కప్ప రెండు మీటర్ల దూరం గెంతుతోంది అనే వార్త ఆరోజు పేపర్లో వచ్చింది. దాన్ని చదవగానే సుబ్బారావు తనే కప్పలా ఫీలయిపోయాడు. తనకు కనిపించిన వారందరికీ కప్పలా గెంతుతూ ఆ వార్త సారాంశాన్ని నటించి చూపించాడు. ఇంకోసారి 'కుక్కలా మొరుగుతున్న పిల్లి' అనే వార్త చదివాడు. అంతే కనిపించిన మనిషి దగ్గరంతా కుక్కలా మొరగడం మొదలు పెట్టాడు. 'పాపం సుబ్బారావు... ఎంత బాగున్నాడు.. పిచ్చికుక్క కరిసినట్టుంది' అని జనం జాలిపడ్డారు.

తననే కుక్కా కరవలేదు, తను చెప్తున్నది 'ఓ కుక్క' కథ గురించి అని నమ్మించడానికి సుబ్బారావు మోకాల్లోని ప్రాణం పాదానికొచ్చేంత పనయింది. చివరకు అసలు విషయం తెలుసుకున్న జనం 'ఔరా' అని ముక్కుమీద వేలేసుకున్నారు. 'ఏమి నటనా' అని పొగిడారు. 'సినిమాల్లోకి పో... నువ్వే మహేష్‌బాబు. నువ్వే సునీల్... నువ్వే సాయాజి షిండే' అన్నారు.

ఉంటే హీరోలా ఉండాలి. లేదంటే కామెడీ యాక్టర్‌లా ఉండాలి. అదీ కాదంటే విలన్‌లా ఉండాలి. మూడు రకాల పాత్రలు ఒకే మనిషిలో ఎలా ఉంటాయి? తనో గొప్పనటుడు. తనలో ఉంటాయనే అనుకున్నాడు సుబ్బారావు. ఇంట్లో చెప్పాపెట్టకుండా హైదరాబాద్ వెళ్లిపోయాడు. స్టూడియోల చుట్టూ తిరిగాడు. హీరోల ఇళ్ల వద్ద పడిగాపులు కాశాడు. హీరోయిన్ల వీధుల్లో నిలబడి వాళ్ల కార్లకోసం ఎదురు చూశాడు. పాపం సుబ్బారావ్... నిలబడి నిలబడి కాళ్ల వాపులొచ్చాయి. చూసి చూసి కళ్ల నొప్పులొచ్చాయి!

డైరెక్టర్లను కలిసాడు. ప్రొడ్యూసర్లను కలిశాడు. వాళ్లంతా చెప్పిందొకటే మాట.

**హాస్య కథల పోటీ విభాగంలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ**

నీ ముఖాన్ని అద్దంలో చూసుకుని రా అని!

చేతిలో డబ్బంతా అయిపోవడంతో తిరిగి తమ వూరికి చేరుకున్నాడు. నేరుగా అద్దం వద్దకు పోయాడు. అద్దంలో చూసుకున్నాడు.

లోతుకు పోయిన కళ్లు... మెల్లకన్ను.. ముందుకు కత్తిలా పొడుచుకొచ్చిన ముక్కు.. ఎంత తిన్నా కండలు రాని శరీరం. బొగ్గంత నలుపు కాకపోయినా నలుపు రంగు శరీరం... భూమికి ఐదడుగుల ఎత్తు..

తను హైదరాబాదులో చూసిన రూపాలకు, తన రూపానికి అస్సలు పోలికే లేదు అనే విషయం అర్థం చేసుకున్నాడు. తన నటప్రస్థానం జీవితంలో ఓ పెద్ద గుణపాఠంగా భావించాడు. అందుకే ఎవ్వరడిగినా, అడగకపోయినా తన హైదరాబాదు అనుభవాలను చెప్పడం మొదలు పెట్టాడు.

వాటిని ఇలా మొదలు పెడతాడు...

మహేష్‌బాబు అరడుగుల పొడవుంటాడు... తెల్లగా ఉంటాడు.. ముఖంలో ఇంకా లేతదనం పోలేదు..

ఎన్టీఆర్ ఐదడుగులా ఏడంగుళాల పొడవుంటాడు. తెల్లగా ఉంటాడు.. అచ్చు వాళ్ల తాత ఎన్టీఆర్‌లాగానే ఉంటాడు.

రాంచరణ్ వాళ్ల నాన్నంత ఎత్తుంటాడు. జుట్టు బాగా ఫ్యాషన్‌గా పెంచాడు.

ప్రభాస్ ఆరుడుగులా రెండంగుళాల ఎత్తుంటాడు... తెల్లగా ఉంటాడు. కండలు బాగా పెంచాడు.

భూమిక, చార్మి, త్రిష, ఐశ్వర్యారాయ్... అందరూ చాలా తెల్లగా, పొడవుగా, సన్నగా, అందంగా ఉంటారు.

ఐశ్వర్యారాయ్ హైదరాబాద్‌లో లేదు కదా అని ఎవ్వరూ అడగలేదు. గుంభనంగా నవ్వుకున్నారు. ఈ విషయాలు కనిపెట్టేదానికి అంతదూరం పోవాలా? అని కొందరు ముఖాన్నే అడిగారు.

'పేపర్లో, టీవీల్లో, సినిమాల్లో చూడ్డం వేరు.. మనిషిని నిజంగా ఎదురుగా చూడ్డం వేరు.. మీరూ అలా చూడండి. ఆ తేడా ఏంటో తెలుస్తుంది' అని వాళ్ళకు క్లాసు పీకాడు సుబ్బారావు.

అయితే.. 'వాళ్లలో అందం ఉండచ్చు. నాలో నటుడున్నాడు' అనుకున్నాడు సుబ్బారావ్. తను చెప్పాలనుకున్న విషయాన్ని ఇంకా బాగా నటించి చెప్పడం మొదలు పెట్టాడు. ఇది జరిగి ఏడాది దాటింది.

ఇక ఇప్పటి విషయంలోకి వస్తే.. స్వైన్‌ఫ్లూ గురించి చదివినప్పటినుంచీ జనం కోసం ఎదురుచూస్తున్నాడు. ఒక్కరూ కనిపించడం లేదు. అందరూ ఎవరి పనుల్లో వాళ్లున్నట్టున్నారు. వళ్లు విరుచుకుంటూ వీధిలోకి వచ్చాడు.

అరవై ఏళ్ల వెంకట్రావు ఎదురు పడ్డాడు. సుబ్బారావులో ఉత్సాహం పెరిగింది. స్వైన్‌ఫ్లూ గురించి వివరించడం మొదలు పెట్టాడు.

"కొత్త జబ్బు వచ్చిందంట తాతా.. స్వైన్ ఫ్లూ అంట. అది వస్తే జలుబు చేసినట్టవుతుందంట. కఫమంతా చేరి శ్వాస ఆడక చనిపోతారంట" అన్నాడు, తన సహజసిద్ధమైన హావభావాలతో.

చెప్పడంలో భాగంగా కళ్లు తేలేసిన సుబ్బారావును చూసి "ఒరే నాయనా.. సుబ్బారావ్.. ఎంత బాగున్నావురా కొడకా.. ఎంత బాగా కతలు చెప్తాన్నావురా కొడకా.. ఇప్పుడు కత చెప్తాంటివి కదరా కొడకా.. ఇంతలోకే ఏమయిందిరా కొడకా.." అని దీర్ఘాలు తీశాడు వెంకట్రావు.

"తాతా.. నేను చనిపోలేదు. ఊపిరాడక ఎట్ల చనిపోతారనేది చేసి చూపించినానంతే" అన్నాడు నవ్వుతూ సుబ్బారావు.

సుబ్బారావు చనిపోయాడు. అతని శరీరంలోకి దెయ్యం వచ్చిందని అనుకున్నాడు వెంకట్రావు. తన చేతిలోని కర్రను కూడా విసిరేసి అక్కడినుంచి పరుగులు తీశాడు. అతనెందుకు పరిగెడుతున్నాడో సుబ్బారావుకు అర్థం కాలేదు. తను తెలుసుకున్న కొత్త విషయం అతని మెదడులో పురుగులాగా తిరుగుతోంది. దాన్ని పదిమందికి చెప్తేకానీ ఉండలేదు.

మనుషుల కోసం అన్వేషణ మొదలు పెట్టాడు.

సుబ్బమ్మత్త ఎదురుపడింది. ఆమెకు స్వైన్ ఫ్లూ గురించి వివరించాడు. అంతా విన్నాక ఆమె 'ఓస్.. జలుబారా.. జలుబు ఎక్కువయితే ఊపిరాడదు గదా.. ముక్కుల్లోది చీదేస్తే సరిపోతాది' అంది చాలా తేలిగ్గా.

వాళ్ళకు ఎలా చెప్పాలో అర్థం కాలేదు సుబ్బారావుకు. ఆ రోజునుంచి స్వైన్ ఫ్లూ వార్తలను ఫాలో కాసాగాడు. వీలయినంత వరకూ అందరికీ చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

నాలుగు నెలలయింది. జనానికి కూడా స్వైన్ ఫ్లూ పైన కాస్త అవగాహన వచ్చింది. టీవీలు పేపర్లు చూస్తున్నారు కదా!

తమ వీధిలో ఇద్దరికి జలుబు చేసింది. వెంటనే వారికి దూరంగా పరుగులు తీశాడు సుబ్బారావు. ఆ పరుగు పరుగు పాతిక రూపాయలు ఛార్జీ పెట్టుకుని పట్నం పోయాక ఆపాడు. మరో పాతిక రూపాయలు పెట్టి 'మాస్క్' తీసుకున్నాడు. మూతికి కట్టుకుని బస్సెక్కాడు.

కండక్టర్ సుబ్బారావును అనుమానంగా చూశాడు. ఇద్దరి సీట్లో, ఒకతను కూర్చొని ఉన్నాడు. సుబ్బారావు వెళ్లి అతని పక్కన కూర్చున్నాడు. అతను ఒక్క ఉదుటున లేచి వెనక్కు వెళ్లాడు. అతనెందుకు అలా వెళ్లాడో సుబ్బారావుకు అర్థం కాలేదు. బస్సు నిండింది. చాలామంది నిలబడే ఉన్నారు. కానీ ఎవ్వరూ సుబ్బారావు పక్కన కూర్చోలేదు. అందరూ సుబ్బారావును భయంభయంగా చూస్తున్నారు.

సుబ్బారావు తల అటు తిప్పి, ఇటు తిప్పి బస్సులో అందరినీ పరిశీలించాడు. ఒక్కరు కూడా మాస్క్ వేసుకోలేదు. కొందరు తుమ్ముతున్నారు. అయినా వాళ్లెవరూ పట్టించుకోలేదు.

'అజ్ఞానులు... కాస్త కూడా జ్ఞానం లేదు. ఆరోగ్యంపైన శ్రద్ధ లేదు' అనుకున్నాడు.

బస్సు కదిలింది. కండక్టర్ టికెట్లు కొడుతున్నాడు. టికెట్ తీసుకున్న ప్రతి ఒక్కరూ కండక్టర్ చెవిలో ఏదో గుసగుసగా చెబుతున్నారు.

'తమ పల్లెలో మొట్టమొదట మాస్క్ వేసుకున్న వ్యక్తి తనే. తనను అందరూ హీరోలా చూస్తారు. నిజంగా కూడా తను హీరోనే. కానీ సినిమా వాళ్లకు తన టాలెంట్ తెలీలేదు. తెలిసిన రోజు, వాళ్లే తనను వెతుక్కుంటూ వస్తారు' అనుకున్నాడు సుబ్బారావు.

బస్సు ఆగింది. బస్సు ఆగడంతో సుబ్బారావు ఆలోచనలు కూడా ఆగాయి. పట్నం దాటగానే స్టేజి వస్తుంది. స్టేజికి ముందు టికెట్లు కొట్టడం కోసం బస్సును ఆపుతారు. కండక్టర్ వచ్చి "ఎక్స్‌క్యూజ్‌మీ సర్... ఒక్కసారి కిందకు రండి" అన్నాడు ముఖానికి చేతిని అడ్డం పెట్టుకుని.

"ఎందుకు" అన్నాడు సుబ్బారావు.

"ప్లీజ్.. ఒక్కసారి కిందకు రండి" అని కిందకు వెళ్లాడు కండక్టర్.

ప్రయాణీకులందరూ వారినే చూస్తున్నారు. తననెందుకు కిందకు రమ్మన్నాడో సుబ్బారావుకు అర్థం కాలేదు. సరే చూద్దాం అనుకుని కిందకు వెళ్లాడు. కిందకు దిగగానే కండక్టర్ టకామని బస్సెక్కి డోర్ వేసి రైట్ అని చెప్పకముందే, బస్సు స్పీడందుకుంది.

"హోల్డాన్.. హోల్డాన్.. హోల్డాన్" అంటూ సుబ్బారావు వెనక కొంతదూరం పరిగెత్తి, ఇక తనవల్ల కాక ఆగిపోయాడు.

'అతను ఎక్కడికిపోయాడో ఏమో, స్వైన్ ఫ్లూ అంటించు కున్నట్టున్నాడు. మాకయితే చాలా భయమేసింది'

'పిల్లా పాప ఉండేవాళ్లం. మాయదారి రోగాలొస్తే ఎట్ల బతికేది' బస్సులో ప్రయాణీకులు ఇలా రకరకాలుగా చెప్పుకుంటున్నారు. పాపం.. సుబ్బారావు! అక్కడే నిలబడి ఉన్నాడు. తననెందుకు దింపారో అర్థం కాలేదు. కండక్టర్‌ను. డ్రైవర్‌ను తిట్టుకుంటూ నిల్చున్నాడు. మరో గంటకు ఇంకో బస్సు వచ్చింది. సుబ్బారావు చేయి ఎత్తాడు ఆపమన్నట్టుగా. అయినా బస్సు ఆగలేదు. మరో పావుగంట గడిచింది. మూతికి మాస్క్ ఉండటం ఇబ్బందిగా ఉంది సుబ్బారావుకు. చిరాగ్గా ఉంది. దానిని తీసి, మడిచి జేబులో పెట్టుకున్నాడు. ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. చుట్టూ పచ్చటి పొలాలు.

మరో అరగంటలో ఇంకో బస్సు వచ్చింది. తను చేయి ఎత్తకముందే ఆ బస్సు ఆగింది. బస్సు ఎక్కాడు సుబ్బారావు. టికెట్ తీసుకున్నాడు. బస్సులో ఎవ్వరూ మాస్క్ వేసుకోలేదు. ఓ చోట సీటు ఖాళీగా ఉంటే కూర్చున్నాడు. మెల్లగా మాటలు మొదలు పెట్టాడు. పక్కనున్నతనికి నిద్ర వస్తోంది. జోగుతూనే సుబ్బారావు మాటలకు తల ఊపుతున్నాడు.

స్వైన్ ఫ్లూ గురించి వివరించి "కాస్త జాగ్రత్తగా ఉండండి' ' అన్నాడు.

అతను ఆవులిస్తూ "అయ్యన్నీ పెద్దోళ్లకు, డబ్బుండే మారాజులకు వస్తాయి. మనకెందుకు వస్తాయి"

"జబ్బుకు పెద్దా చిన్నా అని ఏమీ లేదు. ఎవరికైనా వస్తాది. ముందు జాగ్రత్తగా పాతిక రూపాయలు పెట్టి మాస్కులు వాడితే మంచిది" అన్నాడు సుబ్బారావు.

"ఏంటియి... కోతిమూతి మాదిరి ఉంటాయే.. అయ్యా! ఊరికే డబ్బు దండుగ. నన్ను నిద్రపోనీ.. నా బంగారట్ల నిద్ర పాడుచేస్తాండావు" అన్నాడతను కళ్లు మూసుకుంటూ.

'ఎంత అజ్ఞానివిరా నువ్వు' అనుకున్నాడు సుబ్బారావు.

తమ ఊరి స్టాపు వద్ద బస్సు దిగాడు. వెంటనే జేబులోంచి మాస్క్ తీసి ముఖానికి కట్టుకున్నాడు. ఊరివేపు నడక మొదలు పెట్టాడు. మధ్యలో చెరువు కట్ట. కట్టమీద పోతుండగా ఒకతను ఎదురు వచ్చాడు. మాస్క్‌తో ఉన్న సుబ్బారావును చూడగానే అతను ఎక్కడున్నవాడు అక్కడే కట్టదిగి అటునుంచి వెళ్లిపోయాడు. దారిలో ఇద్దరు ముగ్గురు ఎదురొచ్చారు. వారు కూడా అంతే. సుబ్బారావుకు పదిగజాల దూరంలోనే దారి తప్పుకుని వేరే




దిశలో వెళ్లిపోయారు.

వాళ్లెందుకలా వెళ్లిపోతున్నారో సుబ్బారావుకు అర్థం కాలేదు. ఊర్లోకి ప్రవేశించాడు. సుబ్బారావును చూడగానే పులిని చూసి భయపడినట్టుగా అందరూ దూరంగా పరుగులు తీస్తున్నారు. ఇళ్ల తలుపులను ధడేల్మంటూ మూసేస్తున్నారు.

సుబ్బారావు నేరుగా ఇంటికి పోయాడు. ఇంటి తలుపు వేసి ఉంది. సుబ్బారావు కన్నా ముందే అతనొస్తున్న వార్త ఇంటికి చేరినట్టుంది. తల ుపు తట్టాడు. కానీ తెరుచుకోలేదు. చుట్టుపక్కల ఇళ్లలో వాళ్లు తమ ఇళ్ల తలుపులు ఓరగా తెరిచి తల కాస్త బయట పెట్టి సుబ్బారావును భయంభయంగా చూస్తున్నారు.

సుబ్బారావుకు విసుగ్గా ఉంది. ఈసారి మరింత గట్టిగా తలుపు బాది "అమ్మా... తలుపు తీ" అన్నాడు.

"నీకా మాయదారి జబ్బుంట కదా" అంది తలుపు అవతలనుంచే అమ్మ.

"నాకా" ఆశ్చర్యపోయాడు సుబ్బారావు.

"అవును. ఊర్లో అందరూ చెప్తాండారు. నువ్వు మూతికి దాన్ని కట్టుకోనుండావంటనే. ఆ జబ్బొస్తేనే అంట కదా అట్ల కట్టుకునేది" అంది అమ్మ.

"నాకేం జబ్బు లేదమ్మా" అన్నాడు సుబ్బారావు.

"అయితే మూతికి దాన్నెందుకు కట్టుకోనుండావు"

"ముందే ఇలా కట్టుకున్నామంటే ఆ జబ్బు రాదు. ఇందుకు కట్టుకోనుండాను... హాచ్... హచ్..." అని తుమ్మాడు సుబ్బారావు.

"అదో... నాయనా... నీకూ ఆ జబ్బుండాది. నాకు చానా భయంగా ఉండాది. కావాలంటే డబ్బు ఇస్తాం. పోయి బాగ చేపించుకోని రాపో" అంది అమ్మ భయంగా.

"అమ్మా... ఇది ఆ జబ్బు కాదమ్మా.. జలుబంతే.. పట్నం పోయి అక్కడ నీళ్లు తాగినా కదా.. అందువలన వచ్చింది. నిజం. నీ మీదొట్టమ్మా.." అన్నాడు సుబ్బారావు ఏడుపు గొంతుతో.

"అవునా నాయనా.. ఊర్లో వాళ్ల మాటలు విని తలుపు తీలేదు. రా లోపలికి" అంటూ తలుపు తీసిందామె.

అప్పటికీ ఆమెకు కొడుకుపట్ల అపనమ్మకంగానే ఉంది. మరో గంటకు సుబ్బారావు నాన్న వచ్చాడు. అతను ఇంట్లోకి భయంభయంగానే అడుగుపెట్టాడు. తనకు ఆ జబ్బు లేదని అమ్మానాన్నను నమ్మించడానికి సుబ్బారావు చాలా కష్టపడాల్సి వచ్చింది.

ఆ రాత్రి గడిచింది. తెల్లవారింది. సుబ్బారావింటికి ఎవ్వరూ రాలేదు. సుబ్బారావు మాస్క్ పెట్టుకుని వీధిలోకొస్తే చాలు, ధడేల్ ధడేల్‌మని తలుపులు వేసేసుకుంటున్నారు. తనకు స్వైన్ ఫ్లూ లేదని ఎంతగా చెప్పినా ఎవ్వరూ నమ్మడం లేదు.

'అయితే మూతికి దాన్నెందుకు కట్టుకోనున్నావు' అని అడుగుతున్నారు.

'ముందు జాగ్రత్త కోసం' అని సుబ్బారావు చెప్తే అది వాళ్లకు అర్థం కాదు.

'మేం ఏమీ కట్టుకోకపోయినా మాకు రాలేదే. నీకు వచ్చిందే' అంటున్నారు.

'నాకొచ్చిందేది జలుబంతే. వేరే ఏమీ కాదు' అంటాడు సుబ్బారావు.

'నాల్గు దినాలయినా నీకు జలుబు తగ్గలేదే' అంటారు వాళ్లు.

సాధారణంగా సుబ్బారావుకు జలుబు చేయదు. జలుబు చేసినా అతను మాత్రలు మింగడు. 'మాత్రలు మింగితే ఏడు రోజుల్లో తగ్గుతుంది. 'మాత్రలు మింగకుంటే వారం రోజుల్లో తగ్గుతుంది' అనే సూత్రాన్ని సుబ్బారావు ఎక్కడో చదివాడు. అప్పట్నించీ జలుబు చేస్తే ఎలాంటి మాత్రలు మింగడు. ఇక లాభం లేదని మాత్రలు తెప్పించుకుని మింగాడు. అయినా ఫలితం కనిపించలేదు. జలుబు తగ్గలేదు.

అతని మేలుకోరే పెద్దలు, దగ్గరి మిత్రులు.. సుబ్బారావుకు దూరంగా నిల్చుని "ఒరే.. మా మాటిను.. మేం టీవీల్లో చూస్తాండాం కదా.. అదొచ్చినోల్లే అట్ల మూతులకు ఏసుకోనుంటారు. నువ్వు వెంటనే హైదరాబాదుకు పోయి, ఆసుపత్రిలో చూపించుకుని రాపో. లేదంటే మేం నిన్ను మరిచిపోవాల్సి ఉంటుంది" అని కళ్లనీళ్లు పెట్టుకున్నారు.

మరో నాలుగు రోజులు గడిచినా ఫలితం కనిపించలేదు. దీంతో భయపడ్డ సుబ్బారావు హైదరాబాదుకు వెళ్లాడు. ఎర్రగడ్డ వద్ద ఉండే ఫీవర్ ఆసుపత్రికి వెళ్లాడు. పెద్ద డాక్టర్‌ను కలిశాడు.

డాక్టర్‌ను చూడగానే సుబ్బారావుకు ఏడుపు తన్నుకొచ్చింది.

"ముందుగా చెప్పేడ్చు" అన్నాడు డాక్టర్. డాక్టర్ మూతికి కూడా మాస్క్ ఉంది.

"నాకు స్వైన్ ఫ్లూ ఉంది డాక్టర్. వారం నించీ తగ్గలేదు. నన్ను మీరే కాపాడాలి" అన్నాడు ఏడుపు ఆపకుండానే.

"నీకు స్వైన్ ఫ్లూ ఉందని ఎవరు చెప్పారు?"

"మా వూర్లో వాళ్లు చెప్పారు సార్"

"అయితే వాళ్లనే అడిగి వైద్యం చేయించుకో"

"సార్.. సార్" అన్నాడు బేలగా సుబ్బారావు.

"మీయంతకు మీరే నిర్ణయాలు తీసేసుకుంటే ఇక మేమెందుకు? చాలా పరీక్షలు చేస్తే కానీ వ్యాధి నిర్ధారణ కాదు. మీకు మీరే నిర్ణయించుకునేస్తారా?" కోపగించుకున్నాడు డాక్టర్.

"సార్ సార్. దయ చూపండి సార్. శ్వాస సరిగా ఆడటం లేదు" అడుక్కున్నాడు సుబ్బారావు.

"కొన్ని ప్రశ్నలడుగుతాను. సూటిగా సమాధానాలు చెప్పు. డొంక తిరుగుడుగా చెప్పద్దు"

"అడుక్కోండి సార్. నాకు సమాధానాలు చెప్పడం అంటే చాలా సరదా" అన్నాడు. తన పేపర్ జ్ఞానం ఇంతకాలానికి పనికొస్తున్నందుకు ఆనందంగా ఫీలయ్యాడు.

"మీ వూర్లో ఎవరైనా ఎన్నారైలు ఉన్నారా..?"

"లేరు సార్.. మా ఊర్లో ఎక్కువ చదువుకున్న వాడిని నేనొక్కన్నే"

"మీ వూర్లో ఎవరైనా గల్ఫ్ కంట్రీస్‌కు పోయి ఈ మధ్యే వచ్చారా?"

"లేదు సార్.. మొత్తం ఇళ్లే యాభైకి మించి లేవు. అందరికీ వ్యవసాయమే వృత్తి"

"మీ ఊరికి ఈ మధ్య ఎవరైనా పెద్ద నగరాలు అంటే. హైదరాబాద్, వైజాగ్, ముంబై, ఢిల్లీ, బెంగుళూర్ నుంచి ఎవరైనా వచ్చారా?'

"లేదు సార్"

"చివరి ప్రశ్న.. నువ్వు ఆ ఊర్లకు పోయావా?"

"లేదు సార్.. ఆ వూర్లు మాకు చానా దూరం"

"అయితే నీకేం భయంలేదు. నీకొచ్చింది కేవలం జలుబు మాత్రమే!" అన్నాడు డాక్టర్ నవ్వుతూ.

"హమ్మయ్య.. టెన్షన్‌తో ప్రాణం పోతుందేమో అనిపించింది సార్.. అయితే ఇంక నేను మా ఊరెళ్లిపోతాను" అన్నాడు సుబ్బారావు ఉత్సాహంగా.

"హాస్పిటల్‌లో అడ్మిట్‌కా. ఇక్కడ నాలుగు రోజులు ఉన్నావంటే అన్ని పరీక్షలూ చేసి స్వైన్ ఫ్లూ లేదని నిర్ధారణ అయ్యాక పంపుతాం"

"నాకు లేదన్నారు కదా సార్" కంగారుగా అన్నాడు సుబ్బారావు.

"నిజమే.. మీ ఊర్లో ఉన్నప్పుడు నీకు లేదు.. ఇక్కడ బస్టాండులో, రైల్వే స్టేషన్‌లో చూశావు కదా.. ముఖాలకు ఎంతమంది మాస్క్‌లు కట్టుకోనున్నారో.. ఇక్కడకు వచ్చాక నీకూ వచ్చే అవకాశం ఉంది. అందుకే అన్ని పరీక్షలూ చేసి పంపుతాం" అన్నాడు డాక్టర్ సీరియస్‌గా.

"సార్..!" అంటూ దబ్బున కిందపడ్డాడు సుబ్బారావు.

నాలుగు రోజుల తర్వాత డాక్టర్లు సుబ్బారావును డిశ్చార్జ్ చేశారు. ఎలాంటి జబ్బూ లేదని చెప్పారు. ఉన్న జలుబు కూడా తగ్గిపోయింది. మాస్క్‌పైనా లేదా కర్చీఫ్ పైన నీలగిరి ఆయిల్‌ను రెండు చుక్కలు వేసి కట్టుకుంటే స్వైన్ ఫ్లూ రాదని చెప్పారు.

'సల్ఫర్-200' అనే మాత్రలు పది ఒకేసారి మింగినా స్వైన్‌ఫ్లూ రాదని చెప్పారు. జబ్బుల విషయంలో సొంత నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి పెయిన్ ఫ్లూతో బాధపడాల్సి వస్తుందని గట్టిగా చెప్పారు.

ఇప్పుడు సుబ్బారావు పని చేయకుండా పేపర్లు చదువుతూ కూర్చోవడం, జ్ఞాన ప్రదర్శన చేయడం మానుకున్నాడు! ☆

# నాటేది ఒక్క మొక్క

– డా॥ కె.బి. లక్ష్మి

**'బంగాళఖాతంలో అల్పపీడనం వల్ల రాగల ఇరవై నాలుగు గంటల్లో భారీ వర్ష సూచన' ఆకాశవాణి ప్రాంతీయ వార్తల సమాచారం.**

**ఇరవై నాలుగ్గంటలంటే నేను రైలు దిగగానే వర్షమన్నమాట! రోడ్లన్నీ బురద మయం. అయినా తప్పదు. అతికష్టం మీద తత్కాల్‌లో రిజర్వేషన్ దొరికింది. ఇప్పుడు ప్రయాణం వాయిదా వేయడానికి, వెళ్లకుండా వుండడానికి కూడా కుదరదు.**



సీతారాముడి గురించి శివరావు ఫోన్లో చెప్పిందగ్గర్నించీ ఎపుడెపుడు చూస్తానా అని వుంది. "ఫలానా రైలుకి రిజర్వ్ చేసుకో, తెల్లారేటప్పటికి మా వూళ్లో దిగుతావు. నేను స్టేషన్‌కి కారు తీసుకొని వస్తాను. స్నానం, బ్రేక్‌ఫాస్ట్ అయ్యాకా బయల్దేరుదాం. కార్లో గంట, మహా అయితే గంటన్నర ప్రయాణం" అన్నాడు శివ. వెంటనే లాప్‌టాప్ తీసి నెట్‌లో ఐ.ఆర్.సి.టి.సిలో 'ఈ'టికెట్ బుక్ చేశాను.

అనకూడదు గానీ చాన్నాళ్లు అమెరికాలో స్థిరపడ్డానేమో! 'ఎన్ ఆర్ ఐ' సుకుమారులు ఎక్కువే. శివ తోడుంటే సరదాగా వుంటుంది. అన్నీ దగ్గరుండి చూసుకుంటాడు. వాతావరణ హెచ్చరిక గురించి ప్రస్తావిస్తే "అవన్నీ నీకెందుకురా! నాకొదిలెయ్. నేను చూసుకుంటానుగా" అన్నాడు. శివలో నాకు నచ్చేది అదే. హైస్కూల్ నుంచీ అలాగే వున్నాడు. ఏం మారలేదు.

సీతారాముడి గురించి ఎపుడూ వినలేదు. నాకు అతనితో కించిత్ పరిచయం కూడా లేదు. అయినా ఆ పేరు తల్చుకోగానే ఎంతో సుపరిచితుడనిపిస్తోంది. సీతారాముడిని మాటలతో రూపుకట్టి నా కళ్లముందు నిలబెట్టాడు శివ.

టౌన్‌లో తాతల నాటి సొంత ఇంట్లో వుంటూ, బిజినెస్ చేసుకుంటూ సహృదయుడిగా, సామాజిక కార్యకర్తగా ఒక జెంటిల్‌మెన్ స్టేటస్ నిలుపుకున్నాడు శివ. వాడి ముగ్గురి పిల్లలూ మూడు దేశాల్లో వున్నారు. వెనక్కి రారు. అదొక్కటే కాస్త చింత వాడికి. నేను ఈ మధ్యే అమెరికా వదిలేసి మనదేశం వచ్చేశాను. నా పిల్లలూ అక్కణ్ణించి వచ్చే ప్రసక్తిలేదు.

చిన్నప్పట్నించీ ప్రాణస్నేహితులమైన మా ఇద్దరి జీవన గమనాలు వేరైనా అభిరుచులు ఒకటే. సంగీతం, సాహిత్యం, దేశభక్తి. శివ వాళ్ల వూళ్లో ఎన్నో సాహితీ సాంస్కృతిక సేవా సంస్థలకి పాట్రన్. నేనూ కొన్నింట్లో పాల్గొన్నాను. శివ చాలా యాక్టివ్. బిజినెస్ పని, సొంతపని అంటూ తరచూ హైదరాబాద్ వస్తుంటాడు. ఆ నాల్రోజుల నాస్టాల్జియా మళ్ళీ కలిసే దాకా వదలదు. ఇపుడు పట్నం, నగరం బాబులం కలిసి పల్లెలోని సీతారాముడి దగ్గరికి వెళ్తున్నాం. 'పల్లెటూరు మన భాగ్యసీమరా! పాడిపంటలకు లోటు లేదురా!' పాటలోని భావాన్ని కళ్లారా చూడబోతున్నానన్నమాట. యాభై ఆరేళ్ల నా వయసులో పాతికేళ్లు తగ్గినట్లనిపించింది.

స్టేషన్ దిగేసరికి సన్నని తుంపర. సమతుల శీతోష్ణ భోగిలోంచి దిగానేమో! వాన తుంపర, చల్లగాలి కలిసి క్షణకాలం చలిగిలి పెట్టాయి.

**గ్రామీణ కథల పోటీ విభాగంలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ**

శివ స్నేహాలింగనం వెచ్చగా చలి కాచింది. నా చేతిలోని బ్యాగ్ లాక్కుని భుజాన వేసుకున్నాడు.

“దానికి చక్రాలున్నాయి, లాక్కుపోవచ్చు” అంటే-

“ఏం బరువుందని చక్రాలు? మాకేం మీలా మెట్లదారి వారధులు (ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు), పదేసి ఫ్లాట్‌ఫారంలు లేవుగా, నాలుగడుగులు వేస్తే ఫ్లాట్‌పారం దాటి రోడ్డు మీదుంటాం. రా,రా... నువ్వొచ్చిన ఆనందంలో నేనే తేలిపోతున్నాను. ఇదో బరువా?!” నవ్వుతూ నా భుజం చుట్టూ చెయ్యేశాడు.




★ ★ ★ ★ ★

సాఫీగా వున్న రోడ్డు మీద శివ డ్రైవింగ్‌లో కారు నిదానంగా పోతోంది. సీతారాముడి సిరిపురంవైపు. స్టీరియో లోంచి పాత తెలుగు సినిమాపాటలు అలరిస్తున్నాయి. పొలాలు, నిలువెత్తు కొబ్బరి, తాడిచెట్లు, వాటి నల్లుకున్న తిప్పతీగలు, చిన్న కుంటలు, చెరువులు వాటిలో తామర పూలు. పొలాల కెళ్లేవాళ్లు, గొర్రెలు, మేకల కాపర్లు, నెత్తిమీద నీళ్ల కడవో, బిందో, చంకలో పిల్లనో మోసే స్త్రీలు, అమాయకంగా కళ్లింత చేసుకుని, నవ్వుతూ చూసే పిల్లలు, ఎంత దూరమైనా ఎత్తు పల్లాల మీద సునాయాసంగా సైకిళ్ల మీద సాగిపోయే యువకులు, చేతిలో కర్ర పట్టుకుని, అనుభవసారం జీర్ణించుకున్న బలంతో నడిచే వృద్ధులు.. ఒకటా, రెండా! దారిపొడుగునా అన్నీ కంటి కెమెరాలో బందీ అయ్యే సజీవ ఛాయాచిత్రాలే.

“ఈ మధ్య తరచూ నీ మాటల్లో సీతారాముడు కనబడుతున్నాడు. నీకు నచ్చాడంటే మామూలు విషయం కాదు. ప్రత్యేకత ఏదో వుండే వుండాలి” చల్లగాలికి క్రాఫ్ చెదురుతుందని కాదు అద్దం పైకి లేపుతూ అడిగాను.

“ప్రత్యేకమే రా. నువ్వు తనిని చూసేవరకు పూర్తి వివరాలు చెప్పొద్దనుకున్నాను. కానీ చెప్పాకే చూడ్డం బావుంటుందని ఇపుడనిపిస్తోంది. ” చెప్పడానికి ఉద్యుక్తు అవుతూ స్టీరియో ఆఫ్ చేశాడు శివ.

కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత “ఎక్కిణ్ణించి మొదలు పెట్టను? ఊ.. అతని పరిచయం దగ్గర్నించీ చెప్తాను. ఓపికుందా వినడానికి?”

“భలే వాడివే, ఇక్కణ్ణించి ఓ గంట ప్రయాణం అన్నావ్. ఏదో ఉబుసుపోక కబుర్ల బదులు ప్రయోజనకరమైన నాలుగు మంచి మాటలు వింటే మంచిదేగా. అసలు వచ్చిందే అందుకోసం కద రా శివ”

స్టీరియోలో సిడి మార్చి వాల్యూం బాగా తగ్గించాడు. మంద్రంగా చిట్టిబాబు వీణ వినిపిస్తోంది.

“నిజాయితీ, నిస్వార్థ గల కొందరు వ్యక్తుల్ని నాకివ్వండి, ఈ ప్రపంచానికి మనమేంటో తెలియజేస్తాను అన్న స్వామి వివేకానందుడికి సీతారాముడు ఏకలవ్య శిష్యుడు. ఏ శాస్త్రమైనా ఎపుడూ ఏమీ బోధించదు, విషయాన్ని విడమర్చి చెప్తుందని గ్రహించినవాడు. లక్ష్యసాధనతో గమ్యం చేరాలంటే పట్టుదల, కృషితోపాటు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిసినవాడు. ప్రాంతీయ, స్థానిక జీవన వైవిధ్యాన్ని అధ్యయనం చేసినవాడు. వీటన్నింటినీ నడపగలిగేది క్రమశిక్షణ ఒకటి అని విశ్వసించినవాడు. దేశం నాకేమిచ్చిందని గాక, దేశానికి నేనేమిచ్చానని ఆలోచించే అరుదైన వ్యక్తిరా.”

“మాట్లాడ్డానికి నీకు ప్రత్యేక వేదికలక్కర్లేదురా శివా. మనిషి గురించి చెప్పరా అంటే....”

“అందుకే అడిగాను ఓపికుందాని” శివ గొంతులో గాంభీర్యం.

“ఓర్నీ, నువ్వా నీ ప్రథమకోపం! కాస్త కూడా మారలేదురా. సరే, ఇంక అడ్డం రానులే చెప్పు” క్షమాపణగా చెవులు పట్టుకున్నాను నవ్వుతూ.

“అతని పరిచయం ఓ బట్టల దుకాణంలో. దుకాణం ప్రొప్రైటర్ మా బంధువే. బట్టలు కొనడానికి వెళ్తే తన రూమ్‌లోకి పిలిపించుకుని కాఫీ ఆర్డర్ చేశాడు. అప్పటికే అతని ముందు ఇంకో అతిథి వున్నాడు, ఒకరినొకరికి పరిచయం చేశాడు.

“చెప్పండి సార్, వచ్చిన పని” అన్నాడు అతిథితో.

“ఈ పట్టణంలో మీది చాలా పెద్ద షోరూం. మీ బ్రదర్స్ షాపులు నగరాల్లో విస్తరించివున్నాయి. మంచి సేల్స్ గర్ల్స్‌ని, బాయిస్‌ని ఎంపిక చేసుకుని వాళ్లకి యూనిఫారాలు కూడా ఇస్తున్నారు. సిటీల్లో 365 రోజులు మీ షాపులు తెరిచే వుంటాయి. షిఫ్ట్ డ్యూటీల్లో పనిచేసే మీ సేల్స్ సిబ్బందికి... నా రిక్వెస్ట్ ఏమిటంటే వారానికొకరోజు చేనేత చీరలు, షర్ట్‌లు యూనిఫారంగా ధరించే ఏర్పాటు చేయండి. మా ఊరి నేతగాళ్లతో మీకు కావల్సినట్లు నేయించి, డిజైన్లు అద్దకం చేయించి నేను మీకు క్రమం తప్పకుండా సప్లయ్ చేయిస్తాను. మీరీ సాయం చేస్తే ఆ కుటుంబాల వారు రెండు పూట్లా తింటూ, ఇంటిని పిల్లల చదువులు, పెళ్లిళ్లు చూసుకుంటూ సంక్షేమంగా వుండగలుగుతారు. మిమ్మల్ని చూసి మిగతా ఎవరైనా అనుకరించి, అమలుపరిస్తే వాళ్లు, వాళ్ల బతుకులు ఇంకాస్త బాగుపడతాయని ఆశ...” అన్నాడను.

"ఆశ్చర్యంతో, ఒకరకమైన ఉద్వేగంతో నా కళ్లు చెమ్మగిల్లాయి, ప్రొపయిటర్ లేచి నిలబడి, అతనికి చేతులు జోడించి సమ్మతిని తెలియజేస్తూ నాలుగురోజుల్లో వాళ్ల ఊరొచ్చి మిగతా విషయాలు మాట్లాడుతానని ఆర్ద్రంగా చెప్పాడు, అన్న మాట నిలబెట్టుకున్నాడు."

"అవునా?!" ఆశ్చర్యంతో నోరు తెరిచాను.

"అప్పుడే ఆశ్చర్యమంతా ఖర్చు పెట్టకు. ఇంకా విను. ఇపుడంతా డిజైనర్ చీరలు ఫ్యాషన్‌కదా! ఊళ్లో ఆడవాళ్లకి ఆ విద్యలో శిక్షణ ఇప్పించి, షాపుల వాళ్లతో బేరాలు కుదిర్చి, వాళ్లిచ్చిన చీరల మీద చమ్కీలు, పూసలతో డిజైన్లు వేయించి, చీర టెక్చర్, ఖరీదును బట్టి చీరకింతని ధర నిర్ణయించి బల్క్ ఆర్డర్లు సంపాదించి పెట్టారు.

"కార్లు, మోటార్‌బైక్‌లు, స్కూటర్లు వగైరా సర్వీసు స్టేషన్లకి, సరఫరా కేంద్రాలకి వెళ్లి మీ క్లీనింగ్ మెటీరియల్‌గా సరసమైన ధరకి ముడి నూలు సరఫరా చేయిస్తాను అన్జెప్పి ఊరి నేతగాళ్ల ముడి నూలుకి, టైలర్ల దగ్గర సేకరించిన నూలు బట్ట ముక్కలకి అద్భుతమైన మార్కెటింగ్ వెసులు బాటు కల్పించాడు. తనకోసం ఎవర్నీ ఏమీ అడగడు ఊరి కోసమే అతని ఉపకారమంతా.

"పాత కాలంలోలాగా ఊరి పంచాయితీ కార్యాలయంలో రేడియోసెట్ పెట్టి, లౌడ్ స్పీకర్లు పెట్టించి రేడియో కార్యక్రమాలు వినే ఏర్పాటు చేశాడు. ఆధునికంగా పరిమిత వేళల్లో, ఛానెళ్లలో ఉపయుక్త టివి ప్రోగ్రామ్స్ చూడగలిగే వెసులుబాటు కల్పించాడు. నీలాంటి, నాలాంటి వాళ్లతో సందేశాత్మక నాటకాలు, పాటలు, రూపకాలు రాయించి స్థానిక కళాకారులతో ప్రదర్శనలు వేయించి ప్రభుత్వ పథకాలు ప్రజలు పూర్తిగా అర్థం చేసుకుని, అమలు పరుచుకునేలా చేశారు. ఒక్కోసారి తనూ రాస్తాడు. రంగస్థలం మీద వేషమూ కడ్తాడు."

"వారెవ్వా! భలే వుందిరా శివా!"

"ఇది వింటే ఇంకా ఆశ్చర్యపోతావ్. బైటి ఊళ్ల నుంచి ఆయా రంగాల్లో ప్రాచీణ్యం వున్నవారిని, విద్యావంతుల్ని రప్పించి పర్యావరణం, పరిశుభ్రత, ఆధునిక వ్యవసాయం, చదువు, ఆహారం-ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల మీద సోదాహరణ ప్రసంగాలు చేయించి ఉడతా భక్తిగా వారిని సత్కరించి పంపుతాడు. ఉమెన్స్ రోటరీ, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థల ద్వారా ఉచిత వైద్యశిబిరాలు పెట్టించి హెల్త్‌కేర్ తీసుకుంటాడు. ఈ తరం వాళ్లకోసం ఊరి పెద్దలతోనూ అనుభవాలు చెప్పిస్తాడు.

వయస్సుకి సంబంధం లేకుండా అక్షరజ్ఞానం వున్న వారంతా చదువుకోగలిగేలా అన్ని అంశాలకు సంబంధించిన పుస్తకాలతో వివేకానంద గ్రంథాలయం, కంప్యూటర్ తరగతులు పెట్టించాడు. నీకు చెప్పలేదు కదూ! నేను, మన శోభనాద్రి, పూర్ణచంద్ అందరం మంచి మంచి పుస్తకాలు గ్రంథాలయానికి బహుమతిగా ఇచ్చాం. మా అమ్మ తన భాగవత, రామాయణాలు టీకా తాత్పర్యంతో ఉన్నవి ఇచ్చింది. మా మేనల్లుడు మా ఊళ్ళోనే కంప్యూటర్ బిజినెస్‌లో ఉన్నాడు. వాడు, వాడి ఫ్రెండ్స్ తీరికగా వున్నప్పుడు సిరిపురం పిక్నిక్‌గా వెళ్లి పిల్లలకి కంప్యూటర్ కోర్స్‌లో మెళుకువలు నేర్పడం, మరమ్మత్తులు చేయడం చేస్తుంటారు తెలుసా?"

"నువ్వు చెప్తుంటే ఏదో డాక్యుమెంటరీ చెప్తున్నట్లుంది. ఈ బిజీ యుగంలో, ఇంతటి అవ్యవస్థలో అలాంటి వ్యక్తి వుండటం... మైగాడ్, నమ్మలేకపోతున్నాను..."

"చూస్తావుగా, మట్టే బంగారు అని నమ్మినవాడు, 'పచ్చని పచ్చికపై మేను వాల్చాలని పైరగాలి వచ్చి పలకరించాలని,' మానవత్వమే దైవత్వం అని విశ్వసించినవాడు. అతని ధ్యాస, శ్వాస తన గ్రామం. దాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దడమే అతని ధ్యేయం. సీతారాముడితో పరిచయం పెరిగి, కలిసి మెలసి తిరుగుతున్న కొద్దీ అతని వ్యక్తిత్వంలో కొత్త కొత్త కోణాలు కనబడుతున్నాయి నాకు."

"ఊళ్లో కులమతాల గొడవలు, రాజకీయాలు లేవా?"

"ఎందుకుండవ్? ఊరన్నాకా అభిప్రాయ భేదాలతో సహా అవీ ఇవీ అన్నీ తప్పవు. కానీ వృత్తి వ్యాపారులను గౌరవిస్తే, ప్రతికుటుంబానికి స్వయం ఉపాధి, స్వావలంబన వుండాలని ప్రభుత్వానికి, ప్రజలకి మధ్య వారధిగా వుంటూ, వ్యవసాయపరంగా మట్టి రేణువులకి, విద్యాపరంగా అక్షరాలకి సమస్థాయినిచ్చి తలలో నాలుకలా అందర్నీ కలుపుకుపోతుంటే వాటి ముందు మిగతావన్నీ చిన్నవైపోతాయి"

"క్వైట్ ఇంట్రెస్టింగ్..."

"నిజమే, చూస్తే గాని ఎవరూ నమ్మలేరు. ఊళ్లో మత పరంగా ఎవరి నమ్మకాలు వారివి, ఒకరినొకరు వేలెత్తి చూపుకునే అవసరం, అవకాశం లేనపుడు అంతా ఒకటేనన్న భావన దానంతట అదే వస్తుంది. సీతారాముడు చేసింది, చేస్తున్నది, చేసేది అదే గ్రామీణాభివృద్ధి అధికార్లు, జిల్లా కలెక్టరు సైతం అతన్ని చూసి ముచ్చట పడతారు. అన్నింటా



స్నేహహస్తం అందిస్తారు. అంతకంటే ఏం కావాలి చెప్పు.

"ఆటలు, పాటలు, పండగలు, జాతరలు తెలుగు సంస్కృతీ వైభవంతోను, సంప్రదాయాలతో గ్రామం కళ కళ లాడి పోతుంటుంది. పేరుకే చిన్న ఊరు. గ్లోబలైజేషన్‌తో ప్రపంచమంతా పెద్ద గ్రామమై పోయింది, అయినా ఆదర్శంలో, ఆశయ సాధనలో ఇంకేదీ దీనికి సాటి రాదు. చూస్తావుగా. వచ్చేశాం" అంటూ ఊరి పొలిమేరల్లో ఏర్పాటు చేసిన స్వైన్ ఫ్లూ అవగాహనా శిబిరం పక్కన కారాపాడు శివ.

తెలిసిన డాక్టర్లు, స్వచ్ఛంద సేవా కార్యకర్తలు శివాని విష్ చేశారు. కొందరు గ్రామస్థులు అప్రయత్నంగా చేతులు జోడించారు చిరునవ్వుతో. కాలినడకన గ్రామంలోకి ప్రవేశించాం. ఆగి ఆగి తుంపర పడుతున్నా రోడ్ల మీద బురదలేదు, ఇసుక, సన్న కంకర వేసి బాగా దిమ్మిస చేశారు. తారు రోడ్లని తలపిస్తున్నాయి. 'భళా' అనుకున్నాను.

చేయి తిరిగిన చిత్రకారుడు పెద్ద కాన్వాసు మీద చిత్రించిన ల్యాండ్ స్కేప్‌లా కుదురుగా వుండే ఊరు, ఇళ్లు, పచ్చని చెట్లు, శుభ్రమైన రోడ్లు తీర్చిదిద్దిన బొమ్మల కొలువులా వుంది గ్రామం. పూలు, పళ్లు, కాయగూరలు లేని మొక్క, చెట్టు లేదు. ఆకుకూరల మడులు తప్ప అలంకరణ కోసం ఒక్క పనికిరాని క్రోటన్ ఆకుల మొక్కలేదు. 'నువ్వో చెట్టు పెంచి దాన్ని సంరక్షిస్తే ప్రకృతే నీకు తలవంచుతుంది' అన్న సూక్తి అక్షరాలా సరిపోయేలా ఎటు చూసినా ప్రాణవాయువునిచ్చే పచ్చదనమే.

"ఇదే సీతారాముడి ఇల్లు" అంటూ గేటు తీసి చిన్న కాంపౌండ్‌లో వెనక్కి కట్టిన ఇంటిమెట్ల దగ్గర ఆగాడు శివ. వీధి వరండాలో టేబుల్ వెనుక కుర్చీలో కూర్చున్న వ్యక్తిలేచి నిలబడ్డాడు. "సీతారామ్ ఇతనే నా ఫ్రెండ్ గోపాల్" అంటూ చెప్పులు వదిలి వరండా మెట్లక్కాడు శివ. ఆశ్చర్యంతో నేనలా నిలబడిపోయాను.

సీతారాముడి వయసు ముప్పయి అయిదు, నలభైకి మించదు. ఆరోగ్యంగా, ధృడంగా వున్నాడు. ఆత్మవిశ్వాసంతో కూడిన ముఖవర్చస్సుని అతని చిరునవ్వు మరింత కాంతివంతం చేస్తోంది. చంకల కింద కర్రలతో ఒంటి కాలుమీద నడుస్తూ నా దగ్గరికి వచ్చిన సీతారాముడికి ఒక కాలు పోలియో వల్ల పని చేయదని తెలిసి అవాక్కయ్యాను.

'ఈ వ్యక్తా! ఈ ఊరిని దేశ పటంలో ఆదర్శప్రాయంగా నిలిపింది! ఏ దృక్పథం వల్ల సమస్యలు ఎదురౌతాయో గమనించి, వాటిని మార్చుకునేలా చేసి, సమస్యా పరిష్కారాలకి మార్గం వేసినవాడు ఇతనా!'

"మీరొస్తారని ఇవాళ కాలేజీకి శెలవు పెట్టాను, రండి" సీతారామ్ ఆహ్వానం. అపుడు గమనించాను. గోడమీద జి. సీతారాముడు, ఎమ్.ఎ. ఎకనామిక్స్, లెక్చరర్ అని రాసున్న నేమ్ ప్లేటు, మెట్ల పక్కన పార్క్ చేసి వున్న మూడు చక్రాల కైనెటిక్ స్కూటరు.

మేం వస్తామని తెల్సినా ఆర్భాటం చేయలేదు. యధావిధి పిల్లలకి పాఠాలు చెప్తూనే వున్నారు. టైం సెన్స్‌తో క్రమశిక్షణకంత ప్రాణం ఇస్తాడు



గనకనే ఈ గ్రామం ఇంత గొప్పగా వుంది. పుస్తకాలు సర్దుకుని వెళ్తున్న పిల్లల వెనకే వెళ్లిన నా చూపులు గేటు పక్కనున్న విరగకాసిన సీమచింత కాయచెట్లు, విరబూసిన పచ్చని ముళ్ల గోరింట, మెట్టతామర మొక్కల్లో చిక్కుకున్నాయి. చిరుజల్లులో చిందులు వేస్తూ వెళ్తున్నారు పిల్లలు.

గుండెలోతుల్లో, అంతరంగంలో అల్లుకున్న అల్లిబిల్లి ఆపేక్షల గూటిలో అతన్ని దాచుకోవాలనిపించింది. అప్రయత్నంగా నా చేతులు ఆత్మీయంగా సీతారాముడ్ని దగ్గరకి తీసుకున్నాయి.

శివ నవ్వుతూ "తగరం గిన్నెలో చల్లపులుసు, రాచ్చిప్పలో రోటిపచ్చడి, కందబచ్చలి ఆకు పెట్టిన కూర, గడ్డపెరుగు, పేరిననెయ్యి, జాడీలో ఆవకాయ.. లిస్ట్ చాలా పెద్దది. విందు సిద్ధంగా వుంది.కదలిరండి నట్టింట్లోకి" సన్నివేశాన్ని తేలికచేశాడు.

★ ★ ★ ★ ★

మంచితనం, మానవత్వం మనసునెంతగా గెల్చుకుంటాయో! ప్రత్యక్షంగా చూసిన అనుభూతి గాఢతతో తిరుగు ప్రయాణంలో ఎక్కువగా ఏం మాట్లాడలేకపోయాను.

'నాటేది ఒక్క మొక్క, వేసేది నూరు కొమ్మ, కొమ్మ కొమ్మ విరగబూసె వేలాదిగా! ఎన్ని కష్టాలు రానీ,నష్టాలు గానీ నీ మాట దక్కించుకో బాబాయ్. చేసేది ఏమిటో! చేసెయ్యి సూటిగా...' స్టీరియోలో ఘంటసాల పాట, ముసురు పట్టిన వాతావరణంలో తరగలుగా తేలివస్తున్న చల్లగాలి సేద దీరుస్తుంటే... ఇంతటి ఆనందస్ఫూర్తిని పంచిన శివకేసి కృతజ్ఞతగా చూస్తున్న నా కళ్లల్లోకి అంతే స్నేహంతో చూశాడు శివ. ☆

*Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. Editor : Phani Kumar*

# పంచాయతీల సాధికారితతోనే అభివృద్ధి సాధన




జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా నివేదికను విడుదల చేస్తున్న ప్రధాని మన్మోహన్‌సింగ్. చిత్రంలో కేంద్రమంత్రి సీపీ జోషి








B.R.G.F.
ప్రాంతీయ సదస్సు-
పుస్తక ఆవిష్కరణ



*Sthanika Palana* **RNI No. APTEL / 2009/27888**




Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.